సోమవారం గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
fb.com/vaartha Digital

కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మీ మీ వెంటే
KAPIL GROUP కపిల్ చిట్స్ 45
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-11-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 290 పేజీలు: 10+4 వెల: 6.50

## రాష్ట్రపతి, గవర్నర్‌లకు గడువు విధించలేం



### బిల్లుల ఆమోదంపై స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

### రాష్ట్రపతి రిఫరెన్స్‌పై విచారణ జరిపిన ధర్మాసనం

**బిల్లులు దీర్ఘకాలం పెండింగ్ సరికాదు.. పునః పరిశీలనకు పంపకుండా నిలిపివేయరాదు.. అత్యవసరమైతేనే సుప్రీం జోక్యం: సిజెఐ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, నవంబరు 20:** పార్లమెంట్ లేదా అసెంబ్లీలు తీర్మానం చేసిన బిల్లులను ఆమోదించడానికి రాష్ట్రపతి లేదా గవర్నర్లకు నిర్దిష్ట గడువు విధించలేమని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి న్యాయస్థానం గడువు విధించడంపై.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలకు సుప్రీంకోర్టు సమాధానమిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200/201 కింద బిల్లులకు అనుమతి ఇవ్వడంపై రాష్ట్రపతి, గవర్నర్ నిర్ణయాలకు న్యాయస్థానం >>2

## పద్మావతి అమ్మవారిని దర్శించిన రాష్ట్రపతి ముర్ము

**తిరుచానూరు, నవంబరు 20 ప్రభాతవార్త :** తిరుచానూరు పద్మావతి అమ్మవారిని భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న రాష్ట్రపతిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, దేవాదాయ శాఖ కార్యదర్శి శ్రీహరి జవహర్‌లాల్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, జెఇఒ వీరబ్రహ్మాం, సివిఅండ్ఎస్‌ఓ మురళీకృష్ణ, అర్చకులు బాబుస్వామి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతంపలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆశీర్వాద మండపంవద్ద దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ రాష్ట్రపతికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అనంతపురం డిఐజి సీమోషీ ఘోష్, టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్, డిఎస్పీ ప్రసాద్, సిఐ సునీల్ కుమార్, ఎవియస్ ధాకృష్ణమూర్తి ఎస్సై సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము

## టెండర్లు ఎలా కేటాయించారు?

### కల్తీనెయ్యి వచ్చినా కేసు ఎందుకు నమోదు చేయలేదు?

### మాజీ చైర్మన్ సుబ్బారెడ్డిని ప్రశ్నించిన సిట్

**తిరుపతి,నవంబరు 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో లడ్డూల తయారీకి 2020-24మధ్యకాలంలో టెండర్లు ఏ ప్రాతిపదికన పిలిచారు,టెండర్లలో పాల్గొన్న డెయిరీ యాజయాన్యం, కాంట్రాక్టర్లు ఎవరు అనే కోణంలో టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని సిబిఐ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఇప్పటికే నిందితుల రిమాండ్ రిపోర్టు ఆధారాలతో గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సుబ్బారెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించడంవిశేషం. లడ్డూప్రసాదంతయారీలో కల్తీనెయ్యి >>2




## 24 నుంచి 'రైతన్నా.. మీకోసం'

### వ్యవసాయంలో పంచసూత్రాలపై ఏడురోజులపాటు కార్యక్రమాలు

### అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తెద్దాం

### వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో సిఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



**విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయ రంగంలో పెనుమార్పుల ద్వారా సాగును లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ ప్రతీరైతు ఇంటికి ప్రజా ప్రతినిధులు, అధికారులు వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహా 10 వేలమందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలీకాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్ధేశం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి మీకోసం రైతన్నా పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనుంది.

ఈ సందర్భంగా టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. "17 నెలలుగా రైతుల్ని, వ్యవసాయాన్ని ముందుకు ముందుకెళ్తున్నాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో కలిపి రూ.6,310 కోట్లు రైతులకుచెల్లించాం. బిందుసేద్యానికి అధిక ప్రాధాన్యంఇస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపడుతున్నాం. ఇలాంటి >>2

## సమర్థ నాయకుడు మోడీ

### ఆయన సహకారంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

### నితీష్ నేతృత్వంలో బీహార్ కూడా అదే తీరు

### కొత్త సర్కార్ ప్రమాణ స్వీకారానికి హాజరైన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్



గురువారం పాట్నాలో ఉత్తర ప్రదేశ్ ముఖమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ, నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని మోడీ సహకారంతో ఎపి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మోడీ బలమైననాయకుడు అనే భావన ప్రపంచమంతా ఉందన్నారు.. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఉంది, పెట్టుబడులు పెట్టొచ్చనే ధైర్యాన్ని పారిశ్రామికవేత్తల్లో కలిగించారన్నారు.బీహార్‌లో ప్రజలు ఇటీవల ఇచ్చిన ఎన్నికల తీర్పు ప్రధాని నాయకత్వాన్ని మరింత బలపరుస్తుందన్నారు.ప్రధాని సహకారంతో నితీష్‌కుమార్ నేతృత్వం బీహార్ అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ఎన్డీఎ కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలన్ని పరస్పర సహకారంతో అభివృద్ధి సాధిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. విధ్వంస పాలనకు చరమగీతం పలికారు. 94శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి ప్రభుత్వాన్ని గెలిపిం >>2



గురువారం హైదరాబాద్‌లోని సిబిఐ కోర్టుకు హాజరైన మాజీ సిఎం వైఎస్ జగన్

## హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

**విజయవాడ, నవంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హైదారాబాద్‌లోని సిబిఐ స్పెషల్ కోర్టుకు విచారణ కోసం హాజరయ్యారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయన నేరుగా అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు చేరుకున్నారు. జగన్ కోర్టు హాల్‌లో కేవలం ఐదు నిమిషాలు మాత్రమే కూర్చున్నారు. న్యాయమూర్తి ముందు హాజరయ్యారు.
ఈ సందర్భంగా మీరేమైనా చెప్పదల్చు >>2


## 5 జిల్లాల్లో టెక్స్‌టైల్ పరిశ్రమలు


### - రాష్ట్ర చేనేత, జౌళి మంత్రి సవిత



**విజయవాడ, నవంబరు 20, ప్రభాతవార్త ప్రతినిధి:**సిఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరిన 8 ఒప్పందాలతో ఐదు జిల్లాల్లో టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. విశాఖ, చిత్తూరు, గుంటూరు, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారన్నారు. వీటి ద్వారా 6,460 మందికి ఉద్యోగాలొచ్చే అవకాశాలున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

టెక్నికల్ టెక్స్‌టైల్స్, రీసైక్లింగ్, గార్మెంట్స్, సిల్క్, అపెరల్ రంగాల్లో పెట్టుబడులు రానున్నాయన్నారు. విశాఖపట్నంలో ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ రూ.4వేల కోట్లు,ఎంవీఆర్ టెక్స్‌టైల్స్ రూ.105.38 కోట్లు, చిత్తూరు జిల్లా గంద్రాజుపల్లిలో బెంగుళూరుకు చెందిన జీనియస్ ఫిల్టర్స్ సంస్థ రూ.120 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా, హిందూపురంలో అరవింద్ అపెరల్ పార్క్ సంస్థ రూ.20 కోట్లు,గుంటూరులో వామిని ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ రూ.35 కోట్లు,అనకాపల్లిలో బీక్యూ టెక్స్‌టైల్స్ సంస్థ రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయని పేర్కొన్నారు.





గురువారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించడానికి వచ్చిన రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలకటానికి వచ్చిన హోంమంత్రి అనిత, మంత్రి రామనారాయణ రెడ్డి, టిటిడి ఇఒ సింఘాల్ తదితరులు

# సమర్థ నాయకుడు మోడీ

>> చారు. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. బీహార్ సిఎంగా నితీష్ కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల సిఎంలు, కేంద్ర మంత్రులు, బిజెపి అగ్రనేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర సిఎంలు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడ్నవిస్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘావాల్, బిజెపి అగ్ర నేత రవిశంకర్ ప్రసాద్, బీహార్ రాష్ట్రంలోని బిజెపి, జెడియూకు చెందిన పలువురు నేతలతో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమావేశమయ్యారు ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఎపి అభివృద్ధిలో అందరి సహకారం అవసరమన్నారు.సిఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సును జయప్రదమైందన్నారు. 45 దేశాల్లో మన సమ్మిట్ చర్చనీయాంశమైందంటే, విశాఖ పేరు మార్మోగుతోందంటే టీం వర్క్‌తోనే ఇది సాధ్యమైంది. ఈ సదస్సులో అర్థవంతమైన, విజ్ఞానవంతమైన చర్చలు జరిపామన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచే పారిశ్రామికాభివృద్ధి మీద దృష్టిపెట్టి పనిచేస్తున్నామన్నారు.వివిధ సంస్థలకు పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. ఈ క్రమంలో విశాఖ భాగస్వామ్య సదస్సుతో సంబధం లేకుండానే సుమారుగా రూ. 10 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఎపిపై పారిశ్రామిక వర్గాల్లో నమ్మకం కలగడానికి ఇదే నిదర్శనం అని అన్నారు.. వివిధ దేశాల వారు రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ. 13 లక్షల కోట్లకు పైగా చేరడంతో అంచనాలను 100 శాతం చేరుకోవడంతోపాటు... అదనంగా మరో 30 శాతం మేర పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా మార్గం సుగమం అయిందని సిఎం చంద్రబాబు అన్నారు.ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు పాల్గొన్నారు. నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారానికి పట్నాకు ప్రత్యేక విమానం చేరుకున్న సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్‌కే అక్కడి ఎన్‌డిఎ కూటమి పక్షాలు ఘన స్వాగతం పలికాయి,.రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారు సాదరంగా కార్యక్రమానికి ఆహ్వానించారు.

## తెలుగులో మాట్లాడండి: కలెక్టర్‌కు తెలంగాణ సిఎం రేవంత్ సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు20:** వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా ఒక కలెక్టర్ ఆంగ్లంలో వివరాలు తెలియజేస్తుండగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగులో మాట్లాడాలని సూచించారు. మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆంగ్లంలో వివరాలు వెల్లడించే ప్రయత్నం చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలుగజేసుకుని తెలుగులో మాట్లాడాలని అన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా ఉన్నారని, వారందరికీ అర్థమయ్యేలా వీలైనంత వరకు తెలుగులో మాట్లాడాలని ఆయన సూచించారు. దీంతో కలెక్టర్ గరిమ తెలుగులో వివరాలు వెల్లడించారు.

## ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రాపై ఇడి ఛార్జిషీట్

**న్యూఢిల్లీ, నవంబరు 20:** యూకేకు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపార వేత్త, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఛార్జిషీట్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది. కాగా, యూకేకు చెందిన ఆయుధాల కన్సల్టెంట్ సంజయ్ భండారీ కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాను ఈడీ విచారించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులైలో ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా వాద్రాపై ఛార్జిషీట్ దాఖలు చేసింది.

# 24 నుంచి 'రైతన్నా.. మీకోసం'

>> వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్ధతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాం. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతలకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలి. దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యాక్షన్ ప్లాన్ చేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రకృతి సేద్యం... అగ్రిటెక్ విధానాలతో కలిగే లాభాలు వివరించాలి**

"రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలి. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాం. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ చేస్తున్నాం. రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రమోట్ చేయాలి. కడపలో ప్రకృతి సాగును కూడా పరిశీలించాను... ఆ సాగు రైతులు చాలా సంతృప్తిగా ఉన్నాయి. ప్రైవేట్ ఎరువుల షాపుల కంటే గ్రోమోర్ కేంద్రాల్లోని ఎరువుల ధర తక్కువగా ఉంది. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. రైతుల ఏ పంటలు సాగు చేశారు... వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలను, సేంద్రీయ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందనేది వివరించాలి. పూర్తి వాటర్ మేనేజ్మెంట్ ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గడువు విధించలేం

>> ఎటువంటి గడువులను విధించలేమని పేర్కొంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్ ధర్మాసనం.. బిల్లుల ఆమోదంపై గడువును విధించడం రాజ్యాంగానికి వ్యతిరేకం అవుతుందని స్పష్టం చేసింది. బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్ల చర్యలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావని, ఆ బిల్లు చట్టంగా మారిన తర్వాతే న్యాయ సమీక్షను అభ్యర్థించవచ్చని కోర్టు ఉద్ఘాటించింది. తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ రాజ్యాంగపరమైన చిక్కులు తలెత్తాయి. ముఖ్యంగా ఆ తీర్పు ద్వారా రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లులు ఆమోదించడానికి గడువు విధించింది. దీంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కోరుతూ రిఫరెన్స్ పంపారు. ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి లేదా గవర్నర్‌లు తమ అధికారాల నిర్వహణ విషయంలో ఏ కోర్టుకు జవాబుదారీగా ఉండరని ఉదహరించారు. అలాగే ఆర్టికల్ 200 కింద బిల్లును తన ముందు ఉంచినప్పుడు.. మంత్రుల మండలి అందించే సహాయం, సలహాకు గవర్నర్ కట్టుబడి ఉంటారా? అని కోర్టును ప్రశ్నించారు.

**గవర్నర్లకు విచక్షణ.. కానీ అపరిమిత అధికారం కాదు**

దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గురువారం రోజు కీలక తీర్పును ఇచ్చింది. ముఖ్యంగా సుప్రీంకోర్టు తన తీర్పులో.. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించి గడువు విధించడం రాజ్యాంగానికి విరుద్ధమని తేల్చి చెప్పింది. అలాగే గవర్నర్ల అధికారాలపై పూర్తి స్పష్టతను ఇచ్చింది. కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని ధర్మాసనం వివరించింది. "గవర్నర్లు తమ అపరిమిత అధికారాలను వినియోగించలేరు. ఆర్టికల్ 200 కింద వారికి విచక్షణ అధికారం ఉంటుంది. కానీ ఆ విచక్షణ హేతుబద్ధంగా ఉండాలి" అని కోర్టు వివరించింది.

# టెండర్లు ఎలా కేటాయించారు?

>> వినియోగించారనే సంచలనంపై సిట్ చేపట్టిన లోతైన విచారణలో క్లైమాక్స్‌లో మాజీ ఛైర్మన్ వైవిని ప్రశ్నించారు. ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్లతో ఎలా పరిచయాలు, ఆ తరువాత కల్తీ నెయ్యి వచ్చిందని తెలిసినా ఎందుకు కేసు నమోదు చేయలేదు అనే కోణంలో ప్రశ్నలు వేసి సమాచారం రాబట్టినట్లు తెలిసింది. ఇప్పటికే సిట్ బృందం టిటిడి మార్కెటింగ్, కొనుగోలు విభాగం, పోటు విభాగం నుండి సేకరించిన సమాచారంతోబాటు వైవి పిఎ చిన్నఅప్పన్న నుండి రాబట్టిన కీలక ఆధారాలతో ఆరుగంటలకుపైగా విచారణ చేశారు. కొన్ని వివరాలు సేకరించారనేది తెలిసింది. చిన్నఅప్పన్నను టిటిడి వ్యవహారాల్లో ఎందుకు కలగజేసుకో మ్మన్నారు, దాని వెనుక లబ్ధి ఏపాటిది అనేవిచారణ చేయడంతో సుబ్బారెడ్డి సాధారణ సమాధానాలు ఇచ్చారనేది తెలిసింది. లడ్డూప్రసాదాల తయారీకి ఎంత కాలంగా కల్తీనెయ్యి వినియోగించారు?అసలు నెయ్యిసరఫరా చేయాల్సిన సంస్థలు, కాంట్రాక్టర్ల స్థానంలో మరొకరు సరఫరా చేశారనేది తెలిసినా ఎందుకు ఉదాసీనంగా ఉన్నారనే ప్రశ్నలకు అధికారులు పర్యవేక్షించే వాటిపై బోర్డు కలగజేసుకోలేదనేది ట్విస్ట్ వచ్చిందనేది తెలుస్తోంది. మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించాల్సిన అవసరం ఏముందనేది విచారణ చేపట్టినట్లు సమాచారం.మరీ ఇప్పుడు సిట్ తీసుకోబోయే చర్యలు ఏంటనేది ఉత్కంఠగా మారింది.



సిబిఐ కోర్టునుంచి బయటకు వస్తున్న జగన్ అభిమానులకు అభివాదం చేస్తున్న దృశ్యం

# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

>> కున్నారా అని జగన్‌ను సిబిఐ కోర్టు న్యాయమూర్తి అడిగారు. అందుకు జగన్ తరఫు న్యాయవాది నో అని జవాబు చెప్పారు. ఆపై జగన్ వ్యక్తిగత హాజరును న్యాయస్థానం రికార్డు చేసింది. అటెండెన్స్ పూర్తి అయిన తరువాత కోర్టు నుండి జగన్ బయటకు వెళ్లిపోయారు. జగన్ రాక నేపథ్యంతో హైదరాబాద్ నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు. కోర్టుకు వచ్చే 2 మార్గాలను ఆధీనంలోకి తీసుకుని.. న్యాయవాదులకు మాత్రమే లోపలికి అనుమతించారు. కోర్టు ప్రక్రియ పూర్తి కావడంతో ఆయన లోటస్‌పాండ్‌కు బయల్దేరారు. ఈ కేసులో 2013 సెప్టెంబరు నుంచి జగన్ మధ్యంతర బెయిల్‌పై ఉన్న విషయం తెలిసిందే. కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని జగన్ చేసిన అభ్యర్థనను సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సిబిఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు.

## కోర్టు తీర్పులను కేంద్రం ఉల్లంఘించడం సరికాదు

### సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్

**న్యూఢిల్లీ, నవంబరు 20:** కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకురావడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. కోర్టు తీర్పులను పక్కనబెట్టే అధికారం పార్లమెంట్ కు లేదని పేర్కొంది. ఈమేరకు 2021 లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ ట్రైబ్యునల్‌తో పాటు పలు ట్రైబ్యునళ్లు రద్దయ్యాయని మద్రాస్ బార్ అసోసియేషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ట్రైబ్యునళ్ల సంస్కరణ చట్టం అమలును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో న్యాయస్థానం కొట్టివేసిన చట్టాలకు వాటి నిబంధనల్లో స్వల్ప మార్పులు చేసి కొత్త చట్టాలు తీసుకురావడం రాజ్యంగ విరుద్ధమని అన్నారు. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కోరగా సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు ప్రాధాన్యతను బట్టి అవసరమైతే తామే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తామని చెప్పారు. దీంతో ప్రభుత్వ న్యాయవాది విచారణకు వాయిదా కోరగా సిజెఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ పొందే వరకూ ఈ కేసులో తీర్పు రావద్దని కోరుకుంటున్నారా?' అంటూ ప్రభుత్వ న్యాయవాదిని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం కోర్టు తీర్పులను ఉల్లంఘించడం సరికాదని పేర్కొంటూ.. ట్రైబ్యునళ్ల సంస్కరణ 2021 చట్టంలోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ తీర్పు వెలువరించారు.

## కట్టలు తెంచుకున్న జగన్ మద్దతుదారుల అభిమానం

**బేగంపేట నవంబరు 20,ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నగరానికి వచ్చిన వేళ బేగంపేట విమానాశ్రయం వద్ద వైఎస్సార్సీ శ్రేణులు పెద్ద ఎత్తున హంగామా చేసారు.కట్టలు తెంచుకున్న అభిమానంతో వారు విమానాశ్రయానికి ఊహించని స్థాయిలో చేరుకోవడం, సిఎం, సిఎం అంటూ నినాదాలు చేస్తూ విమానాశ్రయంలోనికి చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించడంతో ముందుగా పోలీసులు,వైఎస్సార్సీ శ్రేణుల మధ్య తోపులాట చోటు చేసుకుంది.అయినా వైఎస్సార్సీ శ్రేణులు రెచ్చిపోవడంతో పోలీసులు స్వల్పంగా లాఠీ ఛార్జి చేయాల్సి వచ్చింది.గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట చేరుకున్న వైఎస్ జగన్ గురువారం ఉదయం గం 10.51నిలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు.ఆయనతో పాటు ప్రత్యేక విమానంలో మాజీ మంత్రులు పేర్నివెంకట్రామయ్య(నాని),ధర్మాన కృష్ణదాస్ తదితరులు రాగా బేగంపేట విమానాశ్రయంలో మాజీ మంత్రులు రామచంద్రారెడ్డి,మేరుగ నాగార్జున,విడదల రజనీ,ఎంపీ ఎస్ వి మోహన్ రెడ్డి,ఎమ్మెల్యేలు పి.రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ తదితరులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు. జగన్ నాంపల్లిలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానానికి హాజరవుతున్నారంటూ వైసీపీ నాయకులు క్యాడర్‌కు సమాచారం అందించడంతో పెద్ద ఎత్తున శ్రేణులు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని జై జగన్,సీఎం,సీఎం,రప్పా రప్పా వంటి నినాదాలు చేసారు. ఉదయం గం 10.51నిలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉదయం గం11.11నిలకు బేగంపేట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో నాంపల్లిలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానానికి బయలు దేరి వెళ్లారు.

## చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని నిరూపించిన విద్యావేత్త చుక్కా రామయ్య అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఐఐటి శిక్షణ ద్వారా దశాబ్దాల పాటు ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది ఐఐటి రామయ్యగా గుర్తింపు పొందారన్నారు. చుక్కా రామయ్య పుట్టినరోజు సందర్భంగా ఆయనకు సిఎం శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో మరెన్నో పుట్టిన రోజులు చేసుకోవాలని ఆకాంక్షించారు.

## దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మా వద్ద లేరు

### హైకోర్టుకు తెలిపిన పోలీసులు

**విజయవాడ, నవంబరు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** మావోయిస్టులు దేవ్‌జీ,మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుర్చేలా పోలీసులను ఆదేశించాలంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటీషన్‌పై హైకోర్టుకు విచారణ జరిగింది. వారిద్దరూ తమ వద్ద లేదని పోలీసులు ఉన్నత నాయస్థానానికి తెలిపారు. అరెస్ట్ చేసిన ఇతర మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటీషనర్లను హైకోర్టు ఆదేశించింది. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్ స్టేట్ మెంట్ ఇచ్చారని పిటీషనర్‌తరపు న్యాయవాది తెలిపారు.ప్రెస్ స్టేట్‌మెంట్‌ను కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఇరువైపులా వాదనలువిన్న హైకోర్టు తదుపరివిచారణను శుక్రవారం వాయిదా వేసింది.

## నేడు పుట్టపర్తి రానున్న మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్

**పుట్టపర్తి, నవంబరు 20, ప్రభాతవార్త:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాలుపంచుకునేందుకు శుక్రవారం పుట్టపర్తికి రానున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఆయన ప్రత్యేక విమానంలో ఉదయం 09:15 గంటలకు పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయంకు చేరుకుంటారని, అక్కడి నుండి ప్రత్యేక కాన్వాయ్‌లో 09:25 గంటలకు సత్యసాయి ప్రశాంతి నిలయం చేరుకుంటారన్నారు. 09:30 గంటలకు భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని శతజయంతి ఉత్సవాలలో పాల్గొననున్నట్లు తెలియజేశారు. అనంతరం ఉదయం 11:00 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకొని ముంబాయికి తిరుగు ప్రయాణం కానున్నట్లు అధికారులు తెలియజేశారు.

## రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి తుఫాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని విజయవాడ (అమరావతి) వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 48గంటల్లో ఇది పశ్చిమ వాయవ్యదిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్ర,శని ఆదివారాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు, వచ్చే మంగళవారం కొన్ని చోట్ల భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

# కెటిఆర్‌పై విచారణకు అనుమతించిన గవర్నర్

### ఫార్ములా ఇ-కార్ రేసులో ఎ-1గా కెటిఆర్, ఎ-2గా అర్వింద్ కుమార్

### విచారణ అనంతరం చార్జిషీటు దాఖలు

**హైదరాబాద్,నవంబర్20:** ఫార్ములా ఈకార్ రేసు కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించడానికి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ గురువారం అనుమతి ఇచ్చారు. నిధుల దుర్వినియోగంపై విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఏసీబీ త్వరలో కేటీఆర్‌పై అభియోగాలు నమోదు చేయనుంది. విచారణ తర్వాత చార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. కేటీఆర్ ప్రజాప్రతినిధిగా ఉన్నందున్న ఆయనపై చర్యలకు గవర్నర్ అనుమతి కోరుతూ ఇటీవల ప్రభుత్వం లేఖ రాసింది. ఆ లేఖపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సానుకూలంగా స్పందించారు. కేటీఆర్‌పై విచారణకు అనుమతి ఇచ్చారు.కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటీఆర్ అరెస్ట్‌పై మీడియాతో మాట్లాడుతూ..2018లో ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్‌ను అమెండ్ చేశారు. ఏ మంత్రిమీద విచారణ చేయలన్నా.. విచారణకు ముందు గవర్నర్ అనుమతి తీసుకోవాలి. విచారణ తర్వాత ఛార్జ్‌షీట్ వెయ్యాలన్నా గవర్నర్ అనుమతి తీసుకోవాలి. విచారణకు ముందు గవర్నర్ అనుమతి తీసుకున్నాం. ఛార్జ్‌షీట్ ఫైల్‌చేయడానికి గవర్నర్ ఆమోదం కోసం పంపించాం. 3 నెలలు అవుతున్నా గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. గవర్నర్ అనుమతి లేకుండా కెటిఆర్‌ను అరెస్ట్‌చేసినా.. కేసుపెట్టినా పది నిమిషాలల్లో ఆయనకు బెయిల్ దొరుకుతుంది. కేసు నుంచి తప్పించుకోవడానికి దారి దొరుకుతుంది అని అన్నారు. ఇప్పుడు కెటిఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి లభించింది.ఫార్ములా ఈకార్ రేసింగ్‌పై 2022 అక్టోబరు 25న ఒప్పందం కుదిరింది. ఫార్ములాఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్ జెన్, మున్సిపల్ శాఖలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్‌లు హైదరాబాద్‌లో నిర్వహించేలా ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్ర వరి 10,11 తేదీల్లో నెక్లెస్‌రోడ్‌లో తొమ్మిదో సీజన్ రేసింగ్ నిర్వహించారు. తదుపరి ఏడాది 10వ సీజన్ నుంచి ఏస్ నెక్స్ట్‌జెన్ అకస్మాత్తుగా తప్పుకుంది. దాంతో ప్రమోటర్ గా హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)నే పాత్ర పోషించాలని అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు.ఈ నేపథ్యంలో 2023 అక్టోబరు 54.88 కోట్లను ఫార్ములాఈ ఆపరేషన్స్ సంస్థకు హెచ్‌ఎండీఏ నేరుగా బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు ఈ మొత్తం వివాదానికి తెరలేపింది.

### రాష్ట్రంలో ఫిన్లాండ్‌లోని 'ఆట ఆధారిత అభ్యాసం'

# ప్రయోగాత్మకంగా అమలు

### జిల్లాకో అంగన్‌వాడీలో చేపట్టనున్న విద్యాశాఖ

## ఫిన్లాండ్‌లో పర్యటన వివరాలు వెల్లడించిన ఐఎఎస్ అధికారుల బృందం

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఫిన్లాండ్ లోని 'ఆట ఆధారిత అభ్యాసం' విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. జిల్లాకు ఒక అంగన్‌వాడీలో ఫిన్నిష్ పూర్వ శిశువిద్య అమలుకు సహకారం అందించేందుకు ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్(ఈడీయూఎఫ్‌ఐ)ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్ అధ్వర్యంలో ఐఏఎస్‌లు నారాయణ, భరత్‌గుప్తా, విజయరామరాజు, బి.శ్రీనివాసరావు, గణేష్‌కుమార్‌లతో కూడిన బృందం ఇటీవల ఫిన్లాండ్ పూర్వ శిశువిద్య విధానం అమలుతో భవిష్యత్ తరాలకు మెరుగైన పునాదులు వేయడానికి మార్గం సుగమం అవుతుందని అధికారుల బృందం పేర్కొంది. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు ఈ విధానం దోహదపడుతుందని వెల్లడించింది. 'ఫిన్లాండ్‌లో ప్రాథమిక ఉపాధ్యాయులకు ఐదేళ్ల మాస్టర్ డిగ్రీ విద్యార్హత తప్పనిసరి. తనిఖీలు, ర్యాంకింగ్ లాంటి వ్యవస్థలు ఉండవు. ఉపాధ్యాయులు తమ భోధనా విధానాలు,మూల్యాంకనాలను వారే నిర్ణయించుకునే స్వయం ప్రతిపత్తి ఉంది. ప్రామాణిక పరీక్షలు లేని మూల్యాంకన విధానం లాంటి అంశాలు విద్యార్థి మనోవికాసానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. హెల్సింకి విశ్వవిద్యాలయం లోని ప్లేఫుల్ లెర్నింగ్ సెంటర్,వర్జియోక్యూలా డేకేర్ సందర్శనలు'ఆట అనేది అభ్యాసానికి మాధ్యమం,విరామం కాదు.'అనే సూత్రాన్ని రుజువు చేశాయి. పూర్వ శిశువిద్యలో 'డాన్సింగ్ మౌస్ ఎమోషన్ బోర్డు' లాంటి సాధనాలు పిల్లల భావోద్వేగ పరిశీలనకు అద్భుతంగా ఉపయోగపడుతున్నాయి.

ప్రిన్సిపల్‌కు పూర్తి పరిపాలనా అధికారం ఉంటుంది. మున్సిపాలిటీలు కేవలం నిధులు, మౌలిక సదుపాయాలకే పరిమితమవుతాయి'అని పేర్కొంది. 'హెల్సింకిలోని ఊడి గ్రంథాలయం అమరావతిలో ఏర్పాటు చేసే నాలెడ్జ్ హబ్‌కు ఒక బెంచ్ మార్కుగా నిలుస్తుంది.ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు, ఇన్నోవేషన్ స్ప్రింట్‌లు, డిజైన్ ఫ్యాక్టరీ నమూనా ఆధారంగా ప్రయోగాత్మకంగా ప్రోటోటైపింగ్ హబ్‌లన ఏర్పాటు చేయడానికి సంస్థలను గుర్తించాం.

ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్ మద్దతుతో అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో మార్పులు తీసుకురానున్నాం. యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ హెల్సింకిలో కళల విద్యలో ఉత్తమ పద్ధతులు,స్టూడియో ఆధారిత భోధన,మెంటార్‌షిప్ శిక్షణ,ఆల్టో యూనివర్సిటీలో డిజైన్ ఫ్యాక్టరీలో విభాగాల అనుసంధానం, ఓపెన్ ప్రోటోటైపింగ్ ల్యాబ్స్,స్టార్టప్‌లకు మెంటారింగ్ వ్యవస్థలపైన అధ్యయనం చేశాం' అని తెలిపింది.

## వారం - వర్జ్యం

21-11-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
కృ.పాడ్యమి మ.2.47
అనూరాధ మ.1.55, అనూరాధ కార్తె
వర్జ్యం : రా.9.11-9.58
దు.ఉ.8.14-8.59,
2) మ.12.17-1.02
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ప్రత్యర్థి వర్గం బలహీనపడుతుంది. భూవివాదాల నుండి బయట పడతారు. వస్త్రలాభం కల్గుతుంది.

**వృషభం:** కొత్త వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. చిన్ననాటి మిత్రులతో ఇష్టా గోష్ఠిని సాగిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** వివాహ యత్నాలు ఫలిస్తాయి. పెద్దవారికి సంబంధించిన విషయాలను పునః పరిశీలించుకుంటారు.

**కర్కాటకం:** సెంటిమెంట్లకు ప్రాధాన్యత నిస్తారు. దీర్ఘకాలిక సమస్యలకు గాను పరిష్కార మార్గాలు లభిస్తాయి.

**సింహం:** ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. వాహన సౌఖ్యం కల్గుతుంది.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి పథంలో ఉంటాయి. ఉద్యోగులకు కార్యాలయంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది.

**తుల :** రాజకీయ, కళారంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన ప్రయత్నాలలో పురోగతి ఉంటుంది.

**వృశ్చికం:** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. నిష్కారణమైన చికాకులు తప్పకపోవచ్చు. మిత్రుల నుండి సాయం పొందుతారు.

**ధనుస్సు:** నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు సమర్థవంతంగా ఎదుర్కొంటారు. పన్నులను సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** అహంభావ ధోరణిని విడనాడి సహోద్యోగులతో స్నేహభావంతో మెలగండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**మీనం:** వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు. సమయానికి నిద్రాహారాలు వుండవు. కొన్ని నిబంధనలను అతిక్రమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



# సికింద్రాబాద్ నుండి భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ మీదుగా సికింద్రాబాద్ నుంచి అయోధ్య కాశీ బైద్యనాథ్ ధామ్ పుణ్యక్షేత్ర పేరుతో ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మరో టూర్ ప్యాకేజీని ప్రకటించింది. పూరీ కోణార్క్ గయ వంటి ప్రఖ్యాత పుణ్య క్షేత్రాలు ఈ ప్యాకేజీలో ఉన్నాయి. భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆయా పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. తొమ్మిది రాత్రులు/ 10 పగళ్లు సాగే యాత్రా స్పెషల్ ఇది. జనవరి 21వ తేదీన సికింద్రాబాద్ నుండి ఈ భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళ్తుంది. మొత్తం 714 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇందులో స్లీపర్ 237, 3ఏసీ 425, 2ఏసీ 52. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ ఎక్స్‌ప్రెస్‌కు ఖాజీపేట్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లల్లో హాల్ట్ సౌకర్యం ఉంది. ఆయా స్టేషన్లల్లో ప్రయాణికులు బోర్డింగ్/డీబోర్డింగ్ అవ్వొచ్చు. తొలుత పూరీ జగన్నాథుడిని దర్శించుకోవచ్చు. అక్కడ ప్రత్యేక పూజలు చేయవచ్చు. కోణార్క్ సూర్య దేవాలయాన్ని సందర్శించవచ్చు. అనంతరం గయాకు వెళ్తుంది ఈ ఎక్స్ ప్రెస్. ఇక్కడ విష్ణుపాద ఆలయాన్ని దర్శించుకునే వెసలుబాటు ఉంది. ఆ తర్వాత వారణాశి వెళ్తుంది. కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి , అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయాల్లో పూజల్లో పాల్గొనవచ్చు. అక్కడి కారిడార్ సందర్శనం కూడా ఈ టూర్ ప్యాకేజీలో ఉంది. సాయంత్రం గంగా హారతిని తిలకించవచ్చు. దీని తర్వాత అయోధ్య. చారిత్రాత్మక బాలరాముడి ఆలయం, హనుమాన్ గర్హి ఆలయాలను దర్శించవచ్చు. అక్కడి సరయూ నది హారతిలో పాల్గొనవచ్చు.

# సాయి సన్నిధిలో ఘనంగా 11వ ప్రపంచ సదస్సు

## పాల్గొన్న 125 దేశాల ప్రతినిధులు

## ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరి



మహా సమాధిని దర్శిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 20 ప్రభాతవార్త** ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి సేవా సంస్థల 11వ ప్రపంచ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకలకు కేంద్ర జాతీయ రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సదస్సు రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి ప్రశాంతి నిలయం చేరుకున్న ప్రతినిధులు వారి దేశ పతాకాన్ని చేత పట్టుకొని సత్యసాయి మహాసమాధి చెంతకు ఊరేగింపుగా వచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం ధన్యవాదములు శ్రీ సత్యసాయి అను గీతాన్ని బృందంగా చేరి ఆలపించారు. అనంతరం సదస్సు కార్యాచరణను మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ , ట్రస్టు సభ్యులు ఎస్ఎస్ నాగనంద్, డాక్టర్ మోహన్‌లతో కలిసి ప్రారంభించారు. స్వాగత ఉపన్యాసాన్ని శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఎస్.ఎస్.నాగానంద్ మాట్లాడుతూ శతవర్ష జన్మదిన వేడుకలలో భాగంగా నేషనల్ లీడర్షిప్ ప్రోగ్రాంలో యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ,పీజీ, నేపాల్, శ్రీలంక, చైనా, జపాన్, ఇండోనేషియా, యూరోప్ , మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా మొదలకు దేశాలలో సేవాదళ్ సభ్యులు ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలలో, ప్రకృతి విలయ సమయాలలో అనేక సేవలను నిర్వహిస్తున్నారన్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య మాట్లాడుతూ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని 10 జోన్ల నుండి 135 దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి అయిన నితిన్ గడ్కరీ పాల్గొని సత్యసాయి చేస్తున్న నిస్వార్థ సేవలను గురించి ప్రసంగించారు. కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, సవితమ్మ, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఈ సదస్సు పూర్ణచంద్ర ఆడిటోరియంలో కొనసాగింది. ఈ సదస్సుకు విదేశాల నుండి దాదాపు 3000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తిరిగి సాయంత్రం సాయి కుల్వంత్ సభ మండపంలో గ్లోబల్ కౌన్సిల్ పరిధిలోని యువతి యువకులు అద్భుతమైన సంగీత గాన కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూరోప్ భక్తులు ఆలపించిన "శివ.. శివ.. శివ... వినరాదా..." అను గీతం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

# తిరుమల సమాచారం

## తిరుమలలో రాష్ట్రపతి ముర్ము

### - అత్యంత భద్రత నడుమ పద్మావతిలో బస - నేటి ఉదయం దర్శనం



**తిరుమల,నవంబర్ 20ప్రభాత వార్తప్రతినిధి:** అఖిలాండ కోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులందుకోవడానికి భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. అత్యంత భద్రత నడుమ ఘాట రోడ్డు మార్గంలో సాగిన రాష్ట్రపతి ముర్ముపర్యటన తిరుమలలో పద్మావతిఅతిధిగృహంకు విచ్చేశారు. ఇక్కడ టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పుష్పగుచ్చాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ముర్ము పద్మావతిఅతిధిగృహం గదికి వెళ్ళి విశ్రాంతి తీసుకున్నారు. రాత్రికి తిరుమలలోనే బసచేస్తున్న ఆమె శుక్రవారం ఉదయం తొలుత వరాహస్వామిని అనంతరం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. రాష్ట్రపతి రాకతో తిరుమల పూర్తిగా భద్రత వలయంలో ఉంది. తిరుమలలో రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామ నారా యణ రెడ్డి, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, జానకీదేవి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ఉన్నారు.

# దివిసీమ వికృతతాండవ ఘటన జీవితాన్నే మార్చేసింది

## - హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** దివిసీమ తన కర్మ భూమి అని, ఇక్కడ పొందిన ప్రేరణ మరువలేనిదని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్ అధ్వర్యంలో 1977 దివిసీమ ఉప్పెన 48వ వార్షిక సంస్మరణ సభ, మానవతామూర్తులకు దివ్యవందన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దత్తాత్రేయ విచ్చేశారు. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా స్థానిక వంతెన కూడలి లోని ఆయన విగ్రహానికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారంతా 1977 ఉప్పెన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గాంధీక్షేత్రంలో ఏర్పాటు చేసిన సభలో దత్తాత్రేయ మాట్లాడుతూ...ఉప్పెన సమయంలో నాగాయలంక మండలం పర్రచివర, దిండి. సొర్లగొంది, మూలపాలెం, కోడూరు మండలంలో చేసిన సేవల జ్ఞాపకాలు తన హృదయానికి దగ్గరగా ఉంటాయని చెప్పారు. సహాయక చర్యల కోసం 6 నెలలు గడిపిన కాలం తన జీవితంలో గొప్ప మార్పు తెచ్చిం దన్నారు. ఆ ప్రేరణ మరువలేనిదన్నారు. ఎక్కడ చూసినా కుప్పలుగా ఉన్న శవాలు చూసి చలించి పోయానని, సామూహిక శవ దహన కార్యక్రమం నిర్వహించానని చెప్పారు. మండలి వెంకట కృష్ణారావు మంత్రిహోదాలో ఉన్నా రోజూ ముళ్ళబాటలో నడిచి,...కాళ్ళకు పుండ్లు పడినా లెక్కచేయకుండా సహాయక కార్యక్రమాల్లో ప్రజలకు అండగా నిలిచారు.

# రాష్ట్రంలో మద్యంపై గణనీయంగా తగ్గుతున్న ఆదాయం

**విజయవాడ,నవంబరు19,ప్రభాతవార్తప్రతినిధి** :రాష్ట్ర ఖజానాకు మద్యం ద్వారా వచ్చే ఆదాయం భారీగా తగ్గుతోంది. ప్రభుత్వ వర్గాల సమాచారాన్ని అనుసరించింది, ఈ ఏడాది మద్యం ఆదాయం అక్టోబర్లో 56 శాతం తగ్గినట్లు తేలింది. ఆయా ఆదాయార్జన వర్గాలకు సంబంధించి ప్రభుత్వం తాజా విడుదల చేసిన సమాచారాన్ని అనుసరించి మద్యం విక్రయాలపై గత నెలల్లో ఆదాయం తక్కువగా ఉంది. గత ఏడాది అక్టోబర్లో రు.4,409 కోట్లు రాగా, ఈ అక్టోబర్లో కేవలం రు. 1,956 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలల్లో రు. 16,288 కోట్లు రాగా, ఈ ఏడాది అదే ఏడు నెలల్లో రు. 15,275 కోట్లు ఖజనాకు చేరాయి. అంటే, అంటే ఆరు శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. ఇలా భారీగా ఆదాయం తగ్గడానికి గల కారణాలను కూడా అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇక మొత్తం ఆదాయం కూడా ఆందోళన కలిగించేదిగానే కనిపిస్తోంది. గతేడాది అక్టోబర్ వరకు రు. 57,528 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్ వరకు కేవలం మూడు శాతం వృద్ధితో రు. 57,392 కోట్లు వచ్చింది. అయితే ఒక్క అక్టోబర్ నెల గణాంకాలు పరిశీలిస్తే 20 శాతం తక్కువగా వచ్చినట్లు తేలింది. గత ఏడాది అక్టోబర్లో రు. 10,235 కోట్లు రాగా, ఈ ఏడాది అక్టోబర్ లో రు. 8,203 కోట్లు మాత్రమే రావడం విశేషం. మిగిలిన ఆదాయ విభాగాలను పరిశీలిస్తే వాణిజ్య పన్నుల విభాగంలో గతేడాది కన్నా కేవలం నాలుగు శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. వాహనాల పన్నుద్వారా కూడా నాలుగు శాతమే వృద్ధి కనిపించింది.

# వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో శుభాలు కలగాలి: మంత్రి అచ్చెన్నాయుడు



**తిరుమల,నవంబర్ 20ప్రభాత వార్తప్రతి నిధి:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని, ప్రజలకు అవసరమైన ఆర్థిక, సామాజిక మౌళిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి తెలి పారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి అచ్చెన్నాయుడు స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులువేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తప్పుదోవపట్టించే సంస్థలకు విరాళాలివ్వొద్దు

## - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు విజ్ఞప్తి



**తిరుమల,నవంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:** పలు రకాల పేర్లతో తిరుమలతిరుపతిదేవస్థానం పేరును వినియోగించుకుని భక్తులను తప్పుదోవపట్టిస్తున్న సంస్థలకు విరాళాలివ్వొద్దని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆ సంస్థలకు ఎట్టిపరిస్థితుల్లోనూ భక్తులు నమ్మవద్దని కోరారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్, సేవ్‌టెంపుల్స్. ఓఆర్‌జిపేర్లతో వ్యవహారిస్తున్న కొందరు వ్యక్తులు తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు నవంబర్ 29న ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తప్పుడు ప్రచారం మొదలుపెట్టారు. ఈ మోసపూరిత చర్యలతో విరాళాలు సేకరించేందుకు భక్తులను తప్పుదారిపట్టిస్తున్నారని టిటిడి దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విధమైన అనుమానాస్పద సంస్థలకు విరాళాలివ్వకుండా, వారి మోసపూరిత వలలో పడకుండా భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తుల విశ్వాసం నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఛైర్మన్ నాయుడు స్పష్టం చేశారు.

# గ్రామపంచాయతీలు, జిల్లా పరిషత్తులకు నిధులు విడుదల చేయండి

## - సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు



రామ్‌ప్రతాప్‌కు వినతి పత్రం ఇస్తున్న జాస్తి వీరాంజనేయులు

**విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లోని గ్రామపంచాయతీలు, మండల జిల్లా పరిషత్తులకు 15 వ ఆర్థిక సంఘం నిధులు 998 కోట్లు విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ రామ్ ప్రతాప్‌కు అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారు. ఢిల్లీలోని కేజీ మార్గ్ లో గల ఆయన కార్యాలయంలో ఆయనను గురువారం కలిసి వినతిపత్రాన్ని జాస్తి అందించారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు రాజీవ్ రంజన్ లలన్ సింగ్ కార్యాలయ ఆఫీసర్ ఆన్ డ్యూటీ బీరేంద్ర కుమార్ మిశ్రా కు కూడా అందించారు కేంద్రం 2025-2026 వ ఆర్థిక సంవత్సరం 15వ ఆర్థిక సంఘం నిధులు రెండవ విడత 998 కోట్ల రూపాయలను గత నెల అక్టోబర్ లో విడుదల చేయవలసి ఉన్నదని ఆ నిధులను త్వరగా విడుదల చేయాలని వినతి పత్రాన్ని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,340కి పైగా గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థలు ఉన్నాయి చాలా గ్రామపంచాయతీలకు ఆదాయ వనరులు నిధులు లేక జీతాలు, అంబాసిడర్ జీతాలు విద్యుత్ బకాయిలు చెల్లించలేకుండా ఉన్నారన్నారు.

# పరకామణి చోరీ కేసులో వీడని ట్విస్ట్

## -కీలక ఫిర్యాదుదారుడు మృతితో తర్జనభర్జనలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడుల రూపంలో సమర్పించుకునే కానుకల్లో అమెరికన్ డాలర్ల చోరీకేసులో తొలిసారి నమోదైన కేసు విచారణలో తాజాగా ట్విస్ట్‌నెలకొంది. 2023 ఏప్రిల్‌లో జరిగిన 920 అమెరికన్ డాలర్ల చోరీ కేసుపై పరకామణి పూర్వ ఏవిఎస్ఒ వైవి సతీశ్‌కుమార్ భౌతికంగా లేకపోవడం, దర్యాప్తు సాగుతున్న ఈ కేసులో అడ్డంకులు రాకుండా కొత్తగా మరో కేసును నమోదు చేయాలని టిటిడి బోర్డు ఇటీవల నిర్ణయించింది. గత కేసు నమోదు అంత పటిష్టంగా లేదనే వాదనలతో క్రిమినల్ కేసుగా తిరుమల పోలీసులకు మళ్ళీ తాజాగాఫిర్యాదు చేయాలని భావించారు. అయితే ఇప్పుడు ఎవరిచేత ఈ కేసు పై ఫిర్యాదిచేయించాలి అనేది ఇప్పుడు సందిగ్ధతనెలకొందని తెలుస్తోంది. అదేగాక ఇప్పటికే ఈ చోరీ కేసుపై 2023లో తిరుమల వన్‌టౌన్ పోలీసులు 24/2023గా ఎఫ్‌ఐఆర్ కూడా చేశారు. ప్రధాన నిందితుడు సివి రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేయకున్నా కోర్టు వరకు వెళ్ళింది. ఆ తరువాత కొన్ని పరిణామాలతో ఈ కేసును అదే ఏడాది సెప్టెంబర్‌లో లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా రాజీకుదుర్చుకున్నారు. ఇందుకుగాను రవికుమార్‌నుండి 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను వేంకటేశ్వరస్వామికి విరాళంగా అందించామని గత బోర్డులో తీర్మానం చేయడం జరిగింది. ఈకేసు పూర్తిగా పక్కదారిపట్టి నిందితుడినుండి పెద్దలు లబ్ధిపొందారనే ఆరోపణలతో హైకోర్టు ఆదేశాలతో సిఐడి అధికారులు గత రెండు వారాలుగా సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు కూడా. ఇప్పుడు హైకోర్టు పరిశీలనలో ఉన్న కేసుపై మళ్ళీ కేసు ఎలా నమోదు చేయాలనే అంతర్మథనం పోలీసుల్లో వ్యక్తమవుతోంది. అదేగాక కీలకమైన టిటిడి బోర్డు ఫిర్యాదు చేస్తే ఎలా కేసు నమోదు చేయాలని తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలుస్తోంది.

# సాంస్కృతిక కళా సంపదను కాపాడుకుందాం: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**.విజయవాడ,నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునిక జీవనశైలిలో మసకబారుతున్న కళలు, సాంస్కృతిక కళా సంపదను పరిరక్షించుకుంటూ వాటిని భావితరాలకు అమూల్యమైన వారసత్వ సంపదగా అందించేందుకు కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించేలా జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కొహాన్స్ సంస్థ సహకారంతో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులు, కార్టూనిస్టులను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కథలు, కవితలు, కార్టూన్ల విభాగంలో పోటీలు కూడా నిర్వహించడం జరిగిందని.. 500కు పైగా ఎంట్రీలు వచ్చాయని, ఉత్తమ రచనలకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల యువతకు సరైన దిశానిర్దేశం లభిస్తుందని, సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లేందుకు చేయూత, నూతనోత్సాహం లభిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జిల్లాలో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని.. ఇందులో భాగంగా మరో ముందడుగుగా సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రసిద్ధ సాహితీవేత్తల ప్రసంగాలు, సాహితీ సేవామూర్తులకు సత్కారాలు, కథ, కవిత, కార్టూన్ల పోటీ విజేతలక నగదు బహుమతుల ప్రదానం తదితరాలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ భాగస్వాములై ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు నిరంతర సాధనకు పుస్తక పఠనం ఏకైక మార్గం. గ్రంథాలయాలు జీవన వికాసం సామాజిక పురోగతికి సోపానాలు ప్రజల జీవన వికాసం సమజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తాయని, గ్రంథాలయ విశిష్టతను నేటి తరానికి చాటి చెప్పి ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. 58వ జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా స్థానిక ఠాగూర్ స్మారక జిల్లా గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ సేవలకు గుర్తుగా ఆయన జన్మదినం రోజున జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాల అవశ్యకతను నేటి తరానికి తెలియచేయాల్సిన అవసరం ఉ ందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ బుక్స్, ఆడియో బుక్స్ వంటివి ప్రజలకు అందుబాటులోకి రావడంతో ప్రతి ఒక్కరూ కంప్యూటర్, మొబైల్స్, ల్యాప్టాప్ వంటి అధునాతన పరికరాల ద్వారా కావాల్సిన సమాచారాన్ని పొందగలుగుతున్నప్పటికి గ్రంథాల ద్వారా అందే సమాచారానికి మించినది లేదన్నారు. పుస్తక పఠనం మేదో వికాసానికి దోహదపడుతుందన్నారు. కంప్యూటర్ పఠనం ద్వారా నేత్రాలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. పుస్తక పఠనం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. పుస్తక పఠనం ద్వారా పొందే విజ్ఞానం, సమాచారం ఎల్లపుడు గుర్తు ఉండిపోతుందన్నారు. పుస్తక పఠనం నిరంతర అధ్యాయనం వంటిదని, గ్రంథాలయ అవశ్యకతను నేటి తరానికి

# తిరుమలలో అన్యమతచిహ్నాం స్టిక్కర్ వాహనం

## -వాహన డ్రైవర్ ,యజమానిపై కేసు నమోదు

**తిరుమల,నవంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో అన్యమత స్టిక్కర్ ఉన్న వాహనం గురువారం ఉదయం రావడంతో పెద్ద కలకలం రేగింది. తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకుని ఈ వాహనంలో భక్తులను తీసుకురావడంతో పెద్ద అపచారం జరిగింది. తిరుమలలో ఈ వాహనం రామ్‌భగీచా బస్టాండ్ సమీపంలోని అగ్నిమాపక కేంద్రం కార్యాలయం సమీపంలో పార్కుచేయడంతో స్థానికులు గుర్తించారు. ఏకంగా వాహనం ముందుభాగంలో పైన అన్యమత లోగోలు ఉండటం, వెనుకభాగంలో అన్యమత స్టిక్కర్అతికించడం, డ్రైవర్ భాగంలో అన్యమతానికి సంబంధించిన మరోలోగో దండ ఉండటంతో భక్తులు ఆందోళన చెందారు. ఈ విషయంపై స్థానికులు టిటిడి విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. తమిళనాడురాష్ట్రానికి చెం దని వాహనంగా గుర్తించడం, అన్యమత స్టిక్క ర్లు, లోగోలు అతికించిఉండటంతో ఆ వాహనాన్ని అలిపిరి తనిఖీ కేంద్రం 9వ లేన్‌లో గమనించకుండా పంపేశారు. తిరుమలలో విజి లెన్స్ సిబ్బంది ఆ స్టిక్కర్లను తొలగించారు. తిరుమల 2టన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

ఇ-టెండర్ ప్రకటన నం. GSU-GTL-ESC-LIFT-08-2025 తేది: 13.11.2025

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/ గతిశక్తి యూనిట్ / గుంతకల్ వారు క్రింది పనికి ఇ-టెండర్ కోరుతున్నారు. ముగింపు తేదీ & సమయం: 05.12.2025 11.00 గం. వద్ద

క్ర.సం.: 1, టెండర్ నం.: GSU-GTL-ESC-LIFT-08-2025, పని వివరణ: గుంతకల్ డివిజన్: SW-I- (i) రాయచూర్: ఎస్కలేటర్‌లు 3 సం.ల యొక్క ఏర్పాటు. (అప్ & డౌన్) కొత్త 12m FOB కొరకు (ii) ప్రస్తుతం ఉన్న FOB కు 2 సం.ల లిఫ్ట్‌ల యొక్క ఏర్పాటు. SW-II- (i) యాద్గిర్: 3 సం.ల ఎస్కలేటర్‌ల యొక్క ఏర్పాటు. (అప్ & డౌన్) కొత్త 12m FOB కొరకు (ii) ప్రస్తుతం ఉన్న FOB కు 2 సం.ల లిఫ్ట్‌ల యొక్క ఏర్పాటు. ప్రకటిత విలువ: రూ.3,81,84,747.30, బయానా: రూ.3,40,900.

బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు http://ireps.gov.in కు లాగిన్ అవ్వండి. సవరణ ఏదైనా ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/గతిశక్తి యూనిట్/ గుంతకల్.
A1859

తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.


# మావోయిస్టు అగ్రనేతలు హిడ్మా, టెక్ శంకర్‌లు ఎదురు కాల్పుల్లోనే మరణించారు

## - వారిని వేరే చోట చంపామనడం నిజం కాదు, మిగిలిన 11మంది ఆ పార్టీ కీలకనేతలే:డిజిపి హరీష్‌కుమార్



**విజయవాడ. నవంబరు 20,ప్రభాతవార్తప్రతినిధి:** మావోయిస్టు పార్టీ అగ్రనేతలు హిడ్మా, టెక్ శంకర్‌లను ముందుగానే అదుపులోకి తీసుకుని చిత్రహింసలు పెట్టి చంపామంటూ పోలీసులపై దుష్ప్రచారం చేయడం సరికాదని ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. వారు మారేడుమిల్లి ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో మరణించారన్నారు. వీరితో 13మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణించారని తెలిపారు. మృతుల దగ్గర లభించిన డైరీ ఆధారంగా 50మందికిపైగా మావోయిస్టులను అరెస్ట్ చేసామన్నారు. ఆంధ్ర ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పార్టీ టెక్నికల్ టీమ్‌కు ఇన్‌ఛార్జి, ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ లు, మందు పాతరల తయారీలో దిట్టని టెక్ శంకర్ అని వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోని జీఎంవలస వద్ద బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మెట్టూరు జోగారావు ఎలియాస్ టెక్ శంకర్ ఎలియాస్ బాబు పరిచయమిది. కొన్ని ఏళ్లలో దేశ వ్యాప్తంగా మావోయిస్టులు అమర్చిన అనేక ల్యాండ్‌మైన్లు, ఐఈడీల తయారీలో కీలక భాగస్వామిగా మంగళవారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అగ్ర నేత హిడ్మా జరిపిన దాడులు, ఆపరేషన్లు అన్నింటిలో సాంకేతిక పాత్రధారిగా శంకర్ వ్యవహరించారు. ఏవోబీలో సుదీర్ఘకాలం పాటు శంకర్ పని చేశారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతానికి వెళ్లారు. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి ఎలియాస్ ఉదయ్ మరణించిన తర్వాత మావోయిస్టు పార్టీ పునర్నిర్మాణానికి టెక్ శంకర్ చేస్తున్నారు.

# జీతాలకోసం కార్మికుల నిరసన

## - కాంట్రాక్టర్ కారు అడ్డగింత

**తిరుమల,నవంబర్ 20ప్రభాత వార్తప్రతి నిధి:** చేసిన పనికి మూడునెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆందోళనతో కార్మికులు నిరసన చేశారు. ఏకంగా ఆ సంస్థ కాంట్రాక్టర్ కారును అడ్డగించి కార్మికులు రోడ్డుపై ధర్నాచేయడంతో సమస్య ఎదురైంది. తిరుమలలో పారిశుధ్యపనులు చేపట్టే ఎస్ఎంఎస్ ఏజెన్సీ సంస్థ కార్మికులకు మూడునెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో కార్మికులు ఒక్కసారిగా గురవారం ఉదయం తిరుపతిలోని కపిలతీర్థం మార్గంలో ఆ కాంట్రాక్టర్ కారును అడ్డగించారు. తమకువేతనాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. రాష్ట్రపతి పర్యటన రోజు ఈనిరసనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే కార్మికులకు సర్దిచెప్పి నిరసన విరమించడంతో ఆందోళన తగ్గింది.


NOTICE

MAHADHAN

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr. No. | Particulars / Grade | NPK 10-30-13 | NPKS 10-05-31-7 |
|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 10 | 10 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 30 | 5 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 13 | 31 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 7 |
| 6 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 |
| 7 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 |
| 8 | Sodium (as NaCl) per cent by weight, maximum | 0.5 | 0.5 |
| 9 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 |
| 10 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 |
| 11 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble.
2. Improves Quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.

Packing : Available in 500 gm, 1 Kg, 5 Kg, 10 Kg and 25 Kg Packing.

Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.

Manufactured / Imported & Marketed by -
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036.
www.mahadhan.co.in

వార్త


మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో మీకు తెలిసొస్తుంది.

-జాకబ్ బ్రౌడీ

# సంక్షోభంలో యువజనం!

యువతే జాతి పురోగతికి మూలాధారం. నేటి బాలలు, యువతీయువకులే రేపటి దేశభవిత నిర్ణేతలు. యువజనశక్తియుక్తులే దేశాభివృద్ధికి బాటలంటూ ఉపన్యాసాలిస్తూ, కోట్లాది రూపాయలు వారి సంక్షేమం,అభ్యుదయం కోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లోరోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువకులే కాదు, ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. నగరాలు, పట్టణాల్లో ఉన్న యువతీయువకుల పరిస్థితి ఇందకు మినహాయింపు కాకపోయినా దేశ ప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత పరిస్థితి రానురాను అత్యంత దయనీయంగా తయారవుతున్నది. చదివిన చదువులకు తగ్గట్టుగా ఉపాధి దొరక్కపోయినా, జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకోలేని దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అర్ధాకలితో అల్లాడిపోతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ చివరకు ఇంజినీరింగ్‌లాంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసిన విద్యార్థులు సైతం గ్రామాల్లో రోజువారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక, ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశంలో కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీ,ఇన్నీ కావు. నగరాలకు చేరుకొని ఒక పూటే తింటూ పోటీ పరీక్షలకు తయారవుతున్న కోట్లాది మంది విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. పని చేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పనిచేయాలనే ఉత్సాహం ఉంది. సంఘంలో తమకు ఒక స్థానం సంపాదించుకోవాలనే తపన ఉంది. అయినా ఏ ఆధారం లేక నిరుత్సాహంగా అర్ధాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఏ చిన్న ఆధారం దొరికినా కష్టపడి పనిచేయడానికి వెనుకాడడం లేదు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులుచేసిన యువతీయువకులు నిన్నమొన్నటివరకు విదేశీ బాటపట్టేవారు. ఇప్పుడు రానురాను అవి కూడా ముగిసిపోతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు రెండోసారి స్వీకరించిన తర్వాత దాదాపు దారులు మూసేశారనే చెప్పొచ్చు. ఇందులో బాగానష్టపోయింది, పోతున్నది భారతదేశం నుంచి వెళ్లిన, వెళ్తున్నవారేనని చెప్పొచ్చు. వాస్తంగా అక్కడికి వెళ్లి చదువును మరింత పెంచుకొని, జీవనోపాధి సంపాదించాలని మనస్ఫూర్తిగా వారికి లేదు. కేవలం డబ్బు సంపాదన కోసమే అధికశాతం మంది వెళ్తున్నారు. ఇక్కడ ప్రజల డబ్బుతో చదివి, ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించాల్సిన యువతరం ఏదోరకంగా విదేశాలకు వెళ్లి తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొని అక్కడి ప్రజలకు సేవలు అందించడానికి ఆరాటపడడంలో ఉన్న అంతర్థానాన్ని అర్థం చేసుకోవాలి. ఇలా విదేశాలకు వెళ్తున్నవారిలో భారతదేశం అగ్రస్థానంలోఉంటే అందులో తెలుగురాష్ట్రాలు మొదటి వరుసలో ఉన్నాయని చెప్పొచ్చు. వీరంతా ఒకవేళ ఇక్కడే సేవలు అందిస్తారనుకున్నా వారికి తగిన వసతులు, వేతనాలు చెల్లించడంలో కేంద్రప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫలితంగా ఏదో ఒక జీవనోపాధి కోసం విదేశీ బాటలు పడుతున్నారు.ఇలా పడుతున్నవారిని మోసం చేసేవారు ఇటీవలకాలంలో పెరిగిపోతున్నారు. లక్షలాది రూపాయలు తలతాకట్టుపెట్టి అప్పుతెచ్చి దళారులకు ఇచ్చి మోసపోయిన నిరుద్యోగులు దేశంలో లక్షల్లోనేఉంటారు. ఇక నిరుద్యోగుల కోసంకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. స్వయం ఉపాధిపథకాల కింద కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతోశాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగమిస్తున్నాయి.ఆధునిక మానవుడు అపూర్వమైన మేధాశక్తిని సంపాదించుకొని శక్తియుక్తులు ప్రతిభా సామర్థ్యాలతో విశ్వాంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలకమైందని తెలియనివారు ఎవరూ లేరు. నవ భారత నిర్మాణానికి ఉద్యమించి దేశకీర్తి ప్రతిష్టలను ఇనుమడింపవలసిన పవిత్ర బాధ్యత యువజనుల భుజస్కంధాలపై ఉన్నదని సమాజాన్ని ముందుకు నడిపేది, కొత్త మార్గాలకు జాతి వికాసానికి చేతులు కలిపి దోహదం చేసేది యువజనులేననేది నిర్వివాదాంశం. ఇలాంటి ఉపన్యాసాలు వింటూనే ఉంటాం.ఆ ఉపన్యాసాలు చేస్తున్న ప్రకటనలు పరిశీలిస్తుంటే దేశంలో యువజన సంక్షేమం ఆశ్చర్యం గొలిపేలా పయనిస్తున్నదని భావిస్తాం. ఇన్నికోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా యువజనుల అభ్యున్నతే ధ్యేయంగాపనిచేస్తున్నామని పాలకులు ప్రకటిస్తున్నా ఇంతటి నిరుత్సాహం, నిస్పృహల్లో ఎందుకు యువజనులు మునిగిపోతున్నారనే అనుమానాలు రాకతప్పదు.అటు గ్రామాల్లో యువత,ఇటు నగరాల్లోని యువజనం కుల,మత, వర్గ,బేధాలులేకుండా అందరిలోనూ ఈ అసంతృప్తులు వ్యక్తమవుతూనే ఉన్నాయి.ఇవి పాలకులకు తెలియవని అంటే నమ్మశక్యంకాదు. అసలు యువజన సంక్షేమం కోసం చేపడుతున్నపథకాలు ఏమేరకు నిజమైన అర్హులకు అందుతున్నాయి? అందులో రాజకీయ జోక్యం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం వంటివి ఎందుకు నిరోధించలేకపోతున్నారు? ఇలాంటి కారణాలు ఎన్నో నిజమైన అర్హులకు దూరం చేస్తున్నాయి. అటు ఉద్యోగాలు రాక, స్వయం ఉపాధి పథకాలు కళ్లముందే అనర్హులపాలవుతుంటే నిరాశానిస్పృహలకు లోనవుతూ ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నవారు లేకపోలేదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి.యువజనుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. పాలకుల వైఖరిలో మార్పురావాలి. ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్దిష్టమైన కాలపరిమితిలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి. యువజన సంక్షేమ కార్యక్రమాలు త్రికరణశుద్ధిగా అమలు చేయాలి.

ఎంత సైంటిస్ట్ అయినా ఫార్ములాస్‌తో మాట్లాడలేడు కదా! ప్రధానంగా భాష సహాయంతోనే మాట్లాడాలి.



ఐన్‌స్టయిన్

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్లే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహాఫలితాలనిస్తుంది.



కె. స్టాన్ స్లావిస్కి

# ప్రజావాక్కు



## రైతులకు పెరుగుతున్న సవాళ్లు

పత్తి పంటభారత వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తుందనే విషయం తెలిసిందే.అయితే ఇటీవలి కాలంలో పింక్ బాల్‌వార్మ్ దాడులు పత్తి రైతులను తీవ్రసవాళ్లను ఎదుర్కొనే పరిస్థితికి నెడుతున్నాయి. పత్తి కాయల లోపలికి చేరి గింజలు, నూలు రెండింటినీ పాడుచేసే ఈ పురుగు వల్ల కాయలు బయటకు ఆరోగ్యంగా కనిపించినా లోపల పూర్తిగానాశనం అవుతుంటాయి.ఫలితంగాకోత సమయంలోనే రైతులకు అసలు నష్టం తెలుస్తుంది. ఈ దాడుల కారణంగా పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడం, నాణ్యత తగ్గడం వంటి సమస్యలు ఉత్పత్తి వ్యయాలను తిరిగి పొందే అవకాశాన్నే తగ్గిస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు, కూలీలకు భారీగా ఖర్చు పెట్టిన రైతులుచివరికిలాభం కాకుండానష్టాలతో నిలబెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో రుణభారం, మార్కెట్ అనిశ్చితి, వంటి ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## మీసేవ సిబ్బంది సమస్యలు ఎన్నో

రాష్ట్రంలోని ప్రభుత్వ మీ సేవ కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బందివారికి కనీస వేతనాలు పెంచాలి. సర్కార్ కొత్తగా ప్రవేశ పెడుతున్న సేవలవల్ల వారికి పనిభారం పెరుగుతున్నది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలుప్రజలకు అన్నిరకాల సేవలను అందిస్తున్నాయి. అయినప్పటికి గత రెండేండ్లుగా మీ సేవ కేంద్రాల కనీస వేతనాలు పెంచలేదు. వార్షిక బోనస్ ఇన్సెంటీవ్ చెల్లించలేదు. పీఎఫ్‌ఖాతాలను బ్రేక్ లేకుండా కొనసాగించడంతో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం విధివిధానాలు రూపొందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## వికలాంగులకు డిప్యూటేషన్ రద్దు చేయాలి

వికలాంగుల ఉద్యోగులువారి ఇష్టప్రకారం వారు కోరుకొంటేనే డిప్యూటేషన్‌లో పంపాలి.కానీ బలవంతంగా పంపవద్దు.వారు దృష్టిలోపంతో వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్నారు. ఒక సంవత్సర కాలం కూడా పూర్తి కాక ముందే డిప్యూటేషన్ అనిఅధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వికలాంగులు గదులు కిరాయికి తీసుకొని పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపడం జరుగుతుంది.

- రాపాక రవీందర్, జనగాం

## సోషల్ మీడియా ప్రభావం

ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించే దిశగా ముందడుగు వేయడం, ప్రపంచ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. ఇది కేవలం నియంత్రణ చర్య మాత్రమే కాకుండా పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రత, అభివృద్ధినికాపాడేందుకు తీసుకున్నసమయోచిత నిర్ణయం. భారత దేశం వంటి పెద్ద జనాభా కలిగిన దేశాల్లో ఈ చర్య మరింత అవసరం. సాంకేతిక వినియోగం పెరుగుతున్న కొద్దీ పిల్లలపై దానిదుష్ప్రభావాలు వేగంగావిస్తరిస్తున్నాయి. అందువల్ల భారత ప్రభుత్వం కూడా ఈ దిశగా ఆలోచించి, వయసు నియంత్రణ, ధృవీకరణ వంటి చర్యలను అమలు చేయడం అత్యవసరం. సోషల్ మీడియా పిల్లలపై కలిగించే హానికర ప్రభావాలు అనేకం. మొదటగా, మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. నిరంతరం లైక్‌లు, ఫాలోవర్లు, కామెంట్ల కోసం ఎదురు చూడటం వల్ల ఆందోళన, డిప్రెషన్, తక్కువ స్వీయగౌరవం వంటి సమస్యలు పెరుగుతాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## బంగ్లాతో స్నేహం

బంగ్లా చరిత్ర ఒక మలుపు వైపుగా ప్రయాణం చేస్తున్నది. దక్షిణాసియాలోనే మూడో దేశాధినేతగా వ్యవహరించిన వ్యక్తికి మరణ దండన పడిన నేపథ్యం చూస్తున్నాం. 1971 బంగ్లా లిబరేషన్‌లో పుట్టుకొచ్చిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ హసీనాకు మరణ దండన విధించింది. ఇకపోతే ఈ బంగ్లా పరిణామాలు భారత్ పైన కచ్చితంగా ప్రభావం చూపిస్తాయి. ఎలా భౌగోళికంగా భారత్ 4000 కిలోమీటర్ల పై బడి సరిహద్దును పంచుకుంటున్నది. సాంస్కృతిక స్నేహశీలతను ఆ దేశంతో కలిగి ఉంది. బంగ్లా విముక్తి పోరాటానికి భారత్ సహాయం చేసింది. అంటే భౌగోళికంగా, చారిత్రకంగా చూసిన భారత్ బాంగ్లాదేశ్ తో ఒక గొప్ప చారిత్రక నేపథ్యం కలిగి ఉంది.

-భారత అవినాష్, జనగామ

## లక్ష్మణ్‌ని హెడ్‌కోచ్‌గా నియమించాలి

వి.వి.ఎస్.లక్ష్మణ్‌ను భారత జట్టుకు హెడ్ కోచ్‌గా నియమించడం సముచితం. ఆయనకు అంతర్జాతీయ క్రికెట్‌లో విశాలమైన అనుభవం,నిశ్చల స్వభావం, ఆటగాళ్లను ప్రేరేపించే నాయకత్వ లక్షణాలుఉన్నాయి. భారతజట్టుకు ఎన్నో మరుపురాని విజయాల్ని అందించారు.ఎన్.సి.ఏ. హెడ్‌గా అనేక యువ ఆటగాళ్ల ప్రతిభనువెలికితీసిజట్టుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అభివృద్ధికి తూట్లు పొడుస్తున్న అవినీతి

చట్టాలు బలహీనంగా ఉంటే, నిఘా సంస్థలు నిద్రపోతే, ప్రజలు మౌనంగా ఉంటే అవినీతి పెరుగుతుంది. దీనికి నివారణ ఒకటే సామాజిక మేలుకొలుపు. దేశం మారాలంటే ప్రజల్లో సహనం పెరగాలి.రాజకీయ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యం పూర్తిగా తగ్గాలి. దర్యాప్తు సంస్థలకు సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వాలి.కఠినశిక్షలు తప్పనిసరి చేయాలి. పారదర్శక పాలన వ్యవస్థలను ప్రతిష్టించాలి. విద్యార్థులకు బాల్యంనుంచే నీతిపాఠాలు బోధించాలి. లంచం తీసుకున్నవారే కాదు, ఇచ్చిన వారికీ శిక్షలుండాలి. ఎన్నికల సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై పటిష్ఠ నిఘా ఉంటే ఓట్ల కు డబ్బుపంచడం ఆగిపోతుంది.అధికారులు తమను తాము శుభ్రపరుచుకుంటే వ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రజలు నిరసిస్తే పాలకులు వణికిపోతారు. అవినీతి రహిత భారతదేశం ఒక కలగానే మిగిలిపోతుంది అనేది ఒక నగ్న సత్యం. అందుకే మార్పు మన దగ్గర నుంచే ప్రారంభం కావాలి.



మన్నారం నాగరాజు

ప్రపంచం మొత్తం క్యాన్సర్‌లా వ్యాపించిన ఒక వ్యాధి ఉంది శరీరానికి కాదు, సమాజానికి.రక్తప్రసరణకు కాదు,పరిపాలనకు.దేశాల భవిష్యత్తును క్షీణింపజేసే ఓ భయంకర జాడ్యం అదే అవినీతి. నాగరికతలు అభివృద్ధి చెంది,ప్రజాస్వామ్యాలు బలపడుతున్నాయని మనం చెప్పుకుంటున్నా, ఈ దుర్భందానికి ప్రపంచంలో ఇప్పటికీ శాశ్వత ఔషధం దొరకలేదు. దేశం ఎంత అభివృద్ధి చెందినదైనా, ప్రజాస్వామ్యం ఎంత పెద్దదైనా, నిబంధనలు ఎంత కఠినమైనా ఈ కలుషిత లావా మన వ్యవస్థలను మన కళ్ల ముందే కాల్చేస్తూనే ఉంది. 2003లో ఐక్యరాజ్యసమితి తీసుకున్న నిర్ణయం ప్రపంచ దేశాల పాలనలో పారదర్శకత అవసరాన్ని స్పష్టంగా చెబుతోంది. అవినీతి తాకిడికి విపరీతంగా బాధపడుతున్న ప్రపంచ ప్రజలకు ఓ మేల్కొలుపు పిలుపు. డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలు అధిక పారదర్శకతతో, కఠిన చట్టాలతో అవినీతిని చాలా వరకు అదుపులో పెట్టాయి. మరో వైపు సిరియా, దక్షిణ సూడాన్, సోమాలియా, నార్త్ కొరియా వంటి దేశాలు అవినీతి అగాధంలో పూర్తిగా కూరుకుపోయి ప్రపంచ దృష్టిలో అత్యంత అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 1995 నుంచి ప్రకటిస్తున్న అవినీతి సూచీలో భారత్ స్థానమే మనకు అత్యంత చేదు నిజాన్ని చెబుతోంది. 180 దేశాల్లో మన దేశం 85వ స్థానంలో మాత్రమే ఉంది. ఇది మన అభివృద్ధి లక్ష్యాలకు పెద్ద అడ్డంకే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థకు దెబ్బకు దెబ్బ. అవినీతి భారతదేశంలో నిన్న మొన్నటి సమస్య కాదు. స్వాతంత్ర్యం వచ్చిన రెండేళ్లకే 1948లో జీపుల కుంభకోణం వెలుగుచూసింది. అప్పటి మన హైకమీషనర్ వి.కె.కృష్ణమీనన్, అన్ని ప్రభుత్వ ప్రోటోకాల్స్‌ను పక్కనబెట్టి 80 లక్షల రూపాయల విలువైన జీపుల కొనుగోలుకు విదేశీ కంపెనీతో అక్రమ ఒప్పందం చేసుకోవడం దేశంలో అవినీతి వ్యవస్థకు తొలి అధ్యాయం అయింది. ఆ రోజు నుంచే మన దేశంలో అవినీతి కేసులు వరదలా వస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం మారినా, నాయకులు మారినా, ఆశలు మారినాకానీ అవినీతి మాత్రం ప్రతి కాలంలో రెక్కలు విప్పి ఆకాశంలో ఎగిరింది. భారతదేశ చట్టాలు, న్యాయ వ్యవస్థ, పరిపాలనలో అనేక లోపాలు ఉండటం వల్ల ఈ అవినీతి రాక్షసానికి మరింత బలం వచ్చింది. ఉన్నతాధికారులకు ఇచ్చిన విస్తృత విచక్షణాధికారాలు, నిఘా సంస్థల నిద్రలేపకపోవడం, ఫైల్ ప్రాసెసింగ్‌లో ఉన్న అడ్డంకులు, పారదర్శకత లేకపోవడం, వ్యవస్థలో పాతుకుపోయిన పనితీరు ఇవన్నీ అవినీతికి కారణమయ్యాయి. అది ఒక మొక్కలా పెరిగి చెట్టుగా మారింది. చెట్టుగా మారి అడవిగా వ్యాపించింది. చివరకు న్యాయ వ్యవస్థ ద్వారాల దగ్గరికి కూడా చేరేసుకుంది. 2021లో అత్యధిక అవినీతి ఉన్న రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ పేర్లు చేరుకోవడం మనకు ఒక పెద్ద హెచ్చరిక. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రతినిధులుగా ఎన్నికైన ఎమ్మెల్యేలూ, ఎంపీలూ కూడా అవినీతి పాలై సమాజాన్ని తప్పుదోవ పట్టించడం దురదృష్టం. ఒకప్పుడు రాజకీయాలను సేవగా భావించేవారు. ఇప్పుడు రాజకీయాలు అత్యంత లాభదాయక వ్యాపారంగా మారిపోయాయి. ఎన్నికల్లోడబ్బు, మద్యం, బహుమతులు పంచడం సాధారణ ప్రక్రియగా మారిపోయింది. 50సంవత్సరాల క్రితం ఓటర్లకు డబ్బులివ్వాలని ఎవరూ అనలేదు. ఇప్పుడు శాసనసభ ఎన్నికలకు



100 కోట్లు, పార్లమెంటు ఎన్నికలకు 200 కోట్లు ఖర్చు చేస్తున్నారంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది? స్పష్టమే అవినీతి ద్వారానే. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఓటుకు 10,000 రూపాయలు వరకూ ఇవ్వడం సాధారణంగా మారిపోయింది. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో ఓ పార్టీ గోనెసంచుల్లో నోట్ల కట్టలతో కాలనీల్లో తిరుగుతూ ఇంటింటికి వెయ్యి రూపాయలు పంచిన ఘటన ప్రజాస్వామ్య పతనానికి చిహ్నం. ఇది కేవలం ఓట్ల కొనుగోలుకాదు. ప్రజాస్వామ్య విలువలకే ఖనన. ఇదంతా రాజకీయ నాయకులకే పరిమితం కాదు. పరిపాలన వ్యవస్థలోని ఉన్నతాధికారులు, ముఖ్యంగా ఉన్నతస్థానాల్లో ఉన్నవారు, ప్రతిష్టాత్మక పదవులలో ఉన్నవారు కూడా లంచాల్లో మునిగిపోయిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. 2018–19లో 643 ఫిర్యాదులు, 2019–20లో 753, 2020–21లో 581 ఫిర్యాదులు ఉన్నతాధికారులపై రావడం బాధాకరం. కాని అత్యంత భయంకరమైన పరిస్థితి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో నమోదు అవుతోంది. మొత్తం 1,15,000 మందిపై అవినీతి ఆరోపణలు రావడం దేశ పరిపాలనా దౌర్బల్యానికి స్పష్టమైన ప్రతీక. అందులో ప్రభుత్వ ఉద్యోగులపై మాత్రమే 11,000కేసులు రావడం ఆశ్చర్యం. కేవలం ప్రభుత్వ ఉద్యోగులే కాదు మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, మైనింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్, విద్యుత్, ఆరోగ్య రంగాలు ప్రతి రంగంలోనూ అవినీతి శిరాకేసి కూర్చుంది. 2013లో ఎర్నెస్ట్ యంగ్ సంస్థ ఇచ్చిన నివేదిక దీనికి ధృవీకరణ. ఇప్పుడు తెలంగాణ విషయానికి వస్తే ,రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అవినీతి గురించి చెప్పాలంటే, మాటలు సిగ్గుపడతాయి. రెండు సంవత్సరాల్లో మూడు సార్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు జరగడం కూడా ఇదే కథ చెబుతోంది. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఏ శాఖ చూసినా లంచాల బజారుగా మారిపోయింది. భూముల రిజిస్ట్రేషన్లకు 25,000 నుంచి60,000 వరకు బహిరంగంగా లంచం తీసుకుంటున్నారంటే సాధారణ మధ్యతరగతి ప్రజలపై పడుతున్న భారాన్ని ఊహించుకోవచ్చు. చిన్నపాటి వివాదాలున్న భూములైతే లక్షల్లో డిమాండ్లు చేస్తున్నారు. అధికారులకు అండగా కొన్ని డాక్యుమెంట్ రైటర్లు, దళారులు, రాజకీయ నాయకులు కలిసిఒక వ్యవస్థీకృత అక్రమ అండర్‌వర్ల్డ్‌ను ఏర్పరుచుకున్నారు.కొందరు రోజుకు లక్షలు సంపాదిస్తున్నట్లు ఏసీబీ విచారణల్లో బయటపడింది. వెంటనే స్పందించాల్సిన పరిస్థితి ఇది.కానీ అవినీతి అధికారులు దాడులు చేయొద్దని, లేని పక్షంలో ఉద్యోగాలకు రాకుండా సమూహంగా సెలవులు తీసుకుంటామని ప్రభుత్వానికే బెదిరింపులు పెడుతున్నారు!అవినీతిఇంత బలవంతం అవడం మన పాలనా వ్యవస్థ పతనానికి సంకేతం. హెచ్ఎండీఏ, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల్లో ఆస్తుల అక్రమకేసులు, ట్రాప్‌లు,ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో ప్రతి నాలుగు రోజులకు ఒక అవినీతి కేసు నమోదవుతోంది. ఇది కేవలం అంకెల సమస్య కాదు. ఇది ప్రజాస్వామ్యానికి వచ్చిన పగుళ్లు. ఈ అన్ని ఉదాహరణలు మనకు ఒక స్పష్టమైన నిజం చెబుతున్నాయి. చట్టాలు బలహీనంగా ఉంటే, నిఘా సంస్థలు నిద్రపోతే, ప్రజలు మౌనంగా ఉంటే అవినీతి పెరుగుతుంది. దీనికి నివారణ ఒకటే సామాజిక మేలుకొలుపు.దేశం మారాలంటే ప్రజల్లో సహనం పెరగాలి. రాజకీయ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యం పూర్తిగా తగ్గాలి.దర్యాప్తు సంస్థలకు సంపూర్ణ స్వేచ్ఛఇవ్వాలి.కఠినశిక్షలు తప్పనిసరి చేయాలి. పారదర్శక పాలన వ్యవస్థలను ప్రతిష్టించాలి. విద్యార్థులకు బాల్యంనుంచే నీతిపాఠాలు బోధించాలి. లంచం తీసుకున్నవారే కాదు, ఇచ్చిన వారికీ శిక్షలుండాలి. ఎన్నికల సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలపై పటిష్ఠ నిఘా ఉంటే ఓట్లకు డబ్బుపంచడం ఆగిపోతుంది.అధికారులు తమను తాము శుభ్రపరుచుకుంటే వ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రజలు నిరసిస్తే పాలకులు వణికిపోతారు. అవినీతి రహిత భారతదేశం ఒక కలగానే మిగిలిపోతుంది అనేది ఒక నగ్న సత్యం. అందుకే మార్పు మన దగ్గర నుంచే ప్రారంభం కావాలి. ●

# యువతకు ఆత్మస్థైర్యమే ఆయుధం

డాక్టర్. వై.సంజీవ కుమార్

నేడు యువత మేధస్సులో పదును తగ్గింది, ఆలోచనలో లోతు తగ్గిపోయింది. ఆవేశంలో వేగం పెరిగింది. కానీ వెళ్లాల్సిన గమ్యం ఏది అనేదే తెలియకుండానే పరుగెడుతున్నారు. జీవితాన్ని సార్థకం చేసుకునే వయస్సులో, తప్పటడుగులతో జీవితాన్ని నాశనం చేసే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆధునిక పోకడలు అధికమయ్యాయి. విలువలు, బాధ్యతలను వదిలేసేస్తున్నారు. సంతోషం, ఎంటర్టైన్మెంట్, ఎంజాయ్ అనే పేర్లతో నా జీవితం నా ఇష్టం అనే క్షణికానందంతో జీవితాలను అతలాకుతలం చేసుకుంటున్నారు. వాళ్ళ జీవితానికి ఇవ్వాల్సిన విలువ, పెద్దలకు, సమాజానికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేక సర్వస్వం కోల్పోతున్నారు. సామజిక స్పృహ, ధైర్యం లేని చోట, అవకాశాలు కనిపించవు. ఆత్మస్థైర్యం వదిలేసినప్పుడు, ప్రతి సమస్య పెద్ద కొండలా అనిపించేలా ఉంటుంది. భయంతో, అయోమయంతో, ఒక్క తప్పు అడుగు జీవితాన్ని తప్పు దిశలో నడిపేస్తోంది. విద్యార్థి దశ అభివృద్ధి కాలం, అభివృద్ధికి అన్వేషణ సమయం, జీవితానికి పునాది వేసే వయస్సు. కానీ ఈ దశలోనే యువత. దిశ మార్చి,దారితప్పి, తమలో ఉన్న అద్భుతమైన శక్తిని మరచిపోతున్నారు. వాళ్లలో కొరత ప్రతిభలో కాదు, ధైర్యాన్ని నిలబెట్టే మనసులోవారికి లోపం బుద్ధిలో కాదు. యువత ఇప్పటికైనా గ్రహించాలి. జీవితం ఒక్క రోజులో సార్థకం కాదు. కానీ తీసుకునే ఒక్క నిర్ణయం మాత్రం జీవితాన్ని మార్చిపెట్టగలదు. మనస్సులో పదును పెరిగితేనే, జీవితంలో వెలుగు పుడుతుంది. జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే చుట్టూ సమాజంలో కనిపించేవాటిలో ఎన్నో విషయాలను నేర్చుకోవచ్చు, అనేక సంఘటనల నుంచి గ్రహించవచ్చు, విజయం సాధించిన




ఎందరో మీ ముందు కనిపిస్తున్నారు, మీకు తెలియని వాళ్ళ జీవితాలకన్నా, మీకు కనిపిస్తున్న వాళ్ళ జీవితాలను గ్రహించండి. చిన్నస్థాయి ఉద్యోగం నుంచి అత్యున్నతమైన స్థాయికి చేరుకునేవాళ్ళు, వీధిలో వ్యాపారం నుంచి విదేశాలలో ఎగుమతులు చేసే స్థాయికి వచ్చినవాళ్లు, రీసెంట్‌గా చిన్న వయస్సులోనే శాసనసభ్యురాలిగా ఎన్నికైన మైథిలీ ఠాకూర్ ఇలా ఇందరో ఉన్నారు. వ్యాపారాలలో విజయపరంపర సాగిస్తున్న వ్యాపార వేత్తలు, ఇంకా ముఖ్యంగా ఐఏఎస్, ఐపీఎస్‌లు ఇలా ఎందరో మీ చుట్టే ఉన్నారు. వాళ్ళ జీవితాలను పరిశీలించండి, ఎన్ని ఒడిగుడుకులు ఎదుర్కొని సాధించారో అర్థం అవుతుంది. విజయం సాధించినవాళ్లు మొదటి ప్రయత్నంలోనే గెలుపు సాధించలేదు.లక్ష్యాన్ని ఏర్పరచుకొని అహర్నిశలు కష్టపడ్డారు. ఆకలి బాధలను ఓర్చుకున్నారు. కన్నీళ్లను దిగమింగుకున్నారు. ఓడిపోయినా పట్టు విడువ లేదు, లక్ష్యాన్ని సాధించేవరకు యుద్ధమే చేసారు. జీవిత ఆశయాన్ని నిలబెట్టుకున్నారు. జీవితాన్ని సార్థం చేసుకోవ డం ఒక కల, ఆ కలను సాధిస్తే మీరే ఎందరికో మార్గదర్శ కులు అవుతారు. జీవితం ఎడారి, రహదారిని నిర్మించుకో వలసింది మీరే, తప్పటడుగు వేస్తె జీవితం అగాధంలోకే వెళ్తుంది, మనిషి బానిసగా మార్చే వ్యసనాలను దరి చేర నీయకపోతే మీరు రహదారిలోనే వెళ్తునట్టే. ఎవ్వరో వచ్చి మేల్కొల్పరు.మీ జ్ఞానమే మీకు మేలుకొలుపు అవ్వాలి. జీవితం అత్యంత విలువైనది. కోల్పోవడం క్షణమే, కానీ నిలుపుకోవడం సాధించుకోవడం సాగిపోవడం జీవితాన్ని సార్థం చేసుకోవడమే. మనస్సును సానుకూలమైన వాటి పట్ల కేంద్రీకరిస్తే శక్తివంతంగా మారుతుంది. మీ దశ మార్చే వెలుగు రేఖ అవుతుంది. మీ దిశనే మార్చేస్తుంది. ఆలోచన ఓ విత్తనం, ఆచరణే దానికి జీవం. సాధిస్తే మహా వృక్షమే అవుతుంది, కావలసింది మీలో దృఢమైన సంకల్పం. ఆత్మస్థైర్యమే ఆయుధంగా మారాలి. దృఢమైన ఆచరణ కొనసాగిస్తే మీరే విజేత. ●

# నైపుణ్య విద్యతోనే ఉద్యోగ కల్పన సాధ్యం

సొప్పరి నరేందర్

విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే జ్ఞాన ప్రక్రియ. అది కేవలం పాఠశాలల్లో, కళాశాలలో పుస్తకాలు చదవడం మాత్రమే కాదు,మనస్సును, ఆలోచనలను, ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అతి పెద్ద జీవనపద్ధతి. విద్య అనేది మనిషిని లోపల నుంచి మార్చే మహోన్నత మార్గం. నైపుణ్యంతో ముందుకు నడిపిస్తుంది. నీతి విలువలతో సరైన మార్గం చూపిస్తుంది. నవచైతన్యంతో ప్రపంచాన్ని మార్చే ధైర్యం ఇస్తుంది. ఈమూడు లక్షణాలు కలిసినప్పుడే వ్యక్తి సంపూర్ణంగా ఎదుగుతాడు.సమాజం అభివృద్ధి చెందుతుంది. దేశం ముందుకు సాగుతుంది. విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం పుస్తకాల జ్ఞానం లేదా పరీక్షల మార్కుల వరకే పరిమితం కాదు. నిజమైన విద్య అంటే మనిషి ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి, జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకం. నేటి వేగవంతమైన ప్రపంచంలో నైపుణ్యాలు, నీతి,నవ చైతన్యం వంటి మూడు ముఖ్యాంశాలు ప్రతి ఒక్కరికి అత్యంత అవసరమైనవి. ఇవన్నీ కలిగినప్పుడు మాత్రమే వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యమవుతుంది. ఈ పరిపూర్ణతను అందించే మార్గమే సమగ్ర విద్య. నైపుణ్యం ఆధునిక ప్రపంచానికి పునాది, ప్రపంచం మారుతోంది. జ్ఞానం కంటే నైపుణ్యాలే నేటి ఉద్యోగ విపణిలో ముఖ్యం అవుతున్నాయి.కంప్యూటర్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, సమస్య పరిష్కరణ, నాయకత్వ లక్షణాలు వంటి అనేక నైపుణ్యాలు వ్యక్తిని విజయవంతుడిగా నిలబెట్టే మెట్లు. సాంప్రదాయ విద్యలో నైపుణ్యాల మీద పెద్దగా దృష్టి ఉండలేదు. కానీ పుస్తకాల్ని కంఠస్థం చేసే విద్యతో ఉద్యోగాలు కూడా రాకపోవడం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. కాబట్టే విద్యావ్యవస్థ నైపుణ్యాల పెంపు వైపు మళ్లాలి. పాఠశాలస్థాయి నుండే ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను బలపరచాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థి ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలను సృష్టించగలడు.నీతి వ్యక్తిత్వ వికాసానికి నిత్యావసరం, నైపుణ్యాలు ఉన్నప్పటికీ విలువలు లేకపోతే వ్యక్తి సమాజానికి హానికరుడు అయిపోతాడు. నీతి అనే విలువ మనిషిని లోపలి నుంచి మార్చుతుంది నిజాయితీ, దేశభక్తి, బాధ్యతా భారతం, పరస్పర గౌరవం, కరుణ, సేవాభావం ఇవన్నీ నీతి ద్వారా వచ్చే అంశాలు. ప్రస్తుత కాలంలో విలువలు తగ్గిపోతున్నాయని మనం ప్రతిరోజూ చూస్తున్నాం. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మానవత్వం తగ్గిపోకుండా చూసుకోవడం కూడా విద్యా వ్యవస్థ బాధ్యతే. విలువల పాఠాలు, కథలు, సమాజ సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, గురుశిష్య సంబంధాల పట్ల గౌరవం ఇవన్నీ విద్యార్థుల్లో నీతిని పెంపొందించగల అంశాలు. మంచి విలువలతో ఉన్న విద్యార్థి భవిష్యత్తులో మంచి పౌరుడిగా మారతాడు.నవ చైతన్యం అభివృద్ధికి కొత్త



దారి, భవిష్యత్తు నవచైతన్యాన్ని కోరుతోంది. కొత్త ఆలోచనలు, కొత్త ప్రయోగాలు, కొత్త పరిష్కారాలే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం అనేది సమగ్ర విద్యలో కీలక అంశం. కేవలం పాఠాలు నేర్పించడం సరిపోదు. ఆ పాఠాలపై సందేహాలు అడగడం, కొత్త ప్రయోగాలు చేయడం,వైఫల్యం భయపడకుండా ముందుకు సాగడం వంటి ధైర్యం విద్యార్థికి ఉండాలి. ల్యాబ్‌లు, ఇన్నోవేషన్ క్లబ్‌లు, సైన్స్ ఫెయిర్‌లు, స్టార్టప్ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవన్నీ నవ చైతన్యాన్ని పెంపొందించే మార్గాలు. నవ చైతన్యంతో ఉన్న విద్యార్థి ఉద్యోగం కోసం వెతకడు, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటాడు. సాంకేతిక రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతిచోటా ఈ సృజనాత్మక ఆలోచనకు అవసరం పెరిగింది. సమగ్ర విద్య అనేది విద్యార్థిని ఒకే కోణంలో కాకుండా పలు కోణాలలో ఎదగనిచ్చే ప్రక్రియ. అందులో విద్యా జ్ఞానం, సృజనాత్మకత, నైతికత, సామాజిక బాధ్యత, శారీరక ఆరోగ్యం, భావోద్వేగ పరిపక్వత అన్నీ సమపాళ్లలో ఉండాలి. పుస్తకాల జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన విలువలను నేర్పడం, నైపుణ్యాలను పెంపొందించడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే ఆలోచనను పోషించడం ఇవన్నీ సమగ్ర విద్యాలక్ష్యాలు. సమగ్ర విద్య ఎందుకు అవసరం అంటే సమాజంలో మార్పులు వేగంగా జరుగుతున్న ఈ యుగంలో సమగ్ర విద్య అనేది చాలా కీలకం. ఎందుకంటే ఇది వ్యక్తిని జ్ఞానం కలిగిన వాడిగా, నైపుణ్యం ఉన్నవాడిగా, విలువలు పాటించే పౌరుడిగా, సృజనాత్మక ఆలోచకుడిగా మారుస్తుంది. దేశ అభివృద్ధికి ఇలాంటి పౌరులే అవసరం. పాఠశాలల నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు సమగ్ర విద్యను అమలు చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, బాధ్యత గల,ఆవిష్కరణాత్మక యువత పెరిగి దేశాన్ని ముందుకు నడిపించగలుగుతుంది. విద్య అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని, దేశాన్ని కూడా మార్చగల మహాశక్తి. నైపుణ్యం, నీతి, నవ చైతన్యం ఈ మూడు అంశాలు ఏ ఒక్కరి జీవితాన్నైనా సార్థకంగా మార్చగలవు. కానీ ఇవన్నీ ఒకే చోట పొందాలంటే సమగ్ర విద్య తప్పనిసరి. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో మార్పులు వేగం పుంజుకుంటున్నాయి. నూతన యుగ అవసరాలకు అనుగుణంగా పాఠశాలల నుండి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అభ్యాసం వంటి అంశాలు ప్రముఖ స్థానం సంపాదిస్తున్నాయి. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా,విద్యార్థి వ్యక్తిత్వాన్ని అన్నికోణాల్లో అభివృద్ధి చేసేసమగ్ర ప్రక్రియకావాలని సూచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాల్లో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో కొత్త కార్యక్రమాలు, నైపుణ్య ఆధారిత కోర్సులు,సాంకేతిక పరికరాల వినియోగం పెరగడంతో విద్యార్థుల అభ్యాస పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి.ప్రాజెక్టుఆధారిత అభ్యాసం,కమ్యూనికేషన్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, విలువల విద్య వంటి అంశాలను తరగతులలోకి తీసుకువస్తూ పాఠశాలలువిద్యార్థులను భవిష్యత్తువైపు తీర్చిదిద్దుతున్నాయి. నేటితరం ఉద్యోగాలకేకాదు, జీవితానికి సిద్ధమవ్వాలి. అందుకోసం నైపుణ్యం, నీతి, సృజనాత్మకత కలిసి నడిచే విద్య అవసరం. ●

### విదేశీ ఉద్యోగులు లేకపోతే

# విజయం సాధించలేం

## డొనాల్డ్ ట్రంప్ తాజా వ్యాఖ్యలు




**వాషింగ్టన్, నవంబరు 20:** హెచ్-1బి వీసా ఉద్యోగులను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశీ ఉద్యోగుల అవసరం అమెరికాకు ఉందని అంగీకరించారు. ఈ విషయాన్ని 'మాగా' మద్దతుదారులు అర్థం చేసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరమ్‌లో మాట్లాడుతూ.. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో చాలా పెద్ద సంఖ్యలో ప్లాంట్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇవి దేశ ఆర్థికవృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ ప్లాంట్లలో పనిచేసేందుకు నైపుణ్యం కలిగిన విదేశీయులను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. వారు అమెరికన్లకు కూడా ఆ నైపుణ్యాలను నేర్పించాలన్నారు. యుఎస్‌లోని కంపెనీల్లో బిలియన్ డాలర్ల కొద్దీ పెట్టుబడులు పెట్టే వారిని అనుమతించకపోతే.. తాము విజయం సాధించలేమని ట్రంప్ వ్యాఖ్యానించారు. విదేశీ ఉద్యోగులు అమెరికన్లకు నైపుణ్యాలు నేర్పించి తిరిగి స్వదేశాలకు వెళ్లొచ్చన్నారు. విదేశీ వృత్తి నిపుణులు వేలాది మందిని తమతో తీసుకురావాలని.. వారిని తాను స్వాగతిస్తానని ట్రంప్ చెప్పారు. యుఎస్‌లో అధిక నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఇది మాగా సభ్యులకు అర్థం కాలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. విదేశీ ఉద్యోగులను అనుమతించకపోతే తాము విజయం సాధించలేమని అంగీకరించారు. ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి వలసలపై కఠిన నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నారు. ఇటీవల హెచ్-1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతున్నట్లు చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విదేశీ వృత్తి నిపుణుల కారణంగా అమెరికన్లకు ఉద్యోగావకాశాలు లభించడం లేదని మొన్నటి వరకు ట్రంప్ వాదించారు. అయితే, దీనిపై ఇటీవల ఆయన స్వరం మార్చారు. హెచ్-1బి వీసా కార్యక్రమాన్ని ట్రంప్ సమర్థించారు. ప్రపంచంలోని ప్రతిభావంతులను అమెరికాకు తీసుకువచ్చేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. విదేశీ ఉద్యోగుల అవసరం తమకు ఉందని.. వారు యుఎస్‌కు వచ్చి స్థానికులకు నైపుణ్యాలు నేర్పించి వెళ్లాలంటూ సూచనలు చేశారు. అయితే ట్రంప్ నిర్ణయాలను మాగా సభ్యులు వ్యతిరేకిస్తున్నారు.



# కొలువుదీరిన నితీష్ సర్కార్

**పాట్నా, నవంబరు 20:** బీహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం కొలువుదీరింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి 202 స్థానాలను కైవసం చేసుకుని అద్భుత విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రికార్డు స్థాయిలో నితీష్ కుమార్ పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని పాట్నాలోని చారిత్రక గాంధీ మైదాన్‌లో గురువారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహా ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు.. రికార్డు స్థాయిలో 10వసారి ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈసారి పదవీ కాలాన్ని పూర్తి చేస్తే.. సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ చామ్లింగ్ (24 సంవత్సరాలు) రికార్డును అధిగమించి.. దేశంలోనే అత్యధిక కాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీష్ కుమార్ సిఎంగా, 26 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 243 స్థానాలకు గానూ ఎన్‌డిఏ కూటమి 202 సీట్లను సాధించింది. ఇందులో బిజెపి 89 స్థానాల్లో విజయం సాధించగా.. ఆ పార్టీకి 14 మందికి మంత్రి పదవులు దక్కాయి. ఇక 85 సీట్లు గెలిచిన జెడియుకి 9 మంత్రి పదవులు దక్కాయి. మరోవైపు.. ఇద్దరు ఎమ్మెల్యేలు డిప్యూటీ సిఎంలుగా ఉంటారని పేర్కొన్నారు. బీజేపీ తరఫు నుంచి

> బీహార్ సిఎంగా 10వ సారి ప్రమాణం చేసిన జెడియు అధినేత
>
> 26 మంది మంత్రులతో కొత్త కేబినెట్
>
> హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సిఎంలు
>
> నితీష్‌కు శుభాకాంక్షలు చెప్పిన తేజస్వి యాదవ్

సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హాలు మరోసారి బిహార్ ఉపముఖ్య మంత్రు లుగా ప్రమాణం చేశారు. బిజెపి నుంచి దిలీప్ జైస్వాల్ వంటి అనుభవజ్ఞులతో పాటు.. కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్, షూటర్ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన 34 ఏళ్ల శ్రేయసి సింగ్ కూడా మంత్రిగా ప్రమాణం చేశారు. జెడియు నుంచి బిజేంద్ర ప్రసాద్ యాదవ్, శ్రవణ్ కుమార్, విజయ్ కుమార్ చౌదరి, అశోక్ చౌదరి వంటి సీనియర్ నేతలకు మళ్లీ మంత్రి పదవులు దక్కాయి. చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి)కి రెండు, జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తాన్ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వాహ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మంచ్ నుంచి నితీష్ కుమార్ మంత్రివర్గంలో ఒక్కొక్కరికి మంత్రి పదవి దక్కింది. ప్రధాని మోడీ శుభాకాంక్షలు బీహార్‌లో మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం వేళ.. ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బీహార్ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. ఇది అద్భుతమైన టీమ్ అని.. అంకితభావం కలిగిన నాయకులు బిహార్ రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకువెళ్తారుని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రశాంత్ కిషోర్ మౌనదీక్ష అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రకటించి.. బీహార్‌లో కొత్త సర్కారు కొలువుదీరిన వేళ మౌన వ్రతం పాటించారు. ముఖ్యంగా బీహార్‌లోని చారిత్రక భిత్తిహర్వా గాంధీ ఆశ్రమంలో గురువారం రోజు మొత్తం మౌన దీక్ష చేశారు. మహాత్మా గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించిన ఈ పవిత్ర స్థలంలో మౌనంగా ఆత్మపరిశీలన చేసుకోవడం ద్వారా.. ఎన్నికల్లో వైఫల్యానికి దారితీసిన కారణాలను అన్వేషించాలని ఆయన నిర్ణయించుకున్నారు. తప్పులను సరిచేసుకుని.. మరింత బలంగా ప్రజల ముందుకు వస్తామని ఆయన ధృడంగా తెలిపారు. అందులో భాగంగానే లోపాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించేందుకు, ఒకరోజు మౌన వ్రతాన్ని ఆత్మపరిశీలనగా పాటిస్తున్నానని ప్రకటించారు. ప్రశాంత్ కిషోర్ మౌన దీక్ష బీహార్ రాజకీయ వర్గాలలో మరియు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయన తదుపరి వ్యూహం ఎలా ఉంటుందనే ఉత్కంఠను పెంచింది.

# మేధావులు ఉగ్రవాదులుగా మారితే ప్రమాదకరం

## సుప్రీంకోర్టులో వెల్లడించిన ఢిల్లీ పోలీసులు



**న్యూఢిల్లీ, నవంబరు20:** మేధావులు ఉగ్రవాదులుగా మారితే క్షేత్రస్థాయిలోని వారి కన్నా మరింత ప్రమాదకరంగా తయారవుతారని ఢిల్లీ పోలీసులు సుప్రీం కోర్టులో వాదించారు. డాక్టర్లు, ఇంజినీర్లు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం ఇప్పుడు ఓ ట్రెండ్‌గా మారిందన్నారు. ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్లకు సంబంధించి నిర్బంధంలో ఉన్న ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ తదితరుల బెయిల్ పిటిషన్లను తీవ్రంగా వ్యతిరేకించారు. వారికి బెయిల్ ఇవ్వవద్దని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన సుప్రీం ధర్మాసనాన్ని కోరారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరసత్వ పట్టికలకు వ్యతిరేకంగా 2020లో ఢిల్లీలో జరిగిన నిరసనలు హింసాత్మకం కావడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లకు సూత్రధారులుగా పేర్కొంటూ ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, రహమాన్ తదితరులపై ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద, అప్పటి ఐపిసిలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అయిదేళ్లుగా నిర్బంధంలో ఉంచిన సంగతి తెలిసిందే. నిందితుల వల్లే ఈ కేసులో జాప్యం జరిగిందని, దీన్ని వారు తమకు అనుకూలంగా మలుచుకోలేరని ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌విరాజు సుప్రీం ధర్మాసనం ఎదుట వాదించారు. సిఎఎకు వ్యతిరేకంగా ఇమామ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఆరోపిస్తూ సంబంధిత వీడియోలను చూపించారు. ఇమామ్ ఓ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అని పేర్కొంటూ ఈ రోజుల్లో ఓ ట్రెండ్ నడుస్తోంది. వైద్యులు, ఇంజినీర్లు తమ పనులు చేయడం లేదు. దేశ వ్యతిరేక కార్య కలాపాల్లో పాల్గొంటున్నారు అని వ్యాఖ్యా నించారు. ఇవి సాధారణ నిరసనలు కావు. హింసతో కూడుకున్నవి. అంతర్జాతీయ మీడియాలో కవరేజీ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను వాడుకున్నారు. ఆందోళనల మాటున ప్రభుత్వాన్ని మార్చడమే వారి అంతిమ ఉద్దేశం. ఆర్థిక విధ్వంసం, దేశవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించడమే వారి లక్ష్యం. మేధావులు అనిపించుకునే వాళ్లు క్షేత్రస్థాయి ఉగ్రవాదుల కన్నా ప్రమాదకరమైనవారు అని రాజు అన్నారు. ఇది కేవలం సిఎఎకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం కాదని, సమాజాన్ని మత ప్రాతిపదికన విభజించే ప్రయత్నమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు.

## తల్లినే హనీట్రాప్‌కు ఎరగావేసి

# కటకటాల్లోకి కొడుకు!

**విజయపుర, నవంబరు 20:** ఈజీ మనీ కోసం ఓ ప్రబుద్ధుడు తల్లినే ఎరగా వేశాడు. ఓ బ్యాంకు మేనేజర్ ను హనీట్రాప్ లో ఇరికించి, లక్షలు వసూలు చేయాలని ప్లాన్ వేశాడు. తన తల్లితో ఆ మేనేజర్ ఏకాంతంగా గడిపినపుడు సెల్ ఫోన్ తో రికార్డు చేసి బెదిరింపులకు దిగాడు. అయితే, బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో తల్లీకొడుకుల నిర్వాకం బయటపడింది. కర్ణాటకలోని విజయపుర జిల్లా ఇండి పట్టణంలో ఈ సంఘటన జరిగింది. ఇండి పట్టణంలోని ఒక బ్యాంకు మేనేజరుకు కొంతకాలం క్రితం కొబ్బరి బొండాలు అమ్మే మహిళ (44)తో పరిచయమైంది. బ్యాంకు పక్కనే కొబ్బరి బొండాలు అమ్ముతుండడంతో సదరు మహిళతో మాటామాటా పెరిగింది. ఈ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని మేనేజర్ ను హనీట్రాప్ లో ఇరికించేందుకు ఆ మహిళ కొడుకు (24) కుట్ర చేశాడు. ఇందుకు తల్లి కూడా సహకరించడం గమనార్హం. తల్లీకొడుకుల పథకం ప్రకారం ఈ నెల 1న ఆ మహిళ బ్యాంక్ మేనేజర్ ను తన ఇంటికి ఆహ్వానించింది. ఇంట్లో తాను మాత్రమే ఉంటానని, సరదాగా గడుపుదామని పిలిచింది. ఇంటికి వచ్చిన మేనేజర్ తో ఆమె సన్నిహితంగా ఉన్న సమయంలో కిటికీలో సెల్ ఫోన్ పెట్టి వీడియో తీసింది. ఆ ఫోన్ ను గమనించిన మేనేజర్ ప్రశ్నించగా ఆ ఫోన్ పాడైపోయిందని జవాబిచ్చింది. ఆ తర్వాత నాలుగు రోజులకు మేనేజర్ కు ఫోన్ చేసి తామిద్దరూ ఏకాంతంగా గడిపిన సంఘటనను గుర్తుతెలియని వ్యక్తులు రికార్డు చేశారని, ఆ వీడియో పంపించి బెదిరిస్తున్నారని నాటకమాడింది. వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించింది. ఆ మహిళ కొడుకు, అల్లుడు, ఓ పత్రిక విలేకరి ముగ్గురూ కలిసి బ్యాంకు మేనేజర్ కు ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. అడిగిన సొమ్ము వెంటనే ఇవ్వకుంటే ఆయన రాసలీలల వీడియోను టీవీలో ప్రసారం చేస్తామని బెదిరించారు.

దీంతో కంగుతిన్న బ్యాంకు మేనేజర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు మొబైల్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు జరిపి కొబ్బరి బొండాలు అమ్మే మహిళ కొడుకును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తల్లితో కలిసి తాను చేసిన కుట్రను నిందితుడు వెల్లడించాడు. ప్రస్తుతం తల్లి, మిగతా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ తల్లీకొడుకులు గతంలో కూడా ఇదే తరహాలో పలువురిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

# భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నేనే ఆపా!

## 60వ సారి ట్రంప్‌నోట అదే మాట..



**వాషింగ్టన్, నవంబరు 20:** అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌పాకిస్థాన్ సంబంధాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అణుయుద్ధం జరగకుండా తానే అడ్డుకున్నానని, 350 శాతం భారీ సుంకాలు విధిస్తానని బెదిరించడంతోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. యుద్ధానికి వెళ్లడం లేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా తనకు ఫోన్ చేసి చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ హాజరైన యూఎస్ సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడారు. వివాదాలను పరిష్కరించడంలో నేను నిపుణుడిని. భారత్, పాకిస్థాన్ అణ్వాయుధాలతో యుద్ధానికి సిద్ధమయ్యాయి. మీరు యుద్ధం చేసుకోవచ్చు, కానీ రెండు దేశాలపై 350 శాతం సుంకాలు విధిస్తానని చెప్పాను. అణు ధూళి లాస్ ఏంజిల్స్‌పై తేలియాడటాన్ని నేను చూడలేనని ట్రంప్ వ్యాఖ్యానించారు. లక్షలాది మంది ప్రాణాలను కాపాడినందుకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా తనకు ఫోన్ చేసి ధన్యవాదాలు తెలిపారని ట్రంప్ చెప్పారు. ఈ ఏడాది మే నెల నుంచి ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది 60 సార్లకుపైనే. అయితే, ఈ విషయంలో మూడో వ్యక్తి మధ్యవర్తిత్వాన్ని భారత్ మొదటి నుంచి ఖండిస్తూ వస్తోంది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా, పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్ర స్థావరాలపై భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆ తర్వాత మే 10న ఇరు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల ఫలితంగానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని భారత్ స్పష్టం చేసింది. ఇందులో మరెవరి ప్రమేయం లేదని తేల్చిచెప్పింది.

## ప్రతి ముగ్గురిలో ఒకరిపై లైంగిక హింస

### ప్రపంచంలో సుమారు 84 కోట్లమంది బాధితులే

### ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక

**జెనీవా, నవంబరు 20:** మహిళలపై హింస ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా కొనసాగుతోందని, ఈ సమస్య పరిష్కారంలో గత రెండు దశాబ్దాలుగా చెప్పుకోదగ్గ పురోగతి లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ఈనెల 25న అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విడుదల చేసిన నివేదికలో అనేక దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించింది. గడిచిన 12 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 31.6 కోట్ల మంది మహిళలు, 1.25 కోట్ల మంది కౌమార బాలికలు లైంగిక హింసకు గురయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు (దాదాపు 84 కోట్ల మంది) తమ జీవితకాలంలో భాగస్వామి ద్వారా గానీ, ఇతరుల వల్ల గానీ హింసను ఎదుర్కొన్నారని, 2000 సంవత్సరం నుంచి ఈ సంఖ్యలో పెద్దగా మార్పు లేదని నివేదిక పేర్కొంది. 15-19 ఏళ్ల వయసున్న బాలికల్లో 16 శాతం మంది (1.25 కోట్లు) తమ భాగస్వామి చేతిలో శారీరక లేదా లైంగిక హింసకు గురైనట్లు తేలింది. భాగస్వామి ద్వారా జరిగే హింసను తగ్గించడంలో పురోగతి చాలా నెమ్మదిగా ఉందని, గత 20 ఏళ్లలో ఏటా కేవలం 0.2 శాతం మాత్రమే తగ్గిందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. భాగస్వాములు కాకుండా ఇతరుల వల్ల 15 ఏళ్ల వయసు నుంచి 26.3 కోట్ల మంది మహిళలు లైంగిక హింసకు గురయ్యారని, అయితే సామాజిక అపవాదు, భయం కారణంగా కొందరు వెల్లడించరని, దాని వల్ల ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మహిళలపై హింస మానవాళి ఎదుర్కొంటున్న పురాతన, విస్తృతమైన అన్యాయాలలో ఒకటి. అయినా దీనిపై చర్యలు చాలా తక్కువగా ఉన్నాయి.

## సంక్షిప్తంగా..

### పోక్సో కేసులో యడియూరప్పకు సమన్లు

**బెంగళూరు, నవంబరు 20:** కర్ణాటక మాజీ సిఎం యడియూరప్పకు పోక్సో కేసులో ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. డిసెంబర్ 2వ తేదీన వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సహాయం కోరేందుకు తన నివాసానికి వచ్చిన ఓ బాలికను యడియూరప్ప లైంగికంగా వేధించారని ఆయనపై ఆరోపణలు నమోద య్యాయి. 2024 ఫిబ్రవరి 2న ఈ ఘటన జరగ్గా, బాధితురాలి తల్లి సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో యడియూరప్పతో పాటు అరుణ, ఎం. రుద్రేశ్, మరిస్వామి అనే మరో ముగ్గురిని కూడా నిందితులుగా చేర్చారు. వారికి సైతం కోర్టు సమన్లు పంపింది. విచారణలో ఫిర్యాదిదారుల తరఫున ప్రత్యేక ప్రాసిక్యూటర్ అశోక్ ఎస్. నాయక్ వాదనలు వినిపించారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి సుజాత, 30 రోజుల్లోగా సాక్షుల విచారణ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశిస్తూ ఈ సమన్లు జారీ చేశారు. కాగా, తనపై నమోదైన పోక్సో కేసును, సమన్లను రద్దు చేయాలని కోరుతూ యడి యూరప్ప దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రత్యేక కోర్టు తాజా ఆదేశాలు జారీ చేశారు.

### నేపాల్‌లో మళ్లీ జెన్ జెడ్ ఆందోళనలు!

**ఖాట్మండ్, నవంబర్ 20:** నేపాల్‌లో మళ్లీ జెన్ జడ్ ఆందోళనలు చెలరేగాయి. గతంలో అధికారంలో ఉన్న పార్టీ మద్దతుదారులు, యువ నిరసనకారుల మధ్య పలు ప్రాంతాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. దాంతో అప్రమత్తమైన ప్రభుత్వం కర్ఫ్యూ అమల్లోకి తెచ్చింది. ఎక్కువ మంది ఒకచోట చేరడంపై నిషేధం విధించింది. ఇటీవల నేపాల్‌లో జనరేషన్ జెడ్ నిరసనలు కెపి శర్మ ఓలీ ప్రభుత్వాన్ని గద్దెదించిన విషయం తెలిసిందే. బారా జిల్లాలో జెన్‌జడ్ నిరసనకారులు, ఓలీ మద్దతుదారులుర్యాలీలు నిర్వహించారు. కొద్దిసేపటికే రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఎయిర్‌పోర్ట్ సమీపంలో కూడా పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాంతో ఈ రాత్రి వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటుందని వెల్లడించారు. శాంతియుత పరిస్థితులను నెలకొల్పేందుకు భద్రతా బలగాలు సన్నద్ధతతో ఉండాలని నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కార్కి ఆదేశించారు.



# తలాక్ ఎహసన్‌పై సుప్రీం తీవ్ర ఆగ్రహం!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** ముస్లింలలో అమల్లో ఉన్న మరో విడాకుల పద్ధతి 'తలాక్‌ఎహసన్'పై సుప్రీంకోర్టు తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తింది. మూడు నెలల పాటు ప్రతినెలా ఒకసారి తలాక్ చెప్పి విడాకులు ఇచ్చే ఈ విధానం చెల్లుబాటును ధర్మాసనం ప్రశ్నించింది. ఆధునిక సమాజంలో ఇలాంటి పద్ధతులను ఎలా అనుమతిస్తారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎనిమిదేళ్ల క్రితం ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్ (తలాక్‌ఎ బిద్దత్) రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు, ఇప్పుడు మరో విడాకుల పద్ధతిపై దృష్టి సారించింది. ఓ ముస్లిం మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. బెనజీర్ హీనా అనే మహిళకు ఆమె భర్త గులాం అక్తర్ తన న్యాయవాది ద్వారా విడాకుల నోటీసు పంపించాడు. ఆ తర్వాత అతను మరో వివాహం చేసుకున్నాడు. అయితే, 11 పేజీల తలాక్ నోటీసుపై భర్త సంతకం లేకపోవడంతో తన బిడ్డకు స్కూల్‌లో అడ్మిషన్ ఇప్పించడానికి ఇబ్బందులు పడుతున్నానని ఆమె కోర్టుకు తెలిపారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఇస్లాంలో ఇది సాధారణ పద్ధతేనని భర్త తరఫు న్యాయవాది వాదించగా ఇదొక పద్ధతి ఎలా అవుతుంది, ఇలాంటి కొత్త కొత్త ఆలోచనలు ఎలా పుట్టుకొస్తున్నాయని కోర్టు ప్రశ్నించింది. విడాకుల విషయంలో భార్యతో నేరుగా మాట్లాడటానికి భర్తకు ఉన్న అహంకారం ఏంటి ఇది ఒక మహిళ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. ఆధునిక సమాజంలో ఇలాంటి వాటిని ఎలా ప్రోత్సహిస్తారని ఘాటుగా వ్యాఖ్యానించింది. మతపరమైన పద్ధతుల ప్రకారం విడాకులు తీసుకోవాలనుకుంటే, నిర్దేశించిన పూర్తి విధానాన్ని పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. తన హక్కుల కోసం పోరాడుతున్న పిటిషనర్‌ను అభినందించిన ధర్మాసనం, వనరులు లేని పేద మహిళల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేసింది.

## అల్‌ఫలా చైర్మన్‌పై మరో కేసు!

### బోగస్ అక్రెడిటేషన్లతో టోకరా

**ఫరీదాబాద్, నవంబరు 20:** టెర్రర్ ఫండింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్ధిఖీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే 13 రోజుల ఈడీ కస్టడీలో ఉన్న ఆయనపై తాజాగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రూ.2 కోట్ల మోసం కేసు నమోదైంది. దీంతో ఆయన అక్రమాల చిట్టా ఒక్కొక్కటిగా బయటపడు తోంది. వర్సిటీకి నకిలీ అక్రిడిటేషన్లు ఉన్నాయని, చట్టబద్ధమైన గుర్తింపు పొందినట్లు తప్పుడు ప్రచారాలు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసగించారని సిద్ధిఖీపై ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసం ద్వారా ఆయన సుమారు రూ.415.10 కోట్లు అక్రమంగా సంపాదించినట్లు ఈడీ గుర్తించింది. ఈ వ్యవహారంలో ఢిల్లీ బ్లాస్ట్ కేసుతో ఆయనకు సంబంధాలు ఉన్నాయనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది.

# భారత్‌కు అమెరికా జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణుల సరఫరా



**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారత్, అమెరికా మధ్య రక్షణ సంబంధాలు కొత్త శిఖరాలకు చేరుతున్నాయి. ఇరుదేశాల మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి నిదర్శనంగా, భారత్‌కు సుమారు 93 మిలియన్ డాలర్ల విలువైన సైనిక పరికరాల విక్రయానికి ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా అత్యాధునిక జావెలిన్ యాంటీట్యాంక్ క్షిపణులు, ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్‌ను అమెరికా సరఫరా చేయనుంది. అమెరికా విదేశాంగ శాఖ ఈ అమ్మకానికి ఆమోదం తెలిపిందని, ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ వ్యవస్థలు, 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్ ఉన్నాయని డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ వెల్లడించింది. భారత్ మొత్తం 148 జావెలిన్ క్షిపణులు, 25 కమాండ్ లాంచ్ యూనిట్లు, 216 ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్ కోసం అభ్యర్థించినట్లు తెలిపింది. ఈ ప్రతిపాదిత విక్రయం అమెరికా విదేశాంగ విధానం, జాతీయ భద్రతా లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. మా కీలక రక్షణ భాగస్వామి అయిన భారత్ భద్రతను మెరుగుపరచడం ద్వారా ఇండో పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక పురోగతికి దోహదపడుతుంది" అని డీఎస్‌సీఏ పేర్కొంది. ఈ ఒప్పందంతో భారత్ తన దేశీయ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోగలదని వివరించింది.

### జమ్మూలోని కాశ్మీర్‌టైమ్స్ ఆఫీసులో ఎకె47 బుల్లెట్లు




**న్యూఢిల్లీ, నవంబర్ 20:** జమ్మూకశ్మీర్‌లోని ఓ మీడియా సంస్థ కార్యాలయంలో తూటాలు లభ్యం కావడం కలకలం సృష్టిస్తోంది. పోలీసు విభాగానికి చెందిన స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ జరిపిన సోదాల్లో జమ్మూలోని కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో ఎకె 47బుల్లెట్లు దొరికాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి. క్యాట్రిడ్జ్‌లు, పిస్టల్ రౌండ్స్, మూడు గ్రనేడ్ లెవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. గురువారం ఉదయం ఈ తనిఖీలు జరిగాయి. కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనూరాధ భాసిన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతదేశం, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూల సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. ఆమె కార్యకలాపాలు, సంబంధాలను పరిశీలించడమే దర్యాప్తు లక్ష్యమని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి షాక్ ఇచ్చిన ట్రంప్!



**వాషింగ్టన్, నవంబరు 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి షాక్ ఇచ్చారు. పుతిన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న రష్యా-ఉక్రెయిన్ శాంతి ప్రణాళికను చడీచప్పుడు లేకుండా ఆమోదించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. మూడేళ్లకు పైగా కొనసాగుతోన్న రష్యా-ఉక్రెయన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 28 పాయింట్లతో ఒక ప్లాన్ సిద్ధం చేశారు. అందులో ఎక్కువ పాయింట్లు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ఆ ప్రతిపాదనలను అమెరికా, రష్యా అధికారులు సంయుక్తంగా రూపొందించారు. ఇటీవల దానిని జెలెన్‌స్కీ ప్రభుత్వానికి అందించారు. దీనిపై ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఉక్రెయిన్ జాతీయ భద్రతాధిపతి రుస్తుమ్ ఉమరోవ్ మధ్య సమావేశం జరిగింది. ఈ ప్రణాళికకు అంగీకారం తెలపాలని అమెరికా కోరుకుంటుందని ఆ సందర్భంగా విట్కాఫ్ స్పష్టం చేశారు.

# విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్



## కష్టపడితేనే విజయం

● విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు ● 2వ రోజు కుప్పం నియోజకవర్గం పర్యటనలో నారా భువనేశ్వరి ● కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసిన భువనేశ్వరి ● విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణం

కుప్పం, నవంబరు 20 ప్రభాతవార్త: క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయం మన సొంతమవుతుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర కీలకమైందని, చిన్నతనం నుంచే పిల్లలకు విలువలు నేర్పించాలని అన్నారు. 2వ రోజు కుప్పం నియోజక వర్గం పర్యటనలో భాగంగా పరమ సముద్రం గ్రామంలో నారా భువనేశ్వరి పర్యటించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాలలను సందర్శించారు. కెజిబివి నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణించారు. అనంతరం సామగుట్టపల్లిలో విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు.

### విజయానికి షార్ట్ కట్ లేదు

"పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది. ఆటపాటతో పాటు కెరీర్ పైనా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కష్టపడకుండా విజయం రాదు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు. ఎన్టీఆర్, అబ్దుల్ కలామ్, ధీరూ భాయ్ అంబానీ, చంద్రబాబు వంటి వారంతా ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. చంద్రబాబు చిన్నతనంలో 6 కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవారు. నాకు తల్లిదండ్రులే స్ఫూర్తి. మా నాన్న ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్‌కి వెళ్లి చదువుకునే వారు. ఎంతోమంది తల్లిదండ్రులు స్థోమత లేకపోయినా వారి శక్తికి మించి పిల్లలను చదివిస్తున్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి" అని విద్యార్థులకు భువనేశ్వరి సూచించారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పైనా దృష్టి పెట్టాలని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు సహాయం చేయటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. కస్తూర్బా విద్యాలయానికి 20కంప్యూటర్లు, నర్సింగ్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందేలా ఏర్పాట్లు చేస్తామని నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

### పిల్లలను విలువలతో పెంచాలి

"విలువల బడి వ్యవస్థాపకులు లెనిల్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత నేర్పించి బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ బడులను ఏర్పాటు చేయడం గొప్ప విషయం. నా చిన్నతనంలో స్కూల్లో మోరల్ సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా ఉండేది. ఇప్పుడు మళ్లీ పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్ తీసుకొచ్చిన మంత్రి నారా లోకేష్‌కు నా అభినందనలు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు క్లోజ్ అనే బోర్డులు పెట్టడం చాలా సంతోషదాయకం. నేటి సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయి. టెక్నాలజీని చెడు కోసం ఉపయోగిస్తున్నారు. పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర కీలకమైంది. చిన్నతనంలోనే విలువలు, సంస్కారం నేర్పాలి. పిల్లల ఆసక్తి గమనించి అందులో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. నారా లోకేష్ ప్రజాసేవలో బిజీగా ఉండటంలో మా మనుమడు దేవాన్ష్ చదువు, క్రీడల విషయాలు బ్రాహ్మణినే స్వయంగా చూసుకుంటుంది. అప్పట్లో చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో లోకేష్ పెంపకం బాధ్యత తానే తీసుకున్నా" అని నారా భువనేశ్వరి తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలి

## పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సచివాలయం, నవంబరు 20 ప్రభాతవార్త: ప్రతి కుటుంబం నుంచి ఒక్కో పారిశ్రామిక వేత్తను తయారుచేసే విధంగా అధికార యంత్రాంగం పనిచేయాలని, ప్రజలను చైతన్య పరిచి, పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దిశానిర్దేశం చేశారు. గురువారం సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో ఉన్న సమావేశ మందిరంలో, పరిశ్రమల శాఖ అధికారులు, 26 జిల్లాల జెనరల్ మేనేజర్ లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనకు తగ్గట్టుగా, వారి లక్ష్యానికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పని చేయాలని సూచించారు. ప్రతీ కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని కోరారు. క్షేత్ర స్థాయిలో రీజనల్ మీటింగ్స్ పెట్టి, అవగాహన పెంచే విధంగా చర్యలు చేపట్టాలని అధికారు లను ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన శిక్షణ కూడా ఇచ్చే విధంగా, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు అనుసంధానం చేసి పరిశ్రమల ఏర్పాటు కు కావాల్సిన చేయూతను ఇచ్చి, ఆలోచన నుంచి ఆచరణ వరకు పెట్టుబడి దారులకు సహకరించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక ప్రోత్సాహకాలకు సంబంధించిన విషయాలపై అధికారులు అందరికి స్పష్టమైన అవగాహన ఉండాలని, అలా ఉన్నప్పుడే, పెట్టుబడులు పెట్టాలని ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు అవసరమైన సమాచారం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రోత్సాహం అందు తుందని మంత్రి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వారానికి ఒక రోజు.. ఖచ్చితంగా సిబ్బంది అందరూ ఆఫీస్‌లో ఉండాల్సి ఉంటుందని, ఫీల్డ్ వర్క్ పైనే కాదు ఆఫీసుల్లో జరిగే కార్యకలాపాల మీద దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతీ రోజు ఎవరో ఒక అధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండి, ఔత్సాహికులకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు కాబోయే పరిశ్రమలపై అందరూ దృష్టి సారించాలన్నారు. ప్రతీ వారంలో, శనివారం అధికారులు అందరూ అందుబాటులో ఉండాల్సిందేనని, రెండవ శనివారం మినహాయింపు ఉంటుందన్నారు. ఆచరణలో ప్రభుత్వానికి ఎదురయ్యే సవాళ్ళను పరిష్కరించేందుకు అవసరమైన మౌలిక వసతులు, మానవ వనరులను ఇచ్చేందుకు ప్రభుత్వం పని చేస్తుందని, అందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, అందుకు తగిన కార్యాచరణ రూపొందించి ముందుకు తీసుకు వెళ్లాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి డా. ఎన్. యువరాజ్, డైరెక్టర్ శుభమ్ బన్సాల్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొనగా, 26 జిల్లాల ఉన్నతాధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

# బిసిలకు జనాభా దామాషా మేర చట్టబద్ధ రిజర్వేషన్లు ఇవ్వాలి



విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు, ఎబిసిడిలుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు జరపాలంటూ, తమ సంఘం అన్ని జిల్లాల అధ్యక్షులు ఈనెల 24 గ్రీవెన్స్ డే రోజున అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా పీఎం, సీఎంలకు బీసీల రిజర్వేషన్ల గురించి విజ్ఞాపన పత్రాలను సమర్పిస్తారని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. గురువారం మంగళగిరి సంఘ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో కేసన శంకరరావు మాట్లాడుతూ 33 శాతం చట్టసభల్లో, 34 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వటానికి వీలుగా కులగణన జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసిల రిజర్వేషన్లను న్యాయ, రాజ్యాంగపర అవరోధాలు రాకుండా రాష్ట్రాలు రిజర్వేషన్లు పెంచుకునేలా, పార్లమెంటు చట్టబద్ధత కల్పించి బిసిలకు సామాజిక న్యాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, సంఘ నేతలు మేకా వెంకటేశ్వరరావు, చిప్పాడ చందు, వాకా వెంకటేశ్వరరావు, ఆలా శివాజీ, వాడల నాగరాజు, వెంకటసుబ్బయ్య, ఉమామహేశ్వరరావు, బీసీ ఉద్యోగ విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజారులో కలెక్టర్ తనిఖీలు

విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ పటమట రైతు బజార్‌ను కలెక్టర్ లక్ష్మీశా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ వాడకం, పరిశుభ్రతపై ఎస్టేట్ ఆఫీసర్ రమేష్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. రైతు బజార్‌లో బాగానే పరిశుభ్రత పాటిస్తున్నారని, ఇంకా బాగా చేయాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం చాలా వరకు తగ్గించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం లక్ష్మీశా మీడియాతో మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా రైతు బజార్‌లు, మార్కెట్‌లు తనిఖీ చేస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రత, కూరగాయల నాణ్యత, ధరలను పరిశీలించామని తెలిపారు. పటమట రైతు బజార్‌లో శుభ్రతను పాటిస్తున్నారని చెప్పారు. షాపుల్లో రైతులే ఉంటున్నారా, దళారులు ఉంటున్నారా అని చెక్ చేశామన్నారు. డ్వాక్రా మహిళలు ఎక్కడ నుంచి కూరగాయలు తెస్తున్నారనేది పరిశీలించామని అన్నారు. ధరల విషయంలో ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నామన్నారు. పాలిథిన్ కవర్లు వాడకూడదని చెబుతున్నామని.. పూర్తిగా ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టాలని వెల్లడించారు. రైతు బజార్లలో ప్లాస్టిక్ వాడకూడదని చెప్పామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. పాలిథిన్ కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి షాపు ఎదుట ధరల పట్టిక, కూరగాయల వివరాలు ఉంచాలని ఆదేశించారు. వినియోగదారులు కూరగాయల కోసం రైతు బజార్లకు వస్తారన్నారు. ఇక్కడ నుంచే ప్రజల్లో అవగాహన కలిగించి, ఎకో ఫ్రెండ్లీ రైతు బజార్లుగా మారుస్తామని కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు.

# వాయుసేనలో అవకాశాలపై నేడు అవగాహన సదస్సు

విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: భారత వాయుసేన (ఇండియన్ ఎయిర్ ఫోర్స్)లో ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం విజయవాడ లయోలా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ఏపీఎస్ రెడ్డి కాన్ఫరెన్స్ హాల్ లో భారత వాయుసేన అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... ఇంటర్, తత్సమాన విద్యార్హతలు (పాలిటెక్నిక్, ఐటిఐ) గల విద్యార్థిని, విద్యార్థులు "అగ్నివీర్ వాయు"గా భారత వాయుసేనలో చేరవచ్చని చెప్పారు. 17 సంవత్సరాల దాటిన దగ్గర నుంచి ఇరవై ఒక్క సంవత్సరాల వయసుగల యువతీ, యువకులు దీనికి అర్హులన్నారు. చిన్న వయసులోనే దేశానికి సేవచేసే అవకాశం లభిస్తుందని, దీనిని యువత అందిపుచ్చుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు.

సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల భర్తీ అధికారి, సికింద్రాబాద్ 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని కరీంనగర్, పెద్దపల్లి, గుంటూరు, పల్నాడు జిల్లాలలో "అగ్నివీర్ వాయు" పై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. ఇంటర్, తత్సమాన కోర్సుల్లో కనీసం 50 మార్కులతో పాటు, ఇంగ్లీష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు పొందిన విద్యార్థిని, విద్యార్థులు "అగ్నివీర్ వాయు"కు అర్హులన్నారు. యువత, తల్లిదండ్రులు ఈ అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు. శనివారం తిరువూరు డివిజన్లో మరో అవగాహన సదస్సు నిర్వహిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సొచర్‌ను కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశకు షేక్ యాకూబ్ అలీ అందించారు.

## చట్టబద్ధ భూమి కబ్జాకు యత్నం...

# న్యాయం చేయండి

● మోసపూరిత భూమి రిజిస్ట్రేషన్‌పై టిడిపి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
● కొడుకుల క్రూరత్వం.. ఇంట్లో బంధించి దాడులు
● అర్జీలు స్వీకరించిన మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ బోర్డ్ చైర్మన్ వలవల బాబ్జీ



విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా పుత్తూరు మండలం భవాని నగర్ గ్రామానికి చెందిన బంగారయ్య నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 245/3తి2కి సంబంధించిన భూమి చాల సంవత్సరాలుగా తమ కుటుంబ ఆధీనంలో ఉంది. భూమిపై చట్టపరమైన హక్కులు కలిగి ఉన్నాం. ఈ విషయాన్ని మండల రెవెన్యూ అధికారి కూడా నిర్ధారించారు. అయితే తాయిమాంబపురం గ్రామానికి చెందిన యం.బాలకృష్ణ తన ప్రమేయం లేకుండా అక్రమంగా మోసపూరితంగా పత్రాలు సిద్ధం చేసుకుని భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని నేతలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ బోర్డ్ చైర్మన్ వలవల బాబ్జీలకు అర్జీ ఇచ్చి అభ్యర్ధించారు.

చిత్తూరు జిల్లా కుప్పం మండలం అడవి బూదుగురు గ్రామానికి చెందిన రాణి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్లు 109/43లో 0.09 సెంట్లు, 109/4తిలో 0.0825 సెంట్లు మొత్తం 0.17 సెంట్లు భూమి తమ పేరుమీద రిజిస్ట్రేషన్ పత్రాలతో చట్టబద్ధంగా ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన చిన్నయ్య భార్య శాంత, కుమారులు చంద్రయ్య, చిన్నయ్య, పాపయ్య అనే వారు తమ భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ.. కర్రలతో దాడి చేయడానికి యత్నించారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు గ్రామానికి చెందిన రామలక్ష్మి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం. 205/1, చ.గ. 239, డోర్ నెం. 4 70 వద్ద ఉన్న పూరి ఇల్లు తమ భర్తతో కలిసి కష్టపడి నిర్మించుకున్నాం. అయితే ఇద్దరు కుమారులు ఇందిరాసి ప్రేమ్ కుమార్, ఇందిరాసి పవన్ కుమార్ బెదిరింపులతో కలిసి ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెం. 161/2021గా ఇంటిని ఉచిత శెటిల్ మెంట్ పేరుతో చిన్న కుమారుని పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంటి రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత నుంచే ఇద్దరు కుమారులు ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి వారితో పాటు వాళ్ల భార్యలు తమని కొట్టడం, అవమానించడం బూతులు తిట్టడుతూ సంరక్షణ లేకుండా వేధిస్తున్నారు. అంతేకాకుండా, ప్రతిరోజూ 56 మంది తాగుబోతులను ఇంటికి తీసుకువచ్చి త్రాగుబోతు వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీనిపై ప్రశ్నించగానే ఇది మా ఇల్లు - మీకు ఉండటానికి హక్కు లేదు అంటూ తీవ్రంగా బెదిరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇంట్లో బంధించి దారుణంగా కొట్టి ఇంట్లో ఉంటే చంపేస్తామంటున్నారు. కావునా తమయందు దయవుంచి వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరిష్కరించాలని కోరారు.

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో 2018లో టీడీపీ ప్రభుత్వంలో మెయిన్ రోడ్డుకు సిమెంట్ రోడ్ వేయడానికి తమ బిల్డింగ్‌ను కూల్చివేశారు. పంచాయతీ అధ్యక్షుడు టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు నష్టపరిహారం, ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ సమస్యను పట్టించుకోలేదు. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసాక కూడా తాము టీడీపీ వారికి మద్దతిచ్చారు అంటూ తమకు స్థలం ఇవ్వడాన్ని తిరస్కరించారు. గ్రామంలో 120 మందికి స్థలాలు ఇచ్చినా తమకు మాత్రం ఇవ్వలేదు. రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ఇంటి స్థలం మంజూరు చేయాలని తహసీల్దార్, వీఆర్వోలకు ఆదేశించారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ తమ సమస్యకు పరిష్కారం రాలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమకు ఇంటి స్థలం మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# కుష్ఠు వ్యాధుల గుర్తింపు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

## డిహెచ్ డాక్టర్ పద్మావతి

సచివాలయం, నవంబరు 20 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో గురువారంనాటికి 66,52,563 మందిని స్క్రీనింగ్ చేయగా, వీరిలో తదుపరి పరీక్షల కోసం (రీఎగ్జామినేషన్) 5,085 మందిని మెడికల్ ఆఫీసర్లకు పంపామని ప్రజా ఆరోగ్య సంచాలకులు(డిపిహెచ్) డాక్టర్ కె. పద్మావతి నేడొక ప్రకటనలో తెలిపారు. 30 వరకు జరిగే ఇంటింటి సర్వేలో ఆశా వర్కర్, మేల్ వాలంటీర్ తప్పనిసరిగా ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్క్రీనింగ్ కోసం ఇంటింటికీ వచ్చే ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. అనుమానిత కేసుల వివరాల్ని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పిహెచ్‌సి) వైద్య అధికారులకు పంపుతారని ఆమె తెలిపారు. లక్షణాలు బయటపడగానే ఆ వ్యక్తి చుట్టుపక్కల ఉన్న 300 ఇళ్లను మరల ఫోకల్ లెప్రసీ సర్వే (ఎఫ్ఎల్‌సి) చేస్తారని, అలాగే ఆ వ్యక్తి ఇంట్లో ఉన్న వారికి, చుట్టుపక్కల ఉన్న కనీసం 30 నుండి 40 మందికి సింగిల్ డ్రగ్ రెజిమన్ (ఎస్‌డిఆర్) లేదా పెప్ (పిఇపి) మందులివ్వాలిస్తారని తెలిపారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మల్టీ డ్రగ్ ట్రీట్మెంట్(ఎండిటి)ను ఉచితంగా ఇవ్వడం ద్వారా నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు కరపత్రాల్ని ప్రతి ఇంటికీ పంపిణీ చేయడం, ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్లను ప్రదర్శించడం ద్వారా పెద్దఎత్తున అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతినెలా 10వ తేదీన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో, లెప్రసి కాలనీల్లో డిజెబిలిటీ ప్రివెన్షన్ అండ్ మెడికల్ రిహాబిలిటేషన్ (డిపిఎంఆర్) క్యాంప్ నిర్వహిస్తారు. ఈ క్యాంపుల ద్వారా అంగవైకల్యం ఉన్నవారికి ఫిజియోథెరపీ చేస్తారు. నయంచేయడానికి వీలుపడని సమస్యని రికన్స్ట్రక్టివ్ సర్జరీ (ఆర్‌సిఎస్)ద్వారా సరిచేస్తారు. ఈ సర్జరీ చేసిన వారికి రూ.12వేలు ప్రభుత్వం అందజేస్తోంది. చికిత్స సమయంలో రూ.6వేలు, ఫస్ట్ ఫాలోఅప్, సెకండ్ ఫాలోఅప్‌లకు రూ.3వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుంది.

# ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా పనిచేద్దాం

## ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ



విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఆధునిక సాంకేతికతతో వినూత్న ఆడిట్ పద్ధతులను అవలంబిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసేలా మానవవనరులను తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏ అండ్ ఈ) ఎస్.శాంతి ప్రియ తెలిపారు. గురువారం స్థానిక స్టాలిన్ బిల్డింగ్ 8వ అంతస్తులోని మల్టీపర్పస్ హాల్‌లో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ చేతుల మీదుగా 5వ ఆడిట్ దివస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ మాట్లాడుతూ అధునాతన సాంకేతికతలైన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సేవలను పరిపాలనలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా ప్రజా వనరులను సక్రమంగా వినియోగిస్తూ పనిచేయాలన్నారు. సమాజంలో సమున్నత మార్పులకు నాయకత్వం వహించడం, విలువలు పునరుద్ధాటించడం, విశ్వాసం, ఆవిష్కరణ, సుస్థిరత, జవాబుదారీతనం లక్ష్యంగా పనిచేయాలన్నారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించిన తర్వాత పరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనంలో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్) పాత్రను, చేస్తున్న కృషిని వివరించారు. కాగ్ నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా సాధించాలని ఉద్యోగులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఏఎంజీ3) సుష్మా, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ఆర్.శ్యామ్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అడ్మిన్) వి.లలిత్ కుమార్, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కుశాల్, నాబార్డ్ జీఎం మహేష్ సింగ్, ఆర్బీఐ డీజీఎం అనంతీ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్స్ విజయవాడ డైరెక్టర్ రమేష్ కొండా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్పవృక్ష వాహనంపై పద్మావతి అమ్మవారు మురళీకృష్ణ అలంకారంలో తేజస్వరూపిణి



తిరుచానూరు, నవంబరు 20 ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు గురువారం ఉదయం మురళీకృష్ణ అలంకారంలో తేజోమయి అయిన పద్మావతి అమ్మవారు కల్పవృక్ష వాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలుపు సహస్రనామార్చన నిత్య అర్చన నిర్వహించారు. తర్వాత అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపు చేసి మురళీకృష్ణ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై కొలువు దీర్చారు. అనంతరం తిరుమాడ వీధులలో భజనలు కోలాటాల నడుమ తేజోమయి భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి కృప కటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, యుఒ అనిల్ కుమార్ సింగల్, జేఈఓ వీరబ్రహ్మం సివిఎస్వో కే.వి.మురళీకృష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, ఆర్జిత ఇన్‌స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్, ప్రసాదం ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జగన్.. జైలుకెళ్లడం ఖాయం

## పెయిడ్ ఆర్టిస్టులతో కోర్టులను మభ్యపెట్టలేరు

## మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అనంతపురం, నవంబరు 20 ప్రభాతవార్త బ్యూరో: అక్ర మాస్తుల కేసుల్లో వైకాపా అధ్యక్షుడు జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆరేళ్ల అనంతరం తప్పని పరిస్థితుల్లో విచారణ నిమిత్తం కోర్టుకు వెళ్తూ కూడా నిసిగ్గుగా బలప్రదర్శనకు దిగడం జగన్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. తాను కోర్టుకు హాజరైతే సమస్యలు ఎదురవుతాయని కోర్టులను నమ్మబలికే ప్రయత్నంలో భాగంగానే హైదరాబాదులో గురువారం నానా హంగామా సృష్టించారని ఓ ప్రకటన లో మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. ముందస్తు పకడ్బందీ ప్రణాళికతో ప్రజాబలం ఉందని చెప్పుకోవడానికి పెయిడ్ ఆర్టిస్టులతో ర్యాలీ నిర్వహించి హైదరాబాద్ వాసులను నానా ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. విచారణలో భాగంగా కోర్టులకు హాజరయ్యే వారు వినయంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కానీ జగన్ రెడ్డిలో ఎటువంటి పశ్చాతాపం కనిపించడంలేదని తెలిపారు. సీఎంగా తండ్రి ఉండడాన్ని అడ్డం పెట్టుకుని వేల కోట్ల రూపాయలతో అక్రమ ఆస్తులు అర్జించిన జగన్ కోర్టు కేసుల నుంచి తప్పించుకుని ఎంతోకాలం బయట తిరగలేరని పేర్కొన్నారు.

# వైభవోపేతంగా సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు



## జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్

శ్రీసత్యసాయి జిల్లా, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో బాబా శతజయంతి వేడుకలు చారిత్రాత్మకంగా, భక్తులు ఎలాంటి ఇబ్బందులను అద్వితీయంగా జరుగున్నాయన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, గడ్కరీ, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, సవితమ్మ, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, ప్రముఖ సినీ నటి ఐశ్వరరాయ్ బచ్చన్, ఎన్‌హెచ్ఆర్‌సి అధ్యక్షులు రామ సుబ్రహ్మణ్యన్, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొనడం జరిగిందనా న్నరు. ఇప్పటివరకు పుట్టపర్తి పుణ్యక్షేత్రానికి 4,24,153 మంది భక్తులు విచ్చేశారని, ఇందులో చాలా మంది సాయి100 యాప్ ద్వారా తమ సందర్శన వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం పలు రైల్వే స్టేషన్ల నుండి పుట్టపర్తికి 261 ప్రత్యేక బస్సులను ఉచితంగా నడపగా, ఇప్పటి వరకు 14272 మంది యాత్రికులు రవాణాసేవలు వినియోగించుకున్నారన్నారు. అదనంగా 4606 మంది యాత్రికులు ఉచిత షటిల్ బస్సు సర్వీసుల ద్వారా పుట్టపర్తికి చేరుకున్నారని, 230 మంది వివిఐపిలకు వాహనాలు, మినీబస్సులు ఏర్పాటు చేశామన్నారు. యాత్రికుల సౌకర్యార్థం తాత్కాలిక బస ఏర్పాట్ల భాగంగా వెస్ట్ గేటు, ఎనుములపల్లి, ప్రశాంతి నిలయం లో 1,92,151 మందికి బస ఏర్పాటు చేశామని, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో 25 దాకా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 8011 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 95 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ద్వారా వివిధ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను చేశామని, ట్యాంకర్లద్వారా 42 కేంద్రాలలో త్రాగునీటి సరఫరా, పురుషులకు, మహిళలకు వేరువేరుగా 150 చొప్పున తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 356683 మంది భక్తులకు ఉచితంగా అన్నదానం చేశామన్నారు. 5500 మంది పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశామని, అత్యవసర సమయాల్లో సేవలందించే విధంగా 18 దాకా గుర్తించిన ప్రదేశాలలో అగ్నిమాపక సేవలను అందించడంజరుగుతుందన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం 25 సపోర్ట్ 108 అంబులెన్స్ వాహనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. అదనంగా రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సిలు) వంటి 13 ప్రదేశాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అక్కడ అవసరమైన ఔషధాలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు.. ఇప్పటివరకు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వివిధ సమస్యలపై స్పందించి 40 దాకా సమస్యలను పరిష్కరించడంతో పాటు సాయి 100 యాప్ ద్వారా 23 ఫిర్యాదులను స్వీకరించి వాటిపై తక్షణ పరిష్కార చర్యలు తీసుకొని పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే శిల్పారామం వద్ద సెర్ఫ్ ద్వారా హస్తకళల శిబిరాలు, ప్రతిరోజు సాయంత్రం సమయంలో వివిధ సాంస్కృత కార్యక్రమాలు, చిత్రావతి నదీలో తెప్పోత్సవం, లేజర్ షో ద్వారా సందర్శకులు ఆకట్టుకునే విధంగా ప్రదర్శనలను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.



## కేంద్రమంత్రి గడ్కరీకి పోటాపోటీగా వినతులు

అనంతపురం, నవంబరు 20 ప్రభాతవార్త బ్యూరో: దేశ ప్రధాని నరేంద్ర మోది పుట్టపర్తి పర్యటన ముగిసిన మరుసటిరోజే శ్రీ సత్యసాయి కేంద్రం అయిన పుట్టపర్తికి కేంద్ర రోడ్లు, రవాణా జాతీయ హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని మంత్రులు, శాసనసభ్యులు, ఇతర టిడిపి నేతలతో పాటు బిజెపి నేతలు కూడా నితిన్ గడ్కరిని కలిశారు.. ఈ సందర్భంగా పోటాపోటీగా ప్రజా ప్రతినిధులు తమ తమ నియోజక వర్గాల్లో రోడ్ల గురించి వినతి పత్రాలు సమర్పించుకొని తమ ప్రాంతము లో రహదారు నిర్మాణానికి నిధులు ఇవ్వాలని విన్నవించుకోవడం విశేషం. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి, బిజెపి నాయకుడు సందింటి శ్రీనివాసులు తదితరులున్నారు. తరువాత కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశాంతి నిలయానికి చేరుకొని సాయికుల్వంత హాల్లో శ్రీ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్శనలో రాష్ట్ర మంత్రులు, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా మహా సమాధిని సందర్శించిన తర్వాత శ్రీ సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారుల గురించి కేంద్ర మంత్రి గడ్కరి సంబంధిత అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి పనుల పురోగతి, ప్రతిపాదిత ప్రాజెక్టులు, జిల్లాలో కొత్తగా గుర్తించిన కనెక్టివిటీ అవసరాలు, రహదారి విస్తరణ, భద్రతా చర్యల బలోపేతం, భవిష్యత్ రహదారి అభివృద్ధి ప్రణాళికలపై పూర్తి వివరాలు అందించారూ. సత్యసాయి జిల్లాలో రోడ్ల నాణ్యత, కనెక్టివిటీ, హైవే సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేసారు.

## 23న ప్రభుత్వ విప్ దివ్య రాక

పుట్టపర్తి, నవంబరు 20 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య ఈ నెల 23న భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు పుట్టపర్తి రానున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. ఆమె ఈ నెల 22న రాత్రి 09:05 గంటలకు హైదరాబాద్‌లోని కాచిగూడ నుండి యలహంక ఎక్స్‌ప్రెస్ రైలు నందు బయలు దేరి 23వ తేదిన ఉదయం 06:40 గంటలకు శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ చేరుకుంటారన్నారు. అక్కడి నుండి రోడ్డు మార్గం గుండా ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథిగృహంనకు ఉదయం 07:00 గంటలకు చేరుకొని ఉదయం 08:30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారన్నారు. అనంతరం 08:35 గంటలకు భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని జయంతి వేడుకల్లో పాల్గొంటారని, ఉదయం 10:00 గంటలకు తిరిగి శాంతి భవన్ అతిథి గృహంనకు చేరుకొని విశ్రాంతి తీసకోవడం జరుగుతుందన్నారు. సాయంత్రం 06:00 గంటలకు ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌కు బయలుదేరి, 06:27 గంటలకు కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుగు ప్రయాణం కానున్నట్లు అధికారులు తెలియజేశారు.

# ఆదివాసి దండు కన్నీటి మధ్య హిడ్మా, రాజె అంత్యక్రియలు



- అడుగడుగునా భద్రతా బలగాల ఆంక్షలు
- ప్రధాన రహదారులపై చెక్‌పోస్టులు
- 30యేళ్ల తర్వాత శవమై వచ్చిన కొడుకుని చూసి రోదించిన తల్లి
- ఆదివాసీల సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహణ

చర్ల, నవంబరు 20 ప్రభాతవార్త: మావోయిస్టు ఉద్యమ శిఖరం ఆదివాసిల ముద్దుబిడ్డ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మోస్టు వాటెండ్ నేత మడివి హిడ్మా (సంతోష్), భార్య రాజే (రాజక్క)తోపాటు మరో ఆరుగురు సభ్యులు మంగళవారం మారేడుమిల్లి అటవి ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన విషయం తెలిసిందే. రంపచోడవరం ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రాత్రి 11 గంటలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. హిడ్మా మృతదేహం స్వగ్రామం అయిన పువ్వర్తి గురువారం ఉదయానికి చేరుకుంది. హిడ్మా మృతదేహం స్వగ్రానికి వచ్చిందని తెలుసుకున్న బంధుమిత్రులు, సమీప గ్రామాల ఆదివాసీలు పెద్ద ఎత్తున పువ్వర్తికి చేరుకొని హిడ్మా, రాజే (బార్య భర్తల) మృతదేహాలను చూసి బోరున విలపించారు. ఉద్యమ బాట పట్టి 30 ఏళ్ల తర్వాత శవమై ఇంటికి తిరిగివచ్చిన కొడుకు మృతదేహన్ని చూసి ఆ ముసలి తల్లి బోరున విలపిస్తున్న తీరుతో అందరూ కన్నీటి పర్యంతమయ్యారు. ఇంటికి రా కొడుకా కలిసి బ్రతుకు దాం అంటే ఇలా శవమై తిరిగి వస్తావా అని ఆదివాసి భాషలో పిలపిస్తుండటం చూసిన బంధువులు మరింత రోధనకు గురయ్యారు. పుర్వర్తిలో ఉన్న ఏడు గుంపుల ప్రజలు చిన్ననాటి సహచరుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాల మధ్య హిడ్మా, రాజే మృతదేహాలకు ఆదివాసీల సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు లాంఛనంగా పూర్తిచేసారు.

### అడుగడునా ఆంక్షలు

హిడ్మాను కడసారి చూసేందుకు బయలుదేరిన ఆదివాసీలకు అడుగడుగునా భద్రతా బలగాలు ఆంక్షలు విధించారు. పువ్వర్తి గ్రామానికి వెళ్లే రహదాలను దిగ్బంధనం చేసి అటుగా ఎవ్వరినీ వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. హిడ్మాను చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తే భద్రతకు విఘాగం కలుగుతుందని బావించిన పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి నిరాకరించారు. మీడియాను సైతం అక్కడకు పంపేందుకు నిరాకరించారు. ముందస్తుగా వెళ్లిన వారికి అడ్డంకులు లేకున్నా తర్వాత ఎవ్వరినీ అనుమతించలేదు. భద్రతా కారణాల రిత్యా దండకారణ్యంలో ఉన్న సెల్ సిగ్నల్స్‌ను ముందస్తుగానే నిలిపివేసారు. ఎవ్వరి సెల్‌ఫోన్స్ పనిచేయకుండా జామర్లు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

### అస్తమించిన ఎర్ర సూరీడు

పచ్చని అడవిలో ఆకాశం ఎత్తుకు ఎదిగిన నిండైన చెట్ల మధ్యలో అక్కడ వెసిన చిన్న గుడిసిలు. ఆ గుడారాలు లాంటి గుడిసెల్లో అభంశుభం తెలియని ఆదివాసీలు కలుషితం లేని వాతావరణంలో నిహిస్తున్న మురియా ఆదివాసీ జాతికి చెందిన మడివి హిడ్మా మాంజుకి సరిగ్గా 43ఏళ్ల క్రితం జన్మించాడు. మడివి దేవా ఆలియాస్ (హిడ్మా) సంతోష్ చిన్నతనం నుండి చలాకీతనంగా ఉంటు అందరితో కలుపుగోలుగా తిరిగిన యువకుడు ఏడవ తరగతి చదివే సమయంలో సెలవులకు అప్పుడప్పుడూ ఇంటికి వచ్చిన క్రమంలో గ్రామంలోకి వచ్చే నక్సల్స్ పాటలకు డాన్స్‌లకు ఆకర్షితుడై అతి పిన్నవయస్సులోనే ఉద్యమ బాట పట్టాడు. తెలివైన వ్యక్తి కావడంతో ఉద్యమంలో ఉంటూ హిందీ, ఇంగ్లీస్ భాషలపై పట్టు సాధించడంతోపాటు ఆయుధాల తయారీలోను తర్ఫదు పొందాడు. మావో ఉద్యమంలో అతి ముఖ్యమైన పిఎల్‌జిఏ 1వ బెటాలియన్‌కి చీఫ్‌గా వ్యవహారించి ఎన్నో ఎన్‌కౌంటర్లలో భద్రతా బలగాలను హతమర్చి సంచలనం కలిగించాడు. అతి చిన్న వయస్సులోనూ మావోయిస్టు కేంద్ర కమిటి స్థాయికి ఎదిగి ఆదివాసీ జాతి వేగుచుక్కగా వెలుగొందాడు. 30 ఏండ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నాడు. ఎన్నో సార్లు వాండెట్‌గా మారి ఆపరేషన్ కగార్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని కేంద్ర నిఘా వర్గాల కన్నుగప్పి దండకారణ్యంలో కలియ తిరిగిన ఎర్ర సూర్యుడు కొన్నాళ్లు భద్రంగా ఉందామని ఇన్నాళ్లు కడుపున పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడిన దండకారణ్యాన్ని వీడిన కొద్దిరోజులకే ఆంధ్ర- ఒడిశా బోర్డర్ (ఏవోబి)లో మారేడుమిల్లి టైగర్ జోన్ అటవి ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో మడివి హిడ్మా ప్రాణాలు కోల్పోయాడు.



## సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగస్వామిని కావడం పూర్వ జన్మ సుకృతం: మంత్రి కందుల దుర్గేష్



పుట్టపర్తి, నవంబరు 20 ప్రభాతవార్త: పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించే క్రతువులో మంత్రి కందుల దుర్గేష్ భాగస్వామి అయ్యారు. ఏపీ ప్రభుత్వం సత్యసాయి శత జయంతి ఉత్సవాల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో మంత్రి కందుల దుర్గేష్ సభ్యుడు కావడంతో పరిశీలన బాధ్యతలు చేపట్టి భక్తులకు అందుతున్న ఏర్పాట్లను సహచర మంత్రులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 23వ తేదీ వరకు పుట్టపర్తిలోనే ఉండి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించనున్నారు. మానవాళిలో అధ్యాత్మికత, శాంతి, సమాజసేను పెంపొందించేందుకు శ్రీ సత్యసాయి చేసిన ప్రయత్నాలను భావితరాలకు అందించే కార్యక్రమంలో పాలు పంచుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్‌కు శాంతి భవన్‌లో సహచర మంత్రులు ఎస్.సవిత, బీసీ జనార్థన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్‌లు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీత, స్థానిక ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రులంతా కలిసి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు పుట్టపర్తికి విచ్చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం పలికారు. అనంతరం దగ్గరుండి వేడుకల ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంత్రి కందుల దుర్గేష్ ను ఆప్యాయంగా పలకరించి సంభాషించుకున్నారు. అదే విధంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంత్రి దుర్గేష్‌ను కోరి వినతి పత్రం అందించారు. దారిలో వెళుతుండగా పెదపల్లి గ్రామంలో అయ్యప్ప భక్తులు మంత్రి దుర్గేష్‌ను కలిసి ఘనంగా సత్కరించారు.

## వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



నంద్యాల, నవంబరు 20 ప్రభాత వార్త: ప్రతి విద్యార్థిని వీరనారి ఝాన్సీ లక్ష్మి బాయ్‌ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు. ఆంధ్ర విద్యార్థి సంఘం (ఎవిఎస్) ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలంలో శ్రీ రాజ రాజేశ్వరి స్కూల్లో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఇంటి నుండి దేశం వరకు అభివృద్ధి చెందాలన్నా క్రమశిక్షణతో ఉండాలని, అది ఒక మహిళ వలన సాధ్యం అవుతుందని, వీరనారి పరాక్రవంతురాలైన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని జరుపుకోవడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో గడివేముల రాజరాజేశ్వరి స్కూల్ కరెస్పాండంట్ రామేశ్వరరావు, ఆంధ్ర విద్యార్థి సంఘం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకా ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి నాగరాజు, అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్, అపుస్మా జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, అనురాధ, ఎవిఎస్ పాణ్యం నియోజకవర్గం కన్వీనర్ నాగ శంకర్, నగర కార్యదర్శి సుమంత్, నంద్యాల నియోజకవర్గం కన్వీనర్ హేమంత్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి ఉట్టి పడేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థినులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి బహుమతులు అందించారు.

## అన్నదాతకు కొండంత అండగా చంద్రన్న

### ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్

విజయవాడ, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: అన్నదాత సుఖీభవ రెండోసారి నిధులు విడుదల చేసి రైతులకు భరోసానిచ్చారని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. అన్నదాతకు కొండంత అండగా చంద్రన్న ఉన్నాడని అభివర్ణించారు. గురువారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని జగన్‌రెడ్డి ఎంత దారుణంగా నట్టేట ముంచేశారో గణాంకాలతో వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులున్నా, రైతు కష్టం విలువ తెలిసి జగన్ రెడ్డి పెట్టిన రూ.1,674.47 కోట్ల బకాయిలనూ వెంటనే చెల్లించి రైతుకు భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. అంతేగాదు రూ.4 వేల కోట్లతో ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి రైతులకు భరోసా కల్పించిందన్నారు. రైతును దగా చేసిన జగన్‌రెడ్డి పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతన్న కళ్లల్లో నిజమైన ఆనందం చూసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందని షరీఫ్ పేర్కొన్నారు.



## దుర్గమ్మ ఆలయ నూతన మాస్టర్‌ప్లాన్‌పై ఎంపి కేశినేని సమీక్ష

### దుర్గమ్మ ఆలయంలో కార్తీమాసోత్సవాల పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రి, నవంబరు 19 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయం అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌పై ఎంపి కేశినేని శివనాథ్ గురువారం ఆలయంలో సమీక్ష నిర్వహించారు. పశ్చిమ ఎసిపి దుర్గారావు, సిఐ గురుప్రసాద్ లు భద్రతా పరమైన అంశాలపై సూచనలందించారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే, అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దుర్గమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాలను గురువారం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఓ భక్తులకందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఘాట్‌రోడ్డు మరమత్తు చేయాలని, యాగశాలలో ఎగ్జాస్ట్‌ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని భక్తబృందం ఆయనను కోరారు. రాబోయే రోజుల్లో మరమత్తులు చేయిస్తామని, త్వరలో ఎగ్జాస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేయిస్తామని ఛైర్మన్ తెలిపారు. నూతన యాగశాల రు.5.50 కోట్లతో నిర్మాణం చేయించిన దాత సంగ నరసింహారావును ఇఓ, ఛైర్మన్లు అభినందించారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ నిత్య హోమాలు, ప్రత్యేక పూర్ణాహుతి, చండీహోమాలు, నిత్య కైంకర్యాలు, దసరా ఉత్సవాల్లో జరిగే పలు పూజలు, నిర్వహిస్తామన్నారు.

### జగన్మోహినిగా శ్రీ అమ్మవారు



పాత శివాలయంలో వేంచేసి యున్న శ్రీ భ్రమరాంబ అమ్మవారు జగన్మోహినిగా భక్తు లను అనుగ్రహించారు. కార్తీక మాస నక్త ఉత్సవాల్లో భాగంగా గురువారం చివరిరోజు శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకం, చండీ సప్తశతి హోమం, రుద్ర హోమం, మహా లింగార్చన, విశేష అలంకారాలు, కార్తీకమాస నక్తదీక్షకు పూర్ణా హుతిని మురళీ ధరన్ నంబూద్రి, రాచకొండ నాగజారు శర్మ, కొత్తపల్లి సాయికృష్ణ శర్మ తదితర పండితులు నిర్వహించారు. ఇఓ నటరాజన్ షణ్ముగం, ఛైర్మన్ మధు, తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవాలకు గురువారం పూర్ణాహుతి నిర్వహించారు. ఇఓ, ఛైర్మన్, పాలకమండలి పాల్గొన్నారు.



దుర్గమ్మవారి ఆలయంలో గురువారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. బిల్వార్చన వేదోక్తంగా చేశారు. ఇఓ, ఛైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. చతుర్వేద స్వస్తి, పంచహారతులు, మహానివేదనలు గావించారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవారు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.



దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పళనిసామి దంపతులు రు.1,00,116ల విరాళాన్ని గురువారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అదికారులు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాన్ని అందించారు.

## గోదావరి- నల్లమల సాగర్ అనుసంధానంతో వెనుకబడిన ప్రాంతాల సమ్మిళిత అభివృద్ధి



సచివాలయం, నవంబరు 20 ప్రభాతవార్త: ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు సరఫరా ద్వారా ప్రజల ఆరోగ్యరక్షణ, నల్లమల సాగర్ అనుసంధానంతో జరుగు తుందని 20సూత్రాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. గురువారం సచివాలయంలో విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ... కరువు ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ అమలుకు దీర్ఘకాలిక నీటి వనరుల లభ్యత 53.850 టిఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న వెలిగొండ ప్రాజెక్టు నల్లమల సాగర్ రిజర్వాయర్‌కి బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా గోదావరి నదీ జలాల అనుసంధానం నిర్ణయం చారిత్రాత్మకం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఈ ప్రాంత ప్రజలు జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని లంకా దినకర్ తెలిపారు.

## తెలుగు అయ్యప్ప స్వాములపై కేరళ పోలీసుల దౌర్జన్యాలను ఆపాలి

గుంటూరు, నవంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్ర. తెలంగాణ నుండి శబరిమల అయ్యప్ప దర్శనానికై వెళ్లే తెలుగు స్వాములను అవమానిస్తూ దౌర్జన్యపూరితంగా వ్యవహరించే కేరళ పోలీసులపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శబరిమలై వెళుతున్న తెలుగు స్వాముల పట్ల చాలా అవమానకరంగా అసభ్యకరంగా దౌర్జన్యపూరితంగా కొందరు కేరళ పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. భక్తుల మనోభావాలను విశ్వాసాలను గౌరవిస్తూ, వారికి అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తూ గౌరవంగా మెలగాల్సిన రక్షక భటులే భక్తులను కించపరిచేలా ప్రవర్తించడం దుర్మార్గమని కేసన శంకరరావు అన్నారు.

# ముందుతరాలకు చుక్కా రామయ్య విద్యాస్ఫూర్తి



**100వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్**

**ప్రభుత్వం పక్షాన పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పిన మంత్రి పొన్నం**

**అభినందనలు తెలిపిన మాజీ మంత్రి, పలువురు ప్రముఖులు**

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** అద్భుత విద్యా బోధనతో..యువత భవితకు బంగారు బాటలు వేసి ఐఐటీ రామయ్యగా పేరుగాంచి, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన మేధావి చుక్కా రామయ్యకి శత వసంత జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. మీరు మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నట్టు ఎక్స్ ఖాతాలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఐఐటీ రామయ్యగా పేరుగాంచిన ప్రముఖ విద్యా వేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య భవిష్యత్తు తరాలకు విద్యారంగంలో చుక్కా రామయ్య స్ఫూర్తి అని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పెద్దలతోపాటు, పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలపగా.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటి రామారావు చుక్కారామయ్యకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 100 వ పుట్టిన రోజు సందర్భంగా విద్యానగర్‌లోని చుక్కా రామయ్య నివాసంలో ఆయనకు మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు సిడబ్ల్యూసి సభ్యులు గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హారగోపాల్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మాడభూషి శ్రీధర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యా దేవోభవ అని తల్లిదండ్రులతో సమానంగా గౌరవించుకొని ఆచార్యులుగా ఉండి ఆ పదాలకు నిండు అర్థం తీసుకొచ్చి 100 సంవత్సరాల జన్మదినం జరుపుకుంటున్న చుక్కా రామయ్యకి ప్రభుత్వం పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్టు మంత్రి తెలిపారు. భవిష్యత్తు తరాలకు విద్యారంగంలో వారి స్ఫూర్తిని తీసుకుని వారి మార్గదర్శకత్వంను ప్రతి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకుంటే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుంటుందన్నారు. తాను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుండే చుక్కా రామయ్యతో అత్యంత సన్నిహిత సంబంధం ఉందని.. వారు మాకు మార్గదర్శకత్వం, స్ఫూర్తి అన్నారు. వారి స్ఫూర్తిని తీసుకుని ప్రభుత్వంలో విద్యారంగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. గతంలో పేదలకు ఇచ్చేందుకు భూములు ఉండేవని, ప్రస్తుతం దేశంలో ఆర్థిక పరిస్థితుల దృశ్య భూములు ఇవ్వడం సాధ్యం కాదని.. ఇవ్వగలిగేది విద్య మాత్రమేనని, ప్రజా పాలన ప్రభుత్వం లో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. 100 సంవత్సరాల చుక్కా రామయ్య జ్ఞాపక శక్తి అద్భుతమని, హారగోపాల్ పెళ్లి చేశానని చుక్కా రామయ్య చెప్తున్నారని అన్నారు. వారి 100 సంవత్సరాల జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి అభినందన కార్యక్రమం చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**చుక్కా రామయ్యకు కెటిఆర్ జన్మదిన శుభాకాంక్షలు**

ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య 100వ జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యానగర్‌లోని ఆయన నివాసానికి వెళ్ళిన కెటిఆర్ శాలువాతో సత్కరించారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్ కూడా చుక్క రామయ్యకు శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యాప్రదాత, తెలంగాణ పోరాటంలో, రాజకీయాల్లో దిక్సూచిగా తనదైన పాత్ర పోషించిన ఆయన 100వ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో స్ఫూర్తి దాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థుల భవితను తీర్చిదిద్దిన వ్యక్తి రామయ్య అన్నారు. ఐఐటీ అనగానే గుర్తుకొచ్చే తొలి పేరు, విద్య అంటే గుర్తుకొచ్చే మార్గదర్శి, సేవ అంటే గుర్తుకొచ్చే స్ఫూర్తి అంతా చుక్కా రామయ్యదే అని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐఐటీ పూర్తి చేసి ప్రపంచ దేశాల్లో స్థిరపడడానికి కారణం చుక్క రామయ్య అని కొనియాడారు. ఆయన ఆరోగ్యంగా, సుదీర్ఘకాలం జీవించాలని ఆకాంక్షించారు.



ప్రజాభవన్‌లో బాలల ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారెడ్డి, దివ్య తదితరులు.

## బాల్యం నుంచే పిల్లలను వివిధ రంగాల్లో ప్రోత్సహించాలి

**సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి జి. చిన్నారెడ్డి**

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 20, ప్రభాతవార్త:** చిన్నతనం నుంచే పిల్లలను వివిధ రంగాల్లో ప్రోత్సహించాలని, వారి మనోభావాలకు అనుగుణంగా పెద్దలు ముందుకు సాగాల్సిన అవసరమెంతైనా ఉందని సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజాభవన్‌లో బాలల ప్రజా వాణి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ పిల్లల బం గారు భవిష్యత్ కోసం కృషి చేయాల్సిన ఆవశ్యకత బాధ్యత తల్లిదండ్రులకు, గురువులకు ఉందని అన్నారు. ముఖ్యంగా బాలికల పట్ల గౌరవంగా ఉండాలని, బాల్యవివాహాలు చేయవద్దని చిన్నారెడ్డి సూచించారు. బాలల హక్కులను పరి రక్షించాలని అన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని అన్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రజావాణిని నిర్వహించడం గొప్పవిషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సిఇఒ దివ్యదేవరాజన్, యూని సెఫ్ సౌత్ ఇండియా చీఫ్ జలేలం తఫెసీ, ఛైల్డ్ రైట్స్ సంస్థ అధికారి రమేష్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమంతనాలలో గిరిజనుడు హత్య





పెద్దదోర్నాల, నవంబరు 20 ప్రభాతవార్త: ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం పెద్ద మంతనాలలో గురువారం చెంచు గిరిజనుడు హత్యకు గురయ్యారు. ఈ సంఘటన లో పెద్దమంతనాల చెంచు గూడానికి చెందిన ఆర్తి అంకన్న(25) మృతి చెందాడు. సమాచారం అందు కున్న యర్రగొండపాలెం సీఐ అజయ్ కుమార్, ఎస్సై వి.మహేష్, సంఘ టనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యర్రగొండపాలెం సీఐ అజయ్ కుమార్ తెలిపిన వివ రాల మేరకు నాగన్న చేతి కట్టెలు అమ్ముకునేందుకు కుంటకు వెళ్లి తిరిగి ఇంటికి రాగా అప్పటికే భార్య మద్యం తాగి ఉంది. ఎవరు నీకు మద్యం తాపారని భర్త నాగన్న భార్యను అడుగగా అంకన్న తాపాడని ఆమె తెలి పింది. దీంతో కోపగించిన నాగన్న కమ్యూనిటీ హాల్ దగ్గర అంకన్న ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి అంకన్నపై నాగన్న బోడ్లో ఉన్న కత్తితో గుండెలపై దాడి చేశాడు. తీవ్ర గాయాలతో నేలకొరిగిన అంకన్నను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. యర్రగొండపాలెం సీఐ అజయ్ కుమార్ పర్యవేక్షణలో ఎస్సై వి.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం సీఐ కే.అజయ్ కుమార్ మాట్లాడుతూ మారుణాయుధాలు (కత్తులు, గొడ్డళ్ల అంబులు) కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

## ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్



**8 వారాల పైలట్ ప్రోగ్రాం అమలుకు నిర్ణయం**

**సిఎం రేవంత్‌రెడ్డితో అనలాగ్ ఎఐ సిఇఒ కిప్మన్ భేటీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 20:** హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం అనలాగ్ ఎఐ సీఈఓ అలెక్స్ కిప్‌మన్ సీఎంను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను చర్చించారు. ట్రాఫిక్, అర్బన్ ఫ్లడింగ్, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించే మార్గాలను చర్చించారు. ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేసే వీలుందని అభిప్రాయ పడ్డారు. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీలో ఫిజికల్ ఇంటెలిజెన్స్ పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించారు. ఎనిమిది వారాల పాటు ఈ ప్రోగ్రాం అమలవుతుంది. ఇందులో భాగంగా సీసీ టీవీ వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌గా మారుస్తారు. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేస్తారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి లైవ్గా దీన్ని మానిటరింగ్ చేస్తారు. ఈ పైలెట్ ప్రోగ్రాం పూర్తయ్యేనాటికి హైదరాబాద్ దేశంలోనే తొలి ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా మారుతుందనే అంచనాలున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీని పరిశోధన.. సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను వివరించారు. ఆర్థిక వృద్ధికి సైతం ఫిజికల్ ఇంటెలిజెన్స్ అత్యుత్తమ పరిష్కారాలను అందిస్తుందని కిప్మన్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. డిసెంబర్ 8-9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు రావాలని సీఎం ఆయనను ఆహ్వానించారు.

## పేదలు పస్తులుండే రోజులు పోయాయి

**ఇందిరమ్మ క్యాంటీన్‌లో భోజనం అద్భుతం**

**మాజీ ఎంపి వి.హనుమంతరావు**



ఇందిరమ్మ క్యాంటీన్‌వద్ద భోజనం చేస్తున్న వి.హనుమంతరావు

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ క్యాంటీన్‌లో భోజనం అద్భుతంగా ఉందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కితాబిచ్చారు. ఈమేరకు గురువారం మింట్ కాంపౌండ్‌లోని క్యాంటీన్ వద్ద రూ.5 వెచ్చించి స్వయంగా భోజనం చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన స్థానిక యువకులతో మాట్లా డారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5కే అద్భుతమైన భోజనం అందిస్తోందని ప్రభుత్వం కల్పి స్తున్న ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. సామాన్య పేద ప్రజలకు ఇందిరమ్మ భోజనము చాలా రుచిగా ఉందని పేదలు పస్తులుండే రోజులు పోయాయని అన్నారు. విహెచ్‌తోపాటు కాంగ్రెస్‌నేతలు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, లంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## నల్గొండకు లక్ష మె.ట. ఉప్పుడు బియ్యం కోటా మంజూరు చేయాలి

**కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి లేఖ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 20:** కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గురువారం లేఖ రాశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా కోరారు. 2025-26 ఖరీఫ్ సేకరణలో నల్గొండ జిల్లాకు కనీసం ఒక లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటాను మంజూరు చేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. దీని వలన సిఎంఆర్ సజావుగా పంపిణీ చేయబడుతుందని ఆయన వివరించారు. తీవ్రమైన నిల్వ పరిమితులను పరిగణనలోకి తీసుకుని, ధాన్యాన్ని వేగంగా తరలింపును సులభతరం చేయడానికి నల్గొండ జిల్లాకు అదనపు రైల్వే వ్యాగన్లను కేటాయించాలని ఆయన కోరారు. తుఫాను సంబంధిత వరి నష్టం నుండి ఉత్పన్నమయ్యే అసాధారణ పరిస్థితుల దృష్ట్యా, సంబంధిత ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులను కొన్ని సడలింపులతో సిఎంఆర్ బియ్యాన్ని తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు. నిరంతర సేకరణ కార్యకలాపాలు, రైతులకు సకాలంలో చెల్లింపులు, జిల్లాలో సరఫరా గొలుసు సజావుగా పనిచేయడానికి కేంద్ర ప్రభుత్వం సహాయం అవసరం అని పేర్కొన్నారు. తెలంగాణలో రైతుల సంక్షేమం కోసం కొన సాగుతున్న సేకరణ కార్యకలాపాల దృష్ట్యా ఈ విషయంలో వెంటనే స్పందించాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి లేఖ ద్వారా కేంద్రాన్ని కోరారు.

## రాజమౌళి సినిమాలను హిందూ సమాజం బహిష్కరించాలి : ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** ప్రముఖ దర్శకుడు రాజమౌళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాజాసింగ్ ధ్వజమెత్తారు. రాజమౌళి నిజంగా నాస్తికుడైతే డిక్లేర్ చేయాలని డిమాండ్ చేశారు. రాజమౌళి ప్రతీ సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని పిలుపునిచ్చారు. దేవుళ్లపై సినిమాలు తీసి కోట్లు సంపాదించారని, దేవుళ్ల అంటే నమ్మకం లేనప్పుడు ఆ సినిమాలు తీయడం ఎందుకని రాజాసింగ్ ప్రశ్నించారు. ఆయన వారణాసి సినిమా ప్రమోషన్స్ కోసమే అలా మాట్లాడారా.. అనే దానిపై క్లారిటీ ఇచ్చి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహేష్‌బాబుతో రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల కోసం పెద్దఎత్తున ఒక ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదట కథా రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వారణాసి కోసం మహేష్ చాలా కష్టపడ్డారని చెప్పారు. అనుక్షణం రాజమౌళి గుండెలపై హనుమాన్ ఉన్నా డని విజయేంద్రప్రసాద్ చెప్పగా వారణాసి గ్లింప్స్ విడియో రిలీజ్‌కు పదేపదే సాంకేతిక ఆటంకాలు ఎదురుకావడంతో రాజమౌళి నిరాశ చెంది హను మంతుడు నా వెనుకాల ఉండి నడిపించారని మా నాన్న చెప్పారు. హను మంతుడు ఉంటే ఇదేనా నడిపించేది? అని అసహనం వ్యక్తం చేశారు.

## బిసిల జనాభాకు అనుకూలంగా రిజర్వేషన్లు కల్పించాలి

**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్ఎల్‌డి పోటీలో ఉంటుంది**

**రెండోదశ సామాజిక రథయాత్రలో పాల్గొన్న కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి జయంత్‌సింగ్**



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జయంత్‌సింగ్, ఎంపీ ఆర్.కష్ణయ్య, మాజీ ఎమ్మెల్సీ వినోద్‌కుమార్

**హైదరాబాద్(ఎల్.బి.నగర్), నవంబరు 20, ప్రభాత వార్త:** ఆర్ఎల్‌డి ఎల్లప్పుడూ తెలంగాణకు కట్టుబడి ఉందని, సామాజికంగా సమానమైన తెలంగాణను ఊహించే పార్టీ తమదని కేంద్ర స్కిల్ డెవలప్ మెంట్ శాఖ మంత్రి జయంత్‌సింగ్ అన్నారు. రాష్ట్ర లోక్‌దళ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ నాయకత్వంలో రెండో దశ సామాజిక అవగాహన రథయాత్ర హైదరాబాద్ ఆర్కేపురం క్యాంప్ కార్యాల యంలో గురు వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బిసిలకు వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్ఎల్‌డి అభ్యర్థులను నిలబెడుతుందని ఆయన ప్రకటించారు. ఆర్ఎల్‌డి గుర్తు అయిన హ్యాండ్ పంప్‌కు ఓటు వేసి ఆదరించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీ, వారంటీలు ఏమయ్యాయని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కష్ణయ్య మాట్లాడుతూ కేంద్రమంత్రి జయంత్‌సింగ్ తాత, మాజీ ప్రధాన మంత్రి చరణ్‌సింగ్ నాయకత్వంలో మండల్ కమిషన్ స్థాపించబడిందని, తరువాత అజిత్‌సింగ్ కూడా అదే మార్గంలో కొనసాగారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక అవగాహన యాత్ర మొదటి దశ సందర్భంగా తెలంగాణ అంతటా బీసీలలో బలమైన ఐక్యత వచ్చిందని, ఎస్సీ, ఎస్టీలలో ఐక్యత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఆర్ఎల్‌డి జాతీయ మహిళా అధ్యక్షురాలు కపిలవాయి ఇందిర మాట్లాడుతూ తమ పార్టీ యువత రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ వర్గాలకు అధిక శాతం సీట్లు కేటాయిస్తుందని అన్నారు.

## తుమ్మిడిహెట్టిపై చిగురిస్తున్న ఆశలు

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** తుమ్మిడిహెట్టి-సుందిళ్ల లింకుకు వివరణాత్మక నిర్దిష్ట ప్రయోజన నివేదిక (డిపిఆర్) తయారించడానికి టెండర్లు పిలవడంతో ప్రాణహిత చేవెళ్ల పథకంపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంచేసి నీటిని ఒక కి.మి నిడివి కలిగిన కాలువ తవ్వి భూమి గురుత్వఆకర్షణతో నీటి ప్రవాహంను నెన్నెల మండలం మైలారం వరకు తీసుకొస్తారు. అక్కడి నుంచి 20 కి.మీ. మేర సొరంగం తవ్వి అందులో నుంచి నీటి ప్రవాహం టేకుమట్ల వాగులోకి తీసుకొస్తారు. తుమ్మిడిహట్టి బ్యారేజి నుంచి వచ్చిన ప్రాణహిత నీరు టేకుమట్ల వాగులో 11కి.మి ప్రవహించి జైపూర్ మండలం టేకుమట్ల శివారులోని గోదావరిలో కలుపడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలని మొదట భావించినా బొగ్గ గనులు ఉండటం, దూరం, ఆర్థిక భారం అవుతుందని పక్కన పెట్టారు. భూమి గురుత్వాకర్షణతో నీటి ప్రవాహానికి అవకాశం ఉండటం, అదనపు పంపుల ఏర్పాటు లేకపోవడం, ఖర్చు తక్కువగా ఉండటంతో తుమ్మిడిహెట్టి -సుందిళ్ల లింకుకు ప్రభుత్వం మొగ్గుచూపుతోన్నది.

వివరణాత్మక నిర్ధిష్ఠ ప్రయోజన నివేదిక తయారీకి అక్టోబరు 30న రాష్ట్ర నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా రూ.11.88 కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేశారు. దీంతో నీటి లభ్యత, భౌగోళిక పరిస్థితులు, పర్యావరణం, ఇప్పటి వరకు ఉన్న కాల్వల స్థితిగతుల గురించి అధ్యయనం చేసేందుకు టెండర్లను పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చితే జైపూర్ మండలం టేకుమట్ల వాగు ప్రాణహిత నది జలాలతో పరవళ్ల తొక్కనుంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాణహిత చేవెళ్ల ద్వారా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ఏర్పాటు చేసి ఆ జలాలను ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తరలించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ఈ ప్రాజెక్టును శీతలగిడ్డంగిలో దాచారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీని ఏర్పాటు చేసి ప్రాణహిత, గోదావరి జలాలను అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల నుంచి రివర్స్‌పంపింగ్ తో ఎల్లంపల్లికి ఎత్తిపోస్తూ కొండపోచమ్మ మల్లన్న సాగర్ వరకు నీటిని తీసుకొచ్చారు.

## కట్టుకున్న వాడే కాలయముడు!

**భార్యను గొంతుకోసి కిరాతకంగా హతమార్చిన భర్త**

**అడ్డువచ్చిన కుమార్తెపైనా కత్తితో దాడి**

**ఖమ్మంలో సంచలం రేపిన ఘటన**



**ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త:** కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు.. కాపాడాల్సిన వాడే.. కడ తేర్చాడు. భార్యాభర్తల మధ్య తలెత్తిన మన స్పర్ధలు చిలికి చిలికి గాలి వానలా మారి హత్యలకు పురిగొల్పాయి. భార్యను కిరాతకంగా గొంతు కోసి చంపిన భర్త అడ్డువచ్చిన కుమార్తె ను కూడా వదిలిపెట్టకుండా.. కత్తితో దానికి పాల్పడడంతో ఆ చిన్నారికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ ప్రాంతంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సం బంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. చింతకాని మండలం నేరడకు చెందిన గోగుల భాస్కర్‌తో జగ్గయ్యపేటకు చెందిన సాయి వాణి కి గత కొన్ని నెలల క్రితం వివాహం జరిగింది, వీరికి ఓ కుమార్తె(14), కుమారుడు(8) ఉన్నారు. భార్యాభర్తల మధ్య గత ఏడాదికాలంగా తీవ్ర మనస్పర్ధలు ఏర్పడి ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో భర్తతో దూరంగా ఉంటున్న సాయి వాణి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు గా పని చేస్తుంది. భర్త భాస్కర్ మాత్రం ఏ పని లేకుండా తిరుగుతున్నాడు. అయితే గత రాత్రి తన భార్య సాయి వాణి వద్దకు వచ్చిన భాస్కర్ ఆమెతో ఘర్షణకు దిగాడు, ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున మళ్లీ ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకోగా కత్తి తీసుకుని భాస్కర్ సాయి వాణిని గొంతు కోసేసాడు, భాస్కర్ ను అడ్డుకున్న 14 ఏళ్ల కూతురి పైన భాస్కర్ కర్కశంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో చుట్టుపక్కల వాళ్ళు విషయం తెలుసుకుని భాస్కర్ కు దేహశుద్ధి చేశారు. భాస్కర్ దాడిలో గాయపడిన కుమార్తెను స్థానికులు ఆస్పత్రికి తరలిం చారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తి, టూ టౌన్ సీఐ బాలకృష్ణ సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## బూటకపు ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు నాయకుల హత్య

**మావోయిస్టులతో కేంద్రం ఎందుకు చర్చించడం లేదు?**

**నేడు ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద 'అఖిలపక్షాల ధర్నా'**

**సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయం**

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** బూటకపు ఎన్ కౌంటర్లతో మావోయిస్టు నాయకులను హత్య చేస్తున్నారని వివిధ రాజకీయ పార్టీల నేతలు విమర్శించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు చర్చలకు అవకాశం కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. దేశపౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చించడం లేదని నాయకులు ప్రశ్నించారు. బూటకపు ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టు నాయకులను హత్య చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర 'అఖిలపక్ష పార్టీల ధర్నా' నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సంతకాల సేకరణను చేపట్టాలని నిర్ణయించారు. బూటకపు ఎన్ కౌంటర్లపై పౌర సమాజం స్పందించకపోతే భవిష్యత్ మరింత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంద న్నారు. 'బిజెపి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా మావోయిస్టులను చంపడాన్ని నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ మఖ్దూంభవన్ గురువారం 'రౌంట్ టేబుల్' సమావేశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివ రావు అధ్యక్షతన నిర్వహించింది. సమావేశంలో వామ పక్ష, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల నాయకులు, మేధావులు పాల్గొన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో కలుస్తామని ముందుకొచ్చే మావోయిస్టులకు అవకాశం కల్పించకుండా, వారిని పట్టుకుని చంపేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి వంటి ఫాసిస్టు శక్తులు బలపడితే దేశానికి, సమాజానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను, కాంగ్రెస్ వామపక్ష భావజాలం ఉన్న వారిని కేంద్రంలోని బిజెపి బలహీన పర్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. మతం పేరుతో బిజెపి రాజకీయాలు చేస్తోందన్నారు.

హిడ్మా, కేశవరావు, తిరుపతి ఇలాంటి వారిని నాయకులుగా గుర్తిస్తామని, వారు ఎంచుకున్న పద్ధతి ప్రభుత్వాలకు నచ్చకపోయినప్పటికీ వారు తమ జీవితాంతం ప్రజల కోసం పాటు పడ్డారని గుర్తు చేశారు. మారిన పరిస్థితుల కారణంగా ఎలి మినేషన్ అనేది సరి కాదని, ప్రజాస్వామ్య దేశంలో చంపడం ఒక్కటే మార్గం కాదన్నారు. జన జీవన స్రవంతి లో కలుస్తామని చెప్పిన వారిని కూడా పట్టుకుని చంపడం ఏం పద్ధతి అని మండిపడ్డారు. ఛత్తీస్, జార్ఖండ్ ఉన్న విలువైన ఖనిజాలను కార్పొరేట్ లకు అప్పగిం చేందుకే కేంద్రం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. పాలకులు, మావోయిస్టుల తరపున జరిగే హింసను తాము వ్యతిరేకిస్తున్నామని మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపిన మావోయిస్టుల మృతదేహాలకు న్యాయమూర్తి, కుటుంబ సభ్యుల సమక్షంలో శవ పరీక్షలు నిర్వహిం చాలని, దీనిని వీడియో తీయాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలని, ఇప్పటి వరకు జరిగిన ఎన్ కౌంటర్ల పైన శ్వేతపత్రం విడుదల చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ రాజకీయ ఉద్యమాలను హింసతో రూపుమపలేవని, వ్యక్తులను చంపి, వారిని అణిచివేయవచ్చుని, కానీ వ్యవస్థను అణచివేయడం సాధ్యం కాదని సూచించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రాన్ని, ప్రదాని మోదీ, బిజెపిని ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా కేంద్రం దాడి చేస్తోందన్నారు. ప్రొఫెసర్ హారగోపాల్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం చెబుతున్న 'అభివృద్ధి నమూనా'లో మానవతా విలువలు లేవన్నారు. అడవి ప్రాంతాల్లోని వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రకృతిని విధ్వంసం చేస్తూ, అడ్డుగా ఉన్న మనుషులను చంపేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ పౌర హక్కుల నాయకులు నారాయణతో పాటు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, నెదునూరి జ్యోతి, రమావత్ అంజయ్య నాయక్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు ఫైమీద, సిపిఐ (ఎం.ఎల్. న్యూడెమోక్రసి నాయకులు కె.గోవర్దన్ పాల్గొన్నారు.

# పోలి పాడ్యమి విశిష్టత





పోలి పాడ్యమి.. కార్తీక అమావాస్య మర్నాడు వచ్చే రోజుని పోలి పాడ్యమి అంటారు. ఈ రోజు నుండి మార్గశిర మాసం ప్రారంభం అవుతుంది. కార్తీక మాసం శివుడిని పూజిస్తే.. మార్గశిర మాసంలో విషుమూర్తిని పూజిస్తారు. పోలి పాడ్యమి రోజున మహిళలు, యువ తులు అరటి దొప్పలలో దీపాలు వెలిగించి.. నీటి కొలనులు, చెరువులు, నదుల్లో పసుపు కుంకుమలతో వదులుతారు. ఇలా ఎందుకు చేస్తారు ? దాని వల్ల కలిగే ఫలితాలేంటో తెలుసుకుందాం. కార్తీక మాసం పూర్తికాగానే గుర్తొచ్చే కథ పోలి స్వర్గం. ఇంతకీ ఆవిడ ఎవరు ? ఎందుకు పూజిస్తారు ? అంటే ఆసక్తికరమైన కథలు చెప్తుంటారు. ఇది అసలు సిసలైన తెలుగువారి ఆచారం. ఒక ఊరిలో ఒక ఉమ్మడి కుటుంబం ఉండేది. ఆ కుటుంబంలో ఐదుగురు కొడుకులు, కోడళ్లు ఉండేవారు. అందరిలోకెల్లా చిన్నాకోడలైన పోలి అనే మహిళకు చిన్ననాటి నుండి పూజలన్నా, వ్రతాలన్నా ఆసక్తి. కానీ.. ఆమె చూస్తే అత్తగారికి కంటగింపుగా ఉండేది. పూజలు చేయడంలో తనను మించి భక్తురాలు లేరని, ఆచారాలను పాటించే హక్కు తనకే ఉందన్న అహంభావాన్ని కలిగి ఉండేది. కార్తీక మాసంలో చిన్నకోడలు మినహా.. మిగతా కోడళ్లను కూడా తీసుకుని నదికి బయల్దేరేది. అక్కడ కోడళ్లతో కలిసి నదీ స్నానం చేసి.. దీపాలు వెలిగించి ఇంటికి వచ్చేది. తాను దీపం పెట్టి వచ్చేలోగా చిన్నకోడలు తనకంటే ముందుగా దీపారాధన చేస్తుందేమోనని ఇంట్లో ఉండే పూజా సామానులన్నింటినీ వెంట తీసుకెళ్లేది అత్తగారు. కానీ పోలి దీపం పెట్టకుండా చేసిన ప్రయత్నాలు మాత్రం ఫలించలేదు. పెరటులోని పత్తి చెట్టు నుండి పత్తిని తీసి.. దానితో ఒత్తిని చేసేది పోలి. కవ్వానికి ఉన్న వెన్నను ఆ ఒత్తికి రాసి దీపం వెలిగించేది. ఆ దీపం ఎవరికీ కనిపించకుండా దానిపై ఓ బుట్టను బోర్లించేది. కార్తీక మాసమంతా ఇలా నిర్విఘ్నంగా దీపాలు వెలిగించింది పోలి. ఆఖరిరోజైన అమావాస్య రానే వచ్చింది. ఆరోజు నదీస్నానం చేసి.. దీపారాధన చేసేందుకు బయల్దేరింది అత్తగారు. వెళ్తూ వెళ్తూ పోలికి ఎక్కడలేని పనులన్నీ అప్పజెప్పి.. దీపాలు పెట్టే తీరిక లేకుండా చేసింది. కానీ పోలి ఎప్పటిలాగే ఇంటిపనులన్నీ ముగించుకుని దీపాన్ని వెలిగించింది. భారతదేశంలో భక్తులు అత్యధికంగా సందర్శించే ఆలయాలు ఎన్ని ఆటంకాలు ఎదురైనా నిర్మలమైన భక్తితో అందుబాటులో ఉన్న పూజా సామాగ్రితో తనను పూజించిన పోలి భక్తికి మెచ్చి పుష్పక విమానాన్ని పంపుతారు దేవతలు. ఊరిజనమంతా చూస్తుండగానే పోలి స్వర్గానికి వెళ్లేందుకు ఆ విమానంలో ఎక్కుతుంది. తనకంటే ముందు పోలి స్వర్గానికి వెళ్లడం సహించలేని అహంకారి అత్తగారు.. పోలి కాలు పట్టుకుని కిందికి లాగుతుంది. మిగతా నలుగురు కోడళ్లు ఒకరి కాలు ఒకరు పట్టుకుంటారు. ఆగ్రహించిన దేవతలు పోలితో వారికి పోలిక లేదంటూ కిందికి నెట్టేస్తారు. పోలమ్మ స్వర్గానికి చేరుకుంటుంది. అందుకే మార్గశిర పాడ్యమి నాడు అరటి దొప్పలలో దీపాలు వెలిగించి..పోలిని స్వర్గానికి పంపుతూ నీటిలో వదులుతారు. అలాగే తమకు పసుపు కుంకుమలు ఇవ్వాలని, తమకీ స్వర్గ ప్రాప్తి కలగాలని కోరుకుంటారు. ఇదీ పోలిపాడ్యమి వెనుక ఉన్న నిజమైన కథ. □

# గర్భనిరోధక సాధనానికే సవాలు విసిరిన శిశువు



తానొకటి తలిస్తే దైవమొకటి తలనట్లు అయ్యింది బ్రెజిల్ కు చెందిన క్వైడీ అరౌజో డి ఒలివీరా అనే మహిళ పరిస్థితి. ఈమె ఇప్పుడే సంతానం వద్దు అనుకుని దాదాపు రెండు సంవత్సరాలుగా ఇంట్రా యూరెటైన్ డివైజ్" (ఐయుడి) లేదా 'కాపర్ కాయిల్' అని పిలిచే గర్భనిరోధక సాధనాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, ఆమె ప్రయత్నాలు విఫలమై పండంటి మగశిశువును ప్రసవించింది.

డెలివరీ రూమ్‌లో గర్భనిరోధక కాయిల్‌ను చేతిలో పట్టుకున్న ఆ బుడతడి ఫోటో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. బ్రెజ్ దేశం గోయియాస్, నెరోపోలిస్‌లోని సాగ్రాడో కొరాకో డి జీసస్ ఆసుపత్రిలో క్వీడీ అరౌజోడి ఒలివేరాకు ఆ బిడ్డ జన్మించింది. మిర్రర్ ఉదహరించిన నివేదికల ప్రకారం, నవజాత శిశువు రాగి టిని పిడికిలితో పట్టుకుని రావడాన్ని చూసి వైద్యులు ఆశ్చర్యపోయారు. సాధారణంగా ఐయుడి గర్భనిరోధక సాధనాలు తొంభై తొమ్మిది శాతానికి పైగా విజయవంతంగా గర్భాన్ని నిరోధిస్తాయని ప్రఖ్యాతి గాంచడం విశేషం. ఇలాంటి అరుదైన సంఘటనలు పది లక్షల మందిలో ఒకరికి జరిగే అవకాశం ఉంటుందని వైద్యుల అభిప్రాయం. ఐయుడి అంటే ఏమిటి అవి ఎలా పని చేస్తాయి గర్భాశయ పరికరం లేదా ఐయుడి అనేది గర్భధారణను నివారించడానికి గర్భాశయం లోపల ఉంచబడే ఇంగ్లీషు అక్షరం 'గి' ఆకారంలో ఉండే జనన నియంత్రణ పరికరం. వీటిలో రాగి ఐయుడి మరియు హార్మోన్ల ఐయుడి అని రెండు రకాలు ఉంటాయి. మాయో క్లినిక్ ప్రకారం, రాగి ఐయుడిలు రాగి అయాన్‌లను విడుదల చేయడం ద్వారా పనిచేస్తాయి. ఇది వీర్యకణాలు అండాన్ని చేరుకోవడాన్ని నిరోధిం ఫలదీకరణ ప్రక్రియ కష్టతరమయ్యే ప్రతికూల పరిస్థితులను కల్పిస్తుంది. మరోవైపు, హార్మోన్ల ఐయుడిలు ప్రొజెస్టిన్‌ను విడుదల చేస్తాయి. ఇది గర్భాశయ శ్లేష్మాన్నికగా చేసి, వీర్యకణాలను నిరోధించడానికి గర్భాశయ పొరను పలుచబరుస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, ఐయుడి అనేది అందుబాటులో ఉన్న అత్యంత ప్రభావవంతమైన గర్భనిరోధక పద్ధతుల్లో ఒకటి. దీని కాల పరిమితి రకాన్ని బట్టి 5 నుండి 10 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఈ గర్భనిరోధక పద్ధతిని ఆశ్రయించిన మహిళ, గర్భం ధరించాలని నిర్ణయించుకున్నప్పుడు ఎప్పుడైనా సరే దీనిని సులభంగా తొలగించుకోవచ్చు.

**క్వైడీ గర్భిణీ అని తెలిసింది:** ఒక సాధారణ పరీక్షల సమయంలో క్వైడీ గర్భవతి అని తేలింది. అయితే, ఆ పరిస్థితులలో గర్భనిరోధక కాయిల్‌ను తొలగించడం వల్ల గర్భధారణ ప్రమాదంలో పడుతుందని, అబార్షన్‌కు దారి తీయవచ్చని వైద్యులు సూచిడంతో ఆమె దానిని అలాగే తన గర్భాశయం లోపల ఉంచుకునేందుకు నిర్ణయించుకుంది. దీని కారణంగా ఆమెకు రక్తస్రావం మరియు పరికరం పాక్షికంగా వేరుపడటం వంటి సమస్యలు ఎదురయ్యాయి. కానీ చివరికి, గర్భనిరోధక కాయిల్ సహా మగశిశువు మాథ్యూస్ ప్రసవం సురక్షితంగా జరిగిపోయింది.

**విజయ ట్రోఫీతో నవజాతశిశువు:** క్వైడీ ప్రసవం తరువాత, కాన్పు జరిపిన డాక్టర్ నటాలియా రోడ్రిగ్స్ గర్భనిరోధక ఐయుడిని గమనించారు, దానిని నవజాత శిశువు మాథ్యూస్ చేతిలో ఉంచారు. ప్రసూతి గదిలో డాక్టర్ తీసిన ఫోటోలో మాథ్యూస్ గర్భనిరోధక సాధనాన్ని తన చేతులలో ఒక ట్రోఫీలా పట్టుకున్నట్లు కనిపిస్తుంది. "నా ఉనికిని అడ్డుకోజాలని ఐయుడి నా విజయ ట్రోఫీతో నేను!" అన్న శీర్షికతో డాక్టర్ రోడ్రిగ్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఏమయితేనేం, తల్లి మరియు బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా మరియు సురక్షితంగా ఉన్నారని నివేదించబడడంతో శుభం కార్డు పడినట్లయ్యింది.

**- యేచన్ చంద్ర శేఖర్**

**చెలి చిట్కా**

✦మధుమేహవ్యాధి వున్నవారు జామ ఆకులను నానవేసిన నీటిని త్రాగిన మధుమేహ వ్యాధి నివారణ అగును. ✦ హాట్‌బాక్స్‌లో ఏ పదార్థాలు పోసినా నిండుగా వేయాలి. □

# మృదువైన అధరాలకు ..



ఆరోగ్యంగా ఉండాలంటే తీపికి.. అందులోనూ ప్రత్యేకంగా పంచదారకు దూరంగా ఉండొచ్చు. కానీ ఆరోగ్యానికి చెరుపు పంచదార సౌందర్య పరిరక్షణలో మాత్రం పాత్ర పోషిస్తున్న నిపుణులు.. మరి అది ఎలాగో చూద్దాం.

**లేలేత అధరాలకు..** సాధారణంగానే పెదవుల మీద కొద్దిగా చక్కెర రాస్తే మృతకణాలు తొలగిపోయి మృదువుగా ఉంటాయి. మారతాయి. కొద్దిగా చక్కెర తీసుకుని పాలు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో రోజూ రాత్రి పూట పడుకొనే ముందు పెదవులకు మెల్లగా మర్దన చేసి అధరాలు మృదువుగా ఉంటాయంటున్నారు నిపుణులు.

**చర్మం పొడిబారితే..!** చర్మం పొడిబారి నిర్జీవంగా మారినప్పుడు చక్కెరను ఉపయోగించి తిరిగి దాన్ని సాధారం తీసుకురావచ్చట. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో మీకు నచ్చిన ఎసెన్షియ కొన్ని చుక్కలు వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని కాసేపు మరి మర్దన చేసుకోవాలి. తర్వాత చల్లని నీటితో ముఖం శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడు చర్మం మళ్లీ కొత్త కళను సంతరించు కుంటుందంటున్నారు నిపుణులు. □

# ఈ వాసనకు పరారవుతాయి !



సాధారణంగా ప్రతి ఇంట దోమల బెడద ఉండేదే. అలాగని వాటిని అలానే వదిలేస్తే అనారోగ్యాల ముప్పు తప్పదు. రసాయనాలతో కూడిన రిపెల్లెంట్లు, కైల్స్ వాడితే మరెన్నో ఇబ్బందులు. బదులుగా ఈ సహజ అభ్యాసాన్ని ఉపయోగించి తరిమేయండి. మొక్కలు పెంచండి... ఇంటి చుట్టూ మొక్కల్ని పెంచితే దోమలు ఎక్కువగా వచ్చేవని కొందరు భయపడతారు. కానీ తులసి, లావెండర్, నిమ్మగడ్డి, లెమన్గ్రైమ్, అజిరేటమ్, క్యాట్నిప్, బంతి వంటి మొక్కల్ని నాటితే... వాటిని తరిమేయొచ్చు. ముఖ్యంగా నిమ్మగడ్డిలోని సిట్రొనెల్లాల్ అనే రసాయనం దోమల సంతతి పెరగకుండా అడ్డుకుంటుంది. బంతిపూల వాసన... ఈగలు, దోమల్ని రానీయదు. తులసి నుంచి విడుదలయ్యే ఒలియో రెజిన్స్కి క్రిమికిట కాలను నియంత్రించే శక్తి ఉంటుందట. ఘాటు నూనెలతో... వేపనూనె, లవంగ నూనెల్లో ఏదైనా ఒకటి కొద్దిగా నీళ్లలో కలిపి కిటికీలు, తలుపు డోర్ల దగ్గర స్ప్రే చేయండి. అలానే రసం తీసిన నిమ్మ చెక్కలో ఆవనూనెతో దీపం పెట్టినా మీ సమస్య దూరమవుతుంది. కర్టెన్లు, దీపాలు... కాంతిమంతమైన దీపాలకి బదులు కాస్త డిమ్ ఉండేవి నిద్రపోయే ముందు వేస్తే దోమల్ని అడ్డుకోవచ్చు. అలానే కర్టెన్లను శుభ్రం చేయాలి. దోమ తెరలు వేసుకోవడమూ తప్పనిసరి. □

# అమ్మాయిలూ పోటీపడండి..



**ఆడపిల్లకు జీవితంలో అడుగడుగునా సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయి. వాటిని దాటాలంటే ఏ పనైనా చేయగల సామర్థ్యం పెంచుకోవాలి. శారీరకంగా, మానసికంగా స్థైర్యంగా ఉండాలి. అప్పుడే జీవితంలో ముందుకు వెళ్లగలుగుతారు.**

**'చదువుకుంటున్నా కదా!** నాకే పని చెప్పకు అమ్మ' అనే అమ్మాయిలు చాలామందే. 'చిన్నపిల్లవి... నీకెందుకు కష్టం. నేను చేసి పెడతానులే' అని గారాబం చేసే తల్లులు, సంపాదన, ఆస్తులు మాకేంటిలే అనుకునే మహిళలూ... అందరూ జీవన నైపుణ్యాలు నేర్చుకోవడం తప్పనిసరి. ఎవరి కోసమో కాదు... మీకోసం మీరు అలవరచుకోండి. ఒకవేళ గతంలో మీకేవైనా అభిరుచులు ఉండి ఉంటే.. వాటికోసం ఇప్పుడు ప్రయత్నించండి. ఇవి మీకు ఆత్మసంతృప్తిని ఇవ్వడమే కాదు... ఆపత్కాలంలో అండగానూ ఉంటాయి.

**ధైర్యం, ఆత్మవిశ్వాసం, చొరవ...** ఇవి ఎవరూ తెచ్చివ్వరు. వాటిని మనమే ఆభర మార్చుకోవాలి. ప్రత్యేక అప్డేట్ అవ్వాలి. నలుగురూ ఏమను అన్న విషయం పక్కన పెట్టి మీకెంత స్పష్టత ఉందో ఆలోచించుకోవాలి. అప్పుడే వేయగలరు. ఆత్మన్యూనతను దాటి మార్పుని అంగీకరించగలుగుతారు. మీకోసం నిలబడగలుగుతారు. ఇది వ్యక్తిగత జీవితానికే కాదు. కెరియర్‌కి ఉపయోగపడుతుంది. జీవన ప్రయాణంలో ప్రతి ఒక్కరికీ సవాళ్లు ఎదురవు తూనే ఉంటాయి. వాటిని చూసి ధైర్యం కోల్పోవద్దు. అలాగని ప్రతిసారీ ఎవరో ఒకరు మీకు తోడుగా ఉండి వాటిని పరిష్కరిస్తారనీ అనుకోవద్దు. దాన్ని సాల్వ్ చేయడానికి ఉన్న మార్గాల్ని ఆలోచించండి. ఆ తర్వాత మీ వాస్తవిక సామర్థ్యాన్ని అంచనా వేసుకోండి. మీ బలహీనతల్ని అర్థం చేసుకోండి. అప్పుడే ఎలా ముందుకు వెళ్లాలోన తెలుస్తుంది. ఈ క్రమంలో పొరపాట్లు జరిగినా మరోసారి సమీక్షించుకుని ముందడుగు వేస్తే కచ్చితంగా విజజయం మీదే. □

తెర

# ప్రొడక్షన్ నెంబరు 7 లాంచ్



మాయ, మానగరం, మాన్స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్ వంటి వరుసగా ఆరు విజయవంతమైన చిత్రాల తర్వాత పొటెన్షియల్ స్టూడియోస్ తమ ప్రొడక్షన్ నెంబర్ 7ను గ్రాండ్‌గా లాంచ్ చేసింది. ఈ చిత్రంలో జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందిన లోక స్టార్ కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో నాన్ మహాన్ అల్లా ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్, కీలక పాత్రలు పోషించనున్నారు. నూతన దర్శకుడు ధీరవియం SN దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ లో ప్రవీణ్ భాస్కర్ శ్రీ కుమార్ దర్శకుడితో పాటు స్క్రీన్‌ప్లే సంభాషణలు రాశారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చారు గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రఫీ అందించారు. అరల్ ఆర్. తంగం ఎడిటర్‌గా, మాయాపాండి ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఇనాజ్ ఫర్హాన్ మరియు షేర్ అలీ కాస్ట్యూమ్స్ అందిస్తున్నారు.

# 'రాజు వెడ్స్ రాంబాయి'ప్రతి సీన్ కొత్తగా



అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా "రాజు వెడ్స్ రాంబాయి". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. "రాజు వెడ్స్ రాంబాయి" చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న "రాజు వెడ్స్ రాంబాయి" సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నారు. బుధవారం సాయంత్రం ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం అతిథిగా హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోహీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ మేము షార్ట్ ఫిలింస్ చేసేప్పుడు కొత్త వాళ్లకు ఏదైనా సపోర్ట్ దొరికితే బాగుండేది అనిపించేది. ఇప్పుడా సపోర్ట్ ఈటీవీ వారి రూపంలో యంగ్ టాలెంట్ కు దక్కుతోంది. వంశీ నందిపాటి గారితో క మూవీ చేశాను. ఆయన చెబితే ఆ మూవీలో స్ట్రాంగ్ కంటెంట్ ఉన్నట్లే. హీరో అఖిల్ బాగా నటించాడు, తేజస్వినీ మన పొరుగు అమ్మాయి అనేంత సహజంగా ఉంది. . మీరంతా సినిమా చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

# లవ్ సాంగ్ ఒడియమ్మ



మ్యూజిక్ డైరెక్టర్ జీవి ప్రకాష్ లాంచ్ చేసిన సుడిగాలి సుధీర్, దివ్యభారతి, మొగుళ్ళ చంద్రశేఖర్, జైశ్నవ్ ప్రొడక్షన్, మాహాతేజ క్రియేషన్స్ జి.ఓ.ఎ.టి. నుంచి బ్యూటీఫుల్ లవ్ సాంగ్ ఒడియమ్మ జైశ్నవ్ ప్రొడక్షన్ , మాహాతేజ క్రియేషన్స్ లో అద్భుతం, టేనంట్ వంటి అద్భుతమైన చిత్రాలని నిర్మించిన మొగుళ్ళ చంద్రశేఖర్ గారి నిర్మాణంలో... క్రికెట్ నేపథ్యం లోనే కామెడీ ప్రధాన అంశంగా సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా మూవీ బి.వీ.తి.గి . ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకి చేరుకుంది. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.

# నెల 21 న 'కలివి వనం'




'కలివి వనం' సినిమా చూసిన వారందరూ ఒక కొత్త అనుభూతికి లోనవుతారు.. సీనియర్ నటుడు రఘు బాబువీకెండ్స్ రాగానే ప్రకృతిని ఆస్వాదించడం కోసం మనం ఫారెస్ట్ కి గాని, రిసార్ట్ కి గాని వెళ్తున్నాం.కానీ..మీరు ఈ వీకెండ్ లో మా "కలివి వనం" సినిమాకి వస్తే.. ఒక ఫారెస్ట్ ఎన్విరాన్మెంట్లో మీరు ఎటువంటి అనుభూతి పొందుతారో మా సినిమా చూస్తే అదే అనుభూతిని మీరు కచ్చితంగా పొందుతారు.వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షించుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో చిత్రీకరించిన అరుదైన సినిమా కలివి వనం. ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి ౣ, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. హీరో యిన్ గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు నిర్మించారు.అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ నెల21న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది ఈ కార్యక్రమంలో నటులు రఘుబాబు , బిత్తిరి సత్తి గారు, సమెట గాంధీ గారు, హీరోయిన్ నాగదుర్గ, అమృతం సీరియల్ డైరెక్టర్ హరిచరణ్ తదితరు ప్రముఖులు పాల్గొన్నారు.

# చిరంజీవి కెరీర్‌లో 'కొదమసింహం' స్పెషల్



కొదమసింహం" సినిమా నాకు, రామ్ చరణ్ కు ఫేవరేట్ మూవీ, ప్రేక్షకులు ఈ సినిమా రీ రిలీజ్ ను తప్పకుండా థియేటర్స్ లో ఎంజాయ్ చేస్తారు మెగాస్టార్ చిరంజీవి.. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో సక్సెస్, జానర్ పరంగా చూస్తే ఒక ప్రత్యేకమైనదిగా "కొదమసింహం" సినిమాను చెప్పుకోవచ్చు. చిరంజీవి నటించిన ఒకే ఒక కౌబాయ్ సినిమా ఇది. 1990, ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించిన "కొదమసింహం" సినిమాను ఈ నెల 21వ తేదీన 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్ తో సరికొత్తగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వర రావు రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ప్రెస్ ప్రీమియర్ షో, ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో స్పెషల్ వీడియో ద్వారా మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ కొదమసింహం సినిమాలో నా స్టిల్ చాలా పాపులర్. నాకు ఫేవరేట్ ఫొటో అది. నాకు నచ్చిందని ప్రొడ్యూసర్స్ ఆ స్టిల్ ను ఫ్రేమ్ చేసి గిఫ్ట్‌గా ఇచ్చారు. మా ఇంట్లో ఇప్పటికీ ఈ ఫొటో ఉంది. నాకు కౌబాయ్ మూవీస్ అంటే ఇష్టం.

# రిలీజ్ కు రెడీ అవుతున్న 'అన్నగారు వస్తారు'



డిసెంబర్ లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న స్టార్ హీరో కార్తి, స్టూడియో గ్రీన్ కాంబో క్రేజీ మూవీ "అన్నగారు వస్తారు"..

స్టార్ హీరో కార్తి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ "వా వాతియార్" తెలుగు ప్రేక్షకుల ముందుకు "అన్నగారు వస్తారు" టైటిల్ తో రాబోతోంది. ఈ సినిమాను డిసెంబర్ లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. "అన్నగారు వస్తారు" చిత్రాన్ని ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ స్టూడియో గ్రీన్ బ్యానర్ లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా హీరో కార్తి నటిస్తున్న "అన్నగారు వస్తారు" సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా టీజర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. కార్తి కెరీర్ లో "అన్నగారు వస్తారు" మరో బ్లాక్ బస్టర్ మూవీ అవుతుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.

## ఎఎఫ్‌సి ఉమెన్స్ ఛాంపియన్స్ లీగ్‌లో..

# తూర్పు బెంగాల్ 0-2 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి ఉమెన్స్ ఛాంపియన్స్ లీగ్‌లో తూర్పు బెంగాల్ 0-2 తేడాతో వుహాన్ జియాంగ్డా చేతిలో ఓడిపోయింది. గురువారం చైనాలోని వుహాన్‌లో జరిగిన ఛాంపియన్స్ లీగ్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో వుహాన్ జియాంగ్డా తూర్పు బెంగాల్‌ను ఓడించింది. భారత ఛాంపియన్ తూర్పు బెంగాల్‌తో జరిగిన మ్యాచ్ లో, షువాంగ్ ఓపెన్ ప్లే, స్పాట్ నుండి ఒక్కొక్క గోల్‌తో తన క్లాస్‌ను ప్రదర్శించింది. ఛాంపియన్స్ లీగ్ విజేత మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడి ఎనిమిది నిమిషాల్లోనే పురోగతి సాధించింది. భారత ఛాంపియన్ తూర్పు బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో, షువాంగ్ ఓపెన్ ప్లే మరియు స్పాట్ నుండి ఒక్కొక్క గోల్‌తో తన క్లాస్‌ను ప్రదర్శించింది. మహిళల ఫుట్‌బాల్ హెవీ వెయిట్‌తో తలపడే ఈస్ట్ బెంగాల్ జట్టు రక్షణాత్మక లోపంతో భారీ మూల్యం చెల్లించింది. షువాంగ్‌పై పాంథోయ్ ఆలస్యం చేయడంతో ఫార్వర్డ్ విఫలమైంది. ఆసియా క్రీడలరజతపతక విజేత, నాలుగుసార్లు చైనా మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఆఫ్‌ది ఇయర్‌గా నిలిచిన షువాంగ్ తన అనుభవాన్నంతా ఉపయోగించి, పాంథోయ్‌ను పక్కదారి పట్టించిఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. ఈ విజయంతో వుహాన్ జియాంగ్డా రెండు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లతో గ్రూప్ దశలో అగ్రస్థానానికి చేరుకోగా, తూర్పు బెంగాల్ 2రౌండ్ల తర్వాత మూడు పాయింట్లతో 2వ స్థానంలో ఉంది. మోషల్ గర్ల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవాలంటే ఈ 23న నసాఫ్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌లో కనీసం డ్రా చేసుకోవాలి.



# ముక్కోణపు వన్డేలో భారత్ ఓటమి

## అఫ్ఘానిస్థాన్ చేతిలో 97 రన్స్‌కే ఆలౌట్

**న్యూఢిల్లీ:** భారత్ అండర్-19 ముక్కోణపు వన్డే టోర్నీలో భారత్ రెండో ఓటమి చవిచూసింది. బెంగుళూరు వేదికగా గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 71 పరుగుల తేడాతో ఆఫ్గనిస్తాన్ చిత్తు చేసింది. కేవలం 169 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ జట్టు చతికిలపడింది. ఆఫ్గన్ బౌలర్ల ధాటికి భారత్ 29.3 ఓవర్లలో కేవలం 97 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ యువరాజ్ ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. యువరాజ్ 80 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 60





పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి మిగిలిన వారి సపోర్ట్ లభించ లేదు. ఆఫ్గన్ పేసర్ అబ్దుల్ అజీజ్ 6 వికెట్లతో టీమిండియా పతనాన్ని శాసించాడు. తన 10 ఓవర్ల కోటాలో కేవలం 38 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడితో పాటు, సలీం ఖాన్, జద్రాన్ తలా రెండు వికెట్లు సాధించారు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్గన్ యువ జట్టు ఇండియా బౌలర్లు చెలరేగడంతో 45.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌట్ అయింది. ఆఫ్గన్‌బ్యాటర్లలో షినోజాడా (58) టాప్ స్కోరర్‌గా నిలవగా, అజీజుల్లా మియాఖిల్ (42) ఫర్వాలేదనిపించాడు. మిగిలిన బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు.

# వన్డేల్లో నం.1 డారిల్ మిచెల్

## రోహిత్‌శర్మకు భారీ షాక్







బౌలర్లలో నంబర్ వన్‌గా బుమ్రా

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మకు షాక్ తగిలింది. నెలరోజుల వ్యవధిలోనే అతడు ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. పురుషుల తాజా ర్యాంకింగ్స్ లో రోహిత్ శర్మ స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్ అగ్రస్థానంలో నిలిచాడు, భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. సిరీస్ ఓపెనర్‌లో వెస్టిండీస్‌పై మ్యాచ్ విన్నింగ్ సెంచరీ తర్వాత గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలగే ముందు, మిచెల్ 118 బంతుల్లో 119 పరుగులు చేశాడు. ఇది అతనికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సంపాదించిపెట్టింది. ఈ విజయంతో అతను ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రహీం జద్రాన్, రోహిత్‌లను ఒకే రేటింగ్ పాయింట్ తేడాతో అధిగమించాడు. ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో 83 ఇన్నింగ్స్‌ల తరువాత శతకాల కరువు ముగించిన పాకిస్తాన్ స్టార్ ఆటగాడు బాబర్ ఆజామ్ ఆరో స్థానానికి చేరుకున్నాడు. టీమ్‌ఇండియా స్టార్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీలు వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలింగ్ పరంగా ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్లు సహా ఆరు వికెట్లు పడగొట్టిన బుమ్రా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నం.1 బౌలర్‌గా తన స్థానాన్ని నిలుపుకున్నాడు. అతని సహచరులు కుల్దీప్ యాదవ్ మరియు రవీంద్ర జడేజా కూడా లాభాలను ఆర్జించారు, మాజీ బౌలర్లు కుల్దీప్ యాదవ్ 2స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమంగా 13వ స్థానానికి చేరుకున్నారు మరియు రెండోవాడు నాలుగు స్థానాలు ఎగబాకి 15వ స్థానానికి చేరుకున్నాడు.

# పరువు కోసం బిగ్ ఫైట్

## మార్పులతో టీమిండియా.. సౌతాఫ్రికా సిరీస్ సమం లక్ష్యం

**న్యూఢిల్లీ:** భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమి తర్వాత, టీమిండియా ఇప్పుడు 0-1తో వెనుకబడి ఉంది. సిరీస్‌ను సమం చేయాలంటే ఈ నెల 22 నుంచి గువహాతిలో జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో భారత్ కచ్చితంగా గెలవాలి. అయితే ఈ కీలకమైన మ్యాచ్‌కు ముందు భారత జట్టులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆడకపోవచ్చనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గిల్‌కు మెడ గాయం





కారణంగా రెండో టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం గిల్ జట్టుతో కలిసి గువహతికి ప్రయాణించినా అతని ఆరోగ్య పరిస్థితిని బట్టి తుది నిర్ణయం తీసుకుంటారు. గిల్ ఒకవేళ అందుబాటులో లేకపోతే వికెట్ కీపర్‌బ్యాట్స్‌మెన్ రిషభ్ పంత్ జట్టుకు నాయకత్వం వహించే అవకాశం ఉంది. గిల్ స్థానంలో ఆడించేందుకు ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని తిరిగి టీమిండియాలోకి తీసుకున్నారు. మొదట్లో ఇండియాఎ తరఫున ఆడేందుకు రిలీజ్ అయిన నితీష్, గిల్ రిప్లేస్‌మెంట్‌గా జట్టుతో తిరిగి చేరాడు. మరోవైపు చైనామెన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా రెండో టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. మీడియా రిపోర్ట్స్ ప్రకారం.. నవంబర్ నెలాఖరులో కుల్దీప్‌కు పెళ్లి ఉండటం వలన అతను బీసీసీఐకి సెలవు కోసం అభ్యర్థన పంపినట్లు తెలుస్తోంది. కుల్దీప్ లేకపోతే భారత జట్టు స్పిన్ విభాగంపై మరింత భారం పడుతుంది. ప్రస్తుత పరిస్థితులు, జట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సౌతాఫ్రికాతో జరిగే రెండో టెస్ట్‌కు భారత జట్టు సంభావ్య ప్లేయింగ్ ఎలెవన్ ఈ విధంగా ఉండే అవకాశం ఉంది. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ ఆడగా, మిడిల్ ఆర్డర్‌లో సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్ (కెప్టెన్ వికెట్ కీపర్) ఉంటారు. ఆల్‌రౌండర్లుగా నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ ఉండగా, పేస్ బౌలర్లుగా మహమ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌కు నాయకత్వం వహిస్తారు. ఈ బలంగా ఉన్న ప్లేయింగ్ ఎలెవన్ ద్వారా భారత జట్టు సిరీస్‌ను 11తో సమం చేయాలని గట్టి ప్రయత్నం చేయనుంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు ఆయుష్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత షట్లర్ ఆయుష్ శెట్టి ఆ16లో కోడై నరోకాను ఓడించాడు. ఇదే సమయంలో సాత్విక్-చిరాగ్ జోడీ కూడా వరుస గేమ్‌ల విజయంతో పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. గురువారం సిడ్నీలో జరిగిన ఈ టోర్నీలో నాల్గవ సీడ్ కోడై నరోకాను ఓడించి ఆయుష్ క్వార్టర్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించుకున్నాడు. 20 ఏళ్ల అతను ప్రపంచ 9వ ర్యాంక్ జపనీస్ షట్లర్‌పై 21-17, 21-16 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. వరల్డ్ టూర్‌లో ఈ సంవత్సరంలో అతడు 6వ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. గత వారం జరిగిన కుమామోటో మాస్టర్స్‌లో కోడై చేతిలో ఓటమికి ఈసారి ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. అలాగే క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సాత్విక్-చిరాగ్ జోడీ పురుషుల డబుల్స్‌లో అగ్రశ్రేణి భారత జంట సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి కూడా వరుసగా రెండో గేమ్ విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. 31 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వారు 21-18, 21-11 తేడాతో చైనీస్ తైపీకి చెందిన చింగ్ హెంగ్ సు-గువాన్ సన్ వు జంటపై విజయం సాధించారు. తొలి ఆట ప్రారంభంలో భారత ద్వయం చాలా ఇబ్బందుల్లో పడి 915తో 6 పాయింట్ల వెనుకబడి ఉంది. కానీ తదుపరి పుంజుకుని ఐదు పాయింట్లు గెలుపొంది ఆటను ముగించారు. రెండవ గేమ్‌లో ఆట వేగాన్ని పెంచి ఆధిక్యంతో మ్యాచ్‌ను గెలిచారు.



వాణిజ్యం

# రూ.46.32 లక్షలకోట్లకు పెరిగిన భారత్ టాప్‌బ్రాండ్స్!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారతదేశంలోని టాప్100 బ్రాండ్ల సత్తా మరోసారి నిరూపితమైంది. ఈ ఏడాది వాటి మొత్తం విలువ 52,350 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ.46.32 లక్షల కోట్లకు చేరినట్లు లండన్‌కు చెందిన ప్రముఖ మార్కెట్ రీసెర్చ్ సంస్థ కాంటార్ వెల్లడించింది. ఈ మొత్తం విలువ భారత జిడిపిలో దాదాపు 13 శాతానికి సమానమని 'కాంటార్ బ్రాండ్స్ రిపోర్ట్ 2025'లో పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఈ బ్రాండ్ల మొత్తం విలువ 6 శాతం పెరిగింది. నివేదిక ప్రకారం ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి దేశంలోనే అత్యంత విలువైన బ్రాండ్‌గా అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్యాంక్ బ్రాండ్ విలువ 18 శాతం వృద్ధితో దాదాపు 4,500 కోట్ల డాలర్లకు అంటే రూ.3.98 లక్షల కోట్లకు చేరుకుంది. 2014లో ఈ రిపోర్టు ప్రారంభమైనప్పటి నుంచి చూస్తే హెచ్‌డీఎఫ్‌సీ బ్రాండ్ విలువ నాలుగింతలకు పైగా పెరగడం గమనార్హం. ఈ జాబితాలో దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) 4,420 కోట్ల డాలర్లు మన కరెన్సీలో రూ.3.91 లక్షల కోట్ల విలువతో రెండో స్థానంలో నిలిచింది. టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ 4,110 కోట్ల డాలర్లు అంటే రూ.3.64 లక్షల కోట్ల విలువతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఐదో స్థానంలో, ఐసిఐసిఐ బ్యాంక్ ఆరో స్థానంలో ఉన్నాయి. బ్రాండ్ విలువ పరంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో వరుసగా రెండో ఏడాదికూడా అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది కాలంలో జొమాటో బ్రాండ్ విలువ ఏకంగా 69 శాతం పెరిగింది. ఈసారి జాబితాలో అల్ట్రాటెక్ సిమెంట్, హ్యుండయ్‌తో సహా 18 కొత్త కంపెనీలకు చోటు దక్కింది. 111 విభాగాలకు చెందిన 1,620 బ్రాండ్లపై 1.45 లక్షల మంది అభిప్రాయాల ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లను రూపొందించినట్లు కాంటార్ తెలిపింది.




# 'డార్క్ ప్యాటర్న్స్‌లో లేం'

## 26 ఇకామర్స్ సంస్థల వెల్లడి

**న్యూఢిల్లీ, నవంబరు 20:** దేశంలోని 26 ఇకామర్స్ కంపెనీలు తమ ప్లాట్‌ఫామ్స్‌లో డార్క్ ప్యాటర్న్స్ లేవని స్వయంగా ప్రకటించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జొమాటో, జెప్టో, స్విగ్గీ, బిగ్ బాస్కెట్, జియో మార్ట్ వంటి ఇకామర్స్ ప్లాట్ ఫామ్స్ ఇందులో ఉన్నట్లు తెలిపింది. డిజిటల్ మార్కెట్ యూజర్ల హక్కుల పరిరక్షణలో ఇదొక ముందడుగు అని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ పేర్కొంది. డార్క్ ప్యాటర్న్స్ ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్ మార్గదర్శకాలు 2023కు అనుగుణంగానే తమ ప్లాట్ ఫామ్స్ ఉన్నాయని ఆయా కంపెనీలు స్వీయంగా ప్రకటనలు సమర్పించినట్లు తెలిపింది. వినియోగదారులను తప్పుదారి పట్టించే, మోసపూరిత ఆన్‌లైన్ డిజైన్ పద్ధతులను అరికట్టేలా కేంద్రం చర్యలు చేపట్టింది. దీంతో సంబంధితకంపెనీలు అంతర్గతంగా లేదా థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించి డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి తొలగించినట్లు కేంద్రం పేర్కొంది. డార్క్ ప్యాటర్న్స్ ఏవీ తమ ప్లాట్ ఫారాల్లో లేవని ఈ 26 కంపెనీలు ప్రకటించినట్లు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ సిసిపిఎ పేర్కొంది. ఫాల్స్ అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, సబ్ స్క్రిప్షన్ ట్రాప్, ఫోర్స్డ్ యాక్షన్, ఇంటర్ ఫేస్ ఇంటర్ ఫియ రెన్స్, బైట్ అంట్ స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్‌గైజ్డ్ అడ్వర్టైజ్మెంట్స్, ట్రిక్ వర్డింగ్, నాగింగ్, సాస్ బిల్లింగ్, రోగ్ మాల్వేర్స్ వంటివి డార్క్ ప్యాటర్న్స్ కిందకు వస్తాయని తెలిపింది. ఫార్మ్ ఈజీ, జెప్టో మార్కెట్ ప్లేస్, మింత్రా, ఫ్లిప్ కార్ట్, వాల్ మార్ట్ ఇండియా, బిగ్ బాస్కెట్, మేక్ మై ట్రిప్, జియో మార్ట్, స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, పేజ్ ఇండస్ట్రీస్, విలియమ్ పెన్, రిలయన్స్ జ్యువెల్స్, క్లియర్ ట్రిప్, రిల యన్స్ డిజిటల్, టాటా 1ఎంజీ, మీషో, ఇక్సిగో, నెట్ మెడ్స్, హామ్ లెన్స్, అజియో, డ్యూరో ఫ్లెక్స్, టిరా బ్యూటీ, కూరాడెన్ వంటి సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా ప్లాట్ ఫామ్స్ సొంత ఆడిట్లు పూర్తి చేసి డార్క్ ప్యాటర్న్స్ తొలగించిట్లు ప్రకటనలు చేశాయని కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది.





# రూ.9వేల కోట్ల అనిల్ అంబాని ఆస్తులు జప్తుచేసిన ఇడి

**ముంబయి, నవంబరు 20:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌నకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరో గట్టి షాక్ ఇచ్చింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, తాజాగా రూ.1400కోట్ల విలువైన ఆస్తులను ప్రొవిజనల్‌గాజప్తుచేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.9000కోట్లకు చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తాజాగా జప్తు చేసిన ఆస్తులు నవీ ముంబై,చెన్నై,పూణె, భువనేశ్వర్‌లలో ఉన్నట్లు సమాచారం. అనిల్ అంబానీ నేతృత్వంలోని కంపెనీలలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఇడి కొంతకాలంగా విచారణ జరుపుతోంది. ఈ దర్యాప్తులో భాగంగానే తాజా చర్యలు తీసుకున్నారు. ఇదే కేసులో గతంలో ఇడి సుమారు రూ.7500 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, నవంబరు 20:** సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు గురువారం లాభాల్లోనే ముగిసాయి. వరుసలాభాల అనంతరం నష్టాల్లోనుంచి కోలుకున్న సూచీలు రెండోసారి కూడా లాభాల్లోనే నడిచాయి. గ్లోబల్ సెంటిమెంట్ మెరుగు పడటం, ఎన్విడియా పటిష్టమైన ఫలితాలు సాధించడం వంటివి కొంత తోడయ్యాయి. విదేశీ పెట్టుబడులు కూడా దేశీయ మార్కెట్లలోకి పెరిగాయి. సెన్సెక్స్ డెరివేటివ్స్ కాలపరిమితి ముగింపు కూడా కీలకం అయింది. సెన్సెక్స్ నిఫ్టీలు రెండూ కూడా 52 వారాల గరిష్టాన్ని తాకాయి. నిఫ్టీ 26,150 ఎగువనముగిసింది. ఆర్థికసేవలు, ఇంధనం, ఆటో స్టాక్స్ మద్దతిచ్చాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 446.21 పాయింట్లు లాభపడి 85,632.68 పాయింట్లవద్ద నిలిచింది. నిఫ్టీ 50 కూడా 139.50 పాయింట్లుపెరిగి 26,192,15 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. ఇంట్రాడేలో రెండుసూచీలు కూడా 52 వారాల గరిష్టాన్ని బ్రేక్‌చేసాయి. గడచిన రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 1.08శాతం లాభపడ్డాయి. బజాజ్‌ఫైనాన్స్ 2.28శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.01శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.42శాతం నిఫ్టీకి మద్దతుగా నిలిచాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.13శాతం ర్యాలీ తీస్తే స్మాల్‌కాప్ సూచీ 0.17శాతం క్షీణించింది. బిఎస్‌ఇలో 1872 స్టాక్స్ పెరిగాయి. 2304 షేర్లు క్షీణించగా 186 కంపెనీలు స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండు 0.17శాతంపెరిగి 6.543కి చేరింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.71వద్ద తచ్చాడింది. అంతకుముందు రోజు 88.48 వద్దముగిస్తే తాజాగా 88.71వద్దకు చేరింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు 5నాటికి 0.28శాతం క్షీణించి 1,22,710రూపాయలుగా నమోదయ్యాయి. ఇక కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు జనవరి సెటిల్‌మెంట్‌చేసింది 49 సెంట్లు లాభపడి బ్యారెల్‌కు 64 డాలర్లుగా కొనసాగింది. బయోకాన్ సంస్థ నేటి మార్కెట్‌లో 3.50శాతం క్షీణించి 395.50వద్ద నడిచింది. లోకేష్ మెషిన్స్ కూడా 4.89శాతం క్షీణించింది. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ 3.40శాతం లాభపడితే ట్రాన్స్ రైల్‌లైటింగ్ కూడా 2.26శాతం లాభపడింది. ఈప్యాక్ ప్రిఫబ్ టెక్నాలజీస్ 4.85శాతంపెరిగింది. మహీంద్ర హాలిడేస్ అండ్ రిసార్ట్సు కూడా 3.26శాతం పెరిగింది. అలాగే గ్లోబస్ స్పిరిట్స్ 2.22శాతం క్షీణించింది. మాన్ ఇండస్ట్రీస్ 4.04శాతం, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్‌కంపెనీ 1.56శాతం చొప్పున పెరిగాయి. ఇక ఐపిఒలపరంగా ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ 6.72 రెట్లు ఎక్కువ కొనుగోళ్ల బిడ్లు వచ్చాయి. 19 నవంబరున ప్రారంభించిన 21వ తేదీ ముగిసింది. ఐపిఒ ఇష్యూధర రూ.11 నుంచి రూ.120 చొప్పున ప్రకటించింది.



# మందగమనంలో కీలకరంగాల ఉత్పాదకత!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారత్‌లోని కీలకరంగాల ఉత్పత్తి స్థిరంగా కొనసాగింది. అక్టోబరులో ఎనిమిది కీలక పరిశ్రమల ఉత్పత్తి 162.4 పాయింట్లవద్దనే నిలిచింది. గత ఏడాది అక్టోబరుతో పోలిస్తే యథాతథస్థితిని నమోదు చేసింది. ఎరువులు, ఉక్కు, సిమెంట్, పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు అక్టోబరులో సానుకూల వృద్ధిని నమోదుచేసాయి. ఎనిమిది కీలక రంగాలు కూడా భారత పారిశ్రామిక ఉత్పత్తికి 40శాతం వాటా అందిస్తున్నాయి. సెప్టెంబరులో 3.3శాతం వృద్ధినమోదుచేసినా అక్టోబరులో నిలకడగా కొనసాగింది. ఏప్రిల్‌నుంచి అక్టోబరు వరకూ సమిష్టివృద్ధి 2.5శాతంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. బొగ్గు ఉత్పత్తి 8.5శాతం క్షీణించింది. ముడిచమురు ఉత్పత్తికూడా 1.2 శాతం తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే క్షీణత నమోదుచేసింది. సమిష్టిగా ఏప్రిల్ అక్టోబరు వరకూకూడా 1.1శాతం క్షీణించింది. ఇక సహజ వాయు ఉత్పత్తికూడా 5శాతంక్షీణించింది. పెట్రోలియం శుద్ధి ఉత్పత్తులు మాత్రం 4.6 శాతం పెరిగింది. ఇక ఎరువులు ఉత్పత్తి పరంగా 7.4 శాతం పెరిగింది. ఉక్కు ఉత్పత్తిలో కూడా 6.7శాతం వృద్ధిని నమోదుచేసింది. ఏడునెలల కాలంలో సమిష్టిగా 10.3శాతంవృద్ధిని నమోదు చేసింది. ఇక సిమెంట్ ఉత్పత్తిపరంగా చూస్తే 5.3శాతంగా ఉంది. ఏడునెలల కాలానికికూడా 7.3శాతం వృద్ధిని నమోదుచేసినట్లు ప్రభుత్వ గణాంకాలు చెపుతున్నాయి.

# ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్లకు భారత్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిరంగం!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** భారత్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిరంగం 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేరుకోగలదని ప్రైస్‌వాటర్‌కూపర్స్ అంచనావేసింది. ప్రస్తుతం ఉన్న 282 బిలియన్ డాలర్ల టర్నోవర్‌కు మంచి వృద్ధి అవకాశాలున్నాయని అంచనావేసింది. ప్రపంచస్థాయిలో సరఫరా చెయిన్స్, దేశీయంగా కూడా పటిష్టమైన డిమాండ్, పాలసీ ఆధారిత ప్రోత్సాహకాలు వంటివి ఇందుకు దోహదంచేస్తున్నట్లు అంచనావేసింది. నీతి ఆయోగ్ పాలసీ లక్ష్యాలు, ప్రభుత్వ మద్దతు, మౌలికవనరుల ఆధునీకరణ, వ్యూహాత్మక పెట్టుబడులతో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు భారీగా ఉంటాయని పిడబ్ల్యుసి అంచనావేసింది. మొబైల్‌ఫోన్లు, సెమికండక్టర్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ వంటివాటిలో వృద్ధికి అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు అంచనావేసింది. భారత్‌ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌తో ఉంది. ఈ మొబైల్‌మార్కెట్, వేరబుల్స్ రంగాన్ని 2030 నాటికి 159 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఐటి హార్డ్‌వేర్ మార్కెట్ 32 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ రంగంలో డేటా సర్వర్లకు అత్యధిక డిమాండ్ ఉంది. డిజిటైజేషన్ వృద్ధి, కృత్రిమమేధ అమలు, క్లౌడ్ సేవలతో మరింత వృద్ధికి ఆస్కారం ఉందని ప్రైస్‌వాటర్ కూపర్స్ తెలిపింది. ఇక భారత టెలికాం మార్కెట్ గడచిన ఐదేళ్లలో ఆరురెట్లు పెరిగింది. 65శాతం 5జి డేటా 2026నాటికి వృద్ధిచెందుతుందని అంచనా. అందువల్లనే నెట్‌వర్క్ ఇన్‌ఫ్రా, ఎలక్ట్రానిక్స్ సంబంధిత పరికరాలకు డిమాండ్ పెరుగుతుందని అంచనావేసింది. ఇక ఈవీఛార్జర్లు, స్మార్ట్ ఉత్పత్తి వ్యవస్థలు ఆటోమేషన్ టెక్నాలజీలు మరింతగా పెరుగుతాయని పిడబ్ల్యుసి అంచనావేసింది. అయితే ఇందుకు మూలధన వ్యయం సవాలుగా మారుతుంది. ఇన్‌ఫ్రా ఆధునీకరణ, రవాణా వ్యవస్థలు, దీర్ఘకాలిక పాలసీల అమలు, సులభశైలి వాణిజ్యం అమలుకు రావాలి. అందువల్లనే భారత్ పబ్లిక్‌ప్రవేటు భాగస్వామ్యాన్ని ఎక్కువ ప్రోత్సహిస్తోంది. దీనికి తోడు మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ప్రణాళికలు కార్యాచరణలతో విదేశీ కంపెనీలు భారత్ భాగస్వామ్యంతో దేశంలోనే ఉత్పత్తికి ముందుకువస్తున్నాయి. లేదా టెక్నాలజీని నూరుశాతం బదలీకిసైతం అంగీకరిస్తున్నాయి. వాటిలో ఫాక్స్‌కాన్, యాపిల్, వేదాంత వంటి భారీ సంస్థలు పెట్టుబడులకు వస్తున్నాయి. వారు విస్తరణకు వెళ్లడం లేదా సెమికండక్టర్, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్‌లో ప్రవేశించడం వంటివిచేస్తున్నారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.